Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 238 మేడ్చల్ మల్కాజ్‌గిరి 17 సెప్టెంబర్ 2023 ఆదివారం పేజీలు : 4

## చంద్రబాబుకు మద్దతు ఇద్దాం..

### తెలుగువారంతా కదలిరండి

బెంగళూరు : చంద్రబాబుపై అక్రమ కేసులను నిరసిస్తూ బెంగళూరు టీడీపీ ఫోరం నిరసన చేపట్టనుంది. ఒక ప్రకటనలో మాట్లాడిన ఫోరం నాయకులు నాలుగున్నర దశాబ్దాల పాటు రాజకీయంగా వివిధ హోదాలలో కొనసాగి అవినీతికి తావు లేకుండా, నిరంతరం అభివద్ధే ధ్యేయంగా పని చేసిన చంద్రబాబు నాయుడుపై కుట్ర పూరిత కేసులతో జైలుపాలు చేశారన్నారు. ఏపీ ప్రభుత్వంపై నిరసనగా, బాబుకు సంపూర్ణంగా మద్దతు ఇద్దామని ఫోరం నాయకులు పేర్కొన్నారు. బెంగళూరు ఫ్రీడం పార్కులో జరిగే నిరసనకు కదిలిరావాలని పిలుపునిచ్చారు.

# పాలమూరు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు ఇది

## పాలమూరు ఎత్తిపోతలను ప్రారంభించిన సీఎం కేసీఆర్



కొల్లాపూర్ : మహబూబ్‌నగర్, రంగారెడ్డి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు ఇవాళ అని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. ఒకప్పుడు పాలమూరు బిడ్డ హైదరాబాద్‌లో అడ్డా కూలీ. కానీ ఇవాళ పాలమూరుకు పొరుగు రాష్ట్రాల నుంచి కూలీలు వస్తున్నారు. స్థానికులు ఇక్కడే తమ పొలాలు పని చేసుకుంటున్నారు. పాలమూరు బిడ్డల మారిన ముఖచిత్రం ఇది అని కేసీఆర్ తెలిపారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభించిన అనంతరం కొల్లాపూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో కేసీఆర్ ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమంలో పర్యటించినప్పుడు.. మీకు మాటిచ్చాను. రాష్ట్రం వస్తేనే సకల దరిద్రలు మాయవవుతాయి అని తెలిపాను. మన హక్కులు, నీళ్లు వస్తాయని చెప్పాను. కష్టపడి కొట్లాడి తెలంగాణ సాధించుకున్నాం. పాలమూరు ఎంపీగానే తెలంగాణ సాధించాను. ఇది ఒక చరిత్ర. ఈ జిల్లా కిర్తికీరిటంలో శాశ్వతంగా ఉంటుంది. మొత్తం తెలంగాణలో అంచనాలు వేసుకుని, మనకు రావాల్సిన వాటాలు లెక్కలు కట్టుకుని మూడు పెద్ద ప్రాజెక్టులు చేపట్టాం. కాళేశ్వరం, సీతారామ, పాలమూరు ఎత్తిపోతల.. ఈమూడు పూర్తయితే తెలంగాణ వజ్రం తునకలా తయారై దేశానికే అన్నం పెడుతాం. ఎన్ని అడ్డంకులు వచ్చినా కాళేశ్వరం పూర్తి చేసుకున్నాం. సీతారామ పనులు చకచక జరుగుతున్నాయి. పాలమూరు ఎత్తిపోతల కూడా మూడు నాలుగేండ్ల కిందనే పూర్తయితుండే. కానీ మహబూబ్‌నగర్‌లో ఉండే గత్తర బిత్తర నాయకులు అడ్డుకున్నారు. ఇక్కడ ఉండే దద్దమ్మ రాజకీయ నాయకులు శత్రువులుగా మారి ప్రాజెక్టు పనులను అడ్డుకున్నారు.

**2001లో గులాబీ జెండా ఎగిరిన తర్వాతే జూరాల పనులు..** 1975లో బచావత్ తీర్పు ఇచ్చే టైంలో మహబూబ్‌నగర్ నీళ్లు ఏవని నాటి పాలమూరు పాలకులు అడగలేదని కేసీఆర్ గుర్తు చేశారు. ఆంధ్రాతో తెలంగాణను కలపకుండా ఉంటే.. ఈ ప్రాంతం బాగుపడేది అని బచవాత్ జడ్జిలే అన్నారు. 17 టీఎంసీలతో జూరాల మంజూరు చేస్తున్నామని బచావత్ జడ్జిలే చెప్పారు. సాంకేతిక కారణాలు చెప్పి మేం చూసించిన చోటే కట్టాలని నిబంధన పెట్టారు. 1981 దాకా జూరాలలో ఆంధ్రా పాలకులు తట్టెడు మట్టి తీయలేదు. తెలంగాణ వ్యక్తి అంజయ్య సీఎం అయ్యాక శంకుస్థాపన చేశారు. 2001 గులాబీ జెండా ఎగిరిన తర్వాత.. మీటింగ్ పెట్టిన తర్వాత గర్జించిన తర్వాత చంద్రబాబును ప్రశ్నిస్తే.. సమగ్రాభివృద్ధి ఏంటని ప్రశ్నిస్తే.. జూరాల కాల్వ పనులు చేయించారని కేసీఆర్ గుర్తు చేశారు.

**కొల్లాపూర్‌కు వరాల జల్లు.. పాలిటెక్నిక్ కాలేజీ మంజూరు చేస్తాం :** ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కొల్లాపూర్ నియోజకవర్గంపై ముఖ్యమంత్రి కేసీఆర్ వరాల జల్లు కురిపించారు. కొల్లాపూర్ పట్టణం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి నుంచి రూ. 25 కోట్లు మంజూరు చేస్తున్నానని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. నార్లాపూర్ వద్ద పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభించిన అనంతరం కొల్లాపూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో కేసీఆర్ ప్రసంగించారు. కొల్లాపూర్ పట్టణానికి మంజూరు చేసిన ప్రత్యేక ఫండ్‌తో బ్రహ్మాండంగా మిగిలిన పనులన్నీ చేయాలని కోరుతున్నాను అని కేసీఆర్ తెలిపారు. కొల్లాపూర్‌కు ఒక ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీని కూడా మంజూరు చేస్తాం. రెండు, మూడు లిఫ్టులు అడిగారు. జిల్ దార్ తిప్ప లిఫ్ట్, బాచారం హై లెవల్ కెనాల్, పసుపుల బ్రాంచ్ కెనాల్ వైడనింగ్, లైనింగ్, మల్లేశ్వరం మినీ లిఫ్ట్ కావాలని అడిగారు. అధికారుల చేత సర్వే చేయించి తప్పకుండా మంజూరు చేస్తాను. రూ. 10 కోట్లతో బోడగట్టు చెక్ డ్యాంకు రేపే జీవో ఇస్తాం. కొల్లాపూర్ వెనుకబడ్డ నియోజకవర్గం కాబట్టి.. ఈ రోజు ప్రకటిస్తున్నాను. సర్పంచ్‌లకు తీపి కబురు చెబుతున్నాను. కొల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామపంచాయతీకి రూ. 15 లక్షల చొప్పున ప్రత్యేక ఫండ్ మంజూరు చేస్తున్నాను. మంచి కార్యక్రమాలు చేపట్టాలి. మహబూబ్‌నగర్ పట్టణంలో పెద్దగా ఇంజినీరింగ్ కాలేజీలు లేవు. మహబూబ్‌నగర్ పట్టణంలో కూడా జేఎన్‌టీయూ ద్వారా ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేస్తాం. నన్ను ఎంపీగా చేసి, తెలంగాణను సాధించుకున్నాం. కాబట్టి.. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి 1000 ఇండ్ల చొప్పున ఎక్కువ ఇస్తాం. ఆర్డర్లు కూడా ఇచ్చాం. ఆ రకంగా నన్ను ఎంపీగా చేసి, తెలంగాణ సాధించేంత యోధుడిగా చేసినందుకు పాలమూరు ఎప్పుడు నా గుండెల్లో ఉంటుంది. భవిష్యత్‌లో కూడా మీ దీవెన ఉండాలని కోరుకుంటున్నాను అని కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.



## తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావటం ఖాయం

హైదరాబాద్: కాంగ్రెస్ విజయభేరి సభతో సీఎం కేసీఆర్‌కు మైండ్ బ్లాక్ అవుందని ఆ పార్టీ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. శనివారం నాడు గాంధీభవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావటం ఖాయమని స్పష్టం చేశారు. లక్షల మందితో తుక్కుగూడలో సోనియా గాంధీ సభ జరగబోతోందన్నారు. ఎన్నికల హామీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని చెప్పారు. రైతులతో సహా.. కేసీఆర్ ప్రభుత్వం అన్నివర్గాలను మోసం చేసిందని కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.



## మ్యానిఫెస్టోను సోనియా డిక్లేర్ చేయబోతున్నారా ?

హైదరాబాద్ : ఈనెల 17వ తేదీన హైదరాబాద్ కు సమీపంలోని తుక్కుగూడలో జరగబోయే భారీ బహిరంగ సభలో సోనియా గాంధీ మ్యానిఫెస్టోను రిలీజ్ చేయబోతున్నట్లు సమాచారం. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అండ్ కో చురుగ్గా చేస్తోందట. అదేరోజు మూడు డిక్లరేషన్లను కలిపి సోనియా ప్రకటించబోతున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. మైనారిటీ, బీసీ, మహిళా డిక్లరేషన్లతో పాటు మ్యానిఫెస్టోలోని కీలక అంశాలను ఇప్పటికే పీసీసీ నేతలు సోనియాకు పంపారట. రెండు రోజులుగా మూడు డిక్లరేషన్లపై డీటైల్డ్ గా అధ్యయనం చేసిన తర్వాత ఇన్ పుట్స్ ను సోనియాకు పంపబోతున్నారు. అన్నింటినీ కలిపి 17వ తేదీ తెలంగాణా విమోచనం రోజున బహిరంగసభలో సోనియా కీలక ప్రకటన చేయబోతున్నారు. అక్కడి నుండే మ్యానిఫెస్టోను డిక్లేర్ చేసినట్లుగా కాంగ్రెస్ నేతలు మొత్తం 119 నియోజకవర్గాల్లో భారీ ప్రచారాన్న ప్రారంభించబోతున్నారు. రాబోయే ఎన్నికల్లో ఎలాగైనా సరే అధికారంలోకి రావాలన్నది కాంగ్రెస్ సీనియర్ల పట్టుదల. ఎందుకంటే ప్రత్యేక తెలంగాణా ఏర్పడిన తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. రాబోయే ఎన్నికల్లో కూడా ఓడిపోతే హ్యాట్రిక్ ఓటములను నమోదుచేసుకున్నట్లు లెక్కవుతుంది. పార్టీ ఓటములు నమోదవ్వటం ఎలాగున్నా పార్టీ కనుమరుగైపోవటం ఖాయం. ఎందుకంటే వరుసగా రెండు ఎన్నికల్లో ఓడిపోయిందంటే పదేళ్ళు ప్రతిపక్షంలో ఉందనిలెక్క. ఈ పదేళ్ళు సరిపోదన్నట్లుగా మరో ఐదేళ్ళు కూడా ప్రతిపక్షానికే పరిమితం అవ్వటం అంటే పార్టీ కనుమరుగు అయిపోతున్నట్లుగానే భావించాలి. తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఒడిస్సా, ఉత్తరప్రదేశ్, గుజరాత్, బీహార్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారానికి దూరమై దశాబ్దాలైపోయింది. అందుకనే పై రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఉందంటే ఉందన్నట్లుగా తయారైంది. వీటిల్లో బీహార్లో పరిస్ధితి నయమనే చెప్పాలి. రేపటి ఎన్నికల్లో ఓడిపోతే తెలంగాణాలో కూడా పరిస్ధితి అలాగే తయారవుతుందనటంలో అనుమానం లేదు. ఏపీలో పార్టీ పరిస్ధితి ఆ దిశగా వెళుతోంది. రెండు వరుసఎన్నికల్లో పార్టీ అభ్యర్ధుల్లో అత్యధికులకు డిపాజిట్లు కూడా రాలేదు. ఈ విషయాలు గుర్తుపెట్టుకున్నారు కాబట్టే తెలంగాణాలోని సీనియర్లు కాస్త జాగ్రత్తగా ఉంటున్నారు. మరి చివరకు ఏమి జరుగుతుందో చూడాలి.



## తెలంగాణపై 'కమలం' ఫోకస్!

### ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు సీట్లలో ప్రత్యేక ప్రణాళికలు అమలు

### తెలంగాణ ముఖ్య నేతలంతా అసెంబ్లీకే! ఎంపీలు కూడా వెంటనే సన్నద్ధం కావాలని రాష్ట్ర నేతలకు సూచన

### ఇకపై చేరికల వేగం మరింత పెంచాలని ఆదేశాలు

హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపించడంతో బీజేపీ తన వ్యూహాలకు పదునుపెడుతోంది. దక్షిణాదిలో పార్టీ విస్తరణ, తెలంగాణలో అధికార సాధన లక్ష్యంగా కార్యాచరణకు తుదిరూపునిస్తోంది. లోక్‌సభ ఎన్నికల కంటే ముందే శాసనసభ ఎన్నికలు జరగనుండటంతో.. రాష్ట్ర పార్టీకి చెందిన ముఖ్యనేతలంతా (ఎంపీలు సహా) తమకు పట్టున్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీకి సిద్ధం కావాలని బీజేపీ అగ్రనాయకత్వం ఆదేశించినట్టు తెలిసింది. దీనికి సంబంధించి ఇప్పటికే ఆలోచన ఉన్నా.. రెండు రోజులుగా ఢిల్లీలో పార్టీ ముఖ్యనేతలతో రాష్ట్ర నాయకుల సమావేశాల సందర్భంగా స్పష్టత వచ్చినట్టు సమాచారం. దక్షిణాది రాష్ట్రాల ఎంపీలతో ప్రధాని మోదీ ప్రత్యేకంగా భేటీ అయినప్పుడు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ నాయకత్వం సన్నద్ధమవుతున్న తీరుపై ఆరా తీసినట్టు తెలిసింది. 2019 ఎన్నికలతో పోల్చితే దక్షిణాది నుంచి ఎక్కువగా ఎంపీ సీట్లు గెలిచేందుకు అవసరమైన వ్యూహాలను సిద్ధం చేసుకోవాలని మోదీ సూచించినట్టు బీజేపీ వర్గాలు చెప్పా యి. ఈ క్రమంలో పార్టీ విస్తరణకు తెలంగాణ అనుకూలంగా ఉందని పేర్కొన్నారని అంటున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధమవడంలో భాగంగా చేరికల వేగం పెంచాలని.. అన్ని అసెంబ్లీ స్థానాల్లో క్షేత్రస్థాయి నుంచి వివిధరూపాల్లో కార్యక్రమాల నిర్వహణ చేపట్టాలని ఆదేశించారని వెల్లడించాయి. ప్రధానంగా రాష్ట్రంలోని 19 ఎస్సీ, 12 ఎస్టీ రిజర్వ్‌డ్ సీట్లలో పార్టీ బలోపేతానికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయాలని.. ఆయా చోట్ల తప్పనిసరిగా బహిరంగ సభలు నిర్వహించాలని, వాటిలో ముఖ్యనేతలు పాల్గొనేలా చూడాలని సూచించారని తెలిపాయి.

**బీఆర్ఎస్ వైఫల్యాలను నిలదీసేలా..** రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కారు వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలపై అంశాల వారీగా ఆందోళనలు చేపట్టాలని బీజేపీ నిర్ణయించింది. స్థానికంగా నిరసన కార్యక్రమాలు చే పట్టేందుకు ఏర్పాట్లు చేస్తోంది. డబుల్ బె డ్రూం ఇళ్లు, దళితబంధు వంటి ప్రధాన అంశాలపై బీఆర్ఎస్‌ను ఇరకాటంలో పెట్టేలా కార్యాచరణను రూపొందిస్తోంది.

మరో నాలుగు నెలల్లోనే అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక, ఎన్నికల వ్యూహాల అమలుకు జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నా యి.

ఈ క్రమంలోనే అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సభలు, ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాలను పూర్తి చేయాలని నిర్ణయించారు.

**అట్టహాసంగా విమోచన దినం..** సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచనదినాన్ని పురస్కరించుకుని రక్షణశాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదికగా నిర్వహించనున్న జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరు కానున్నారు. కాంగ్రెస్ సభకు పోటీకి బీజేపీ శ్రేణులు కూడా ఈ వేడుకలకు భారీగా జనాన్ని సమీకరించాలని నిర్ణయించారు. కంటోన్మెంట్, సికింద్రాబాద్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, ముషీరాబాద్, అంబర్ పేట్, కూకట్‌పల్లి, సనత్‌నగర్, ఎల్బీనగర్, మహేశ్వరం, కల్వకుర్తి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల నుంచి కనీసం యాభై వేల మందిని తరలించాలని నిర్ణయించారు. ఈ మేరకు బూత్ కమిటీల వారీగా టార్గెట్లు కూడా ఇచ్చారు. ఈ కార్యక్రమంతో తమ సత్తా చాటాలని రాష్ట్ర నేతలు పట్టు మీదున్నారు.

# సంపాదకీయం

## ఒకేసారి ఎన్నికలు 9 రాష్ట్రాలకా.. 11 రాష్ట్రాలకా?

ఈ ఏడాది డిసెంబర్ లో ఐదు రాష్ట్రాలు.. తెలంగాణ, రాజస్థాన్, ఛత్తీస్ గఢ్, మిజోరాం, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. అయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'ఒకే దేశం – ఒకే ఎన్నికలు' కు మొగ్గు చూపుతోందని వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ ఐదు రాష్ట్రాల తోపాటు వచ్చే ఏడాది వేసవిలో ఎన్నికలు జరగాల్సి ఉన్న ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ లకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడానికి బీజేపీ ప్రభుత్వం నిర్ణయించిందని టాక్ నడుస్తోంది. ఈ 9 రాష్ట్రాల తోపాటు వచ్చే ఏడాది నవంబర్ లో ఎన్నికలు జరగనున్న మహారాష్ట్ర, హరియాణా రాష్ట్రాలను కూడా కలుపుకుని మొత్తం 11 రాష్ట్రాలకు, లోక్ సభకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడానికి కేంద్రం నిర్ణయించిందని తాజాగా ఒక వార్త జాతీయ మీడియాలో హల్చల్ చేస్తోంది. ఒకేసారి 11 రాష్ట్రాలకు ఎన్నికలు జరపాలంటే కేంద్ర ప్రభుత్వం కొన్ని రాష్ట్ర ప్రభుత్వాల కాల పరిమితిని పొడిగించాల్సి ఉంటుంది. అలాగే కొన్ని రాష్ట్ర ప్రభుత్వాల కాల పరిమితిని తగ్గించాల్సి ఉంటుందని చెబుతున్నారు. షెడ్యూల్ ప్రకారం.. ఈ ఏడాది డిసెంబర్ లోగా తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్, మిజోరాంల్లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఇక షెడ్యూల్ ప్రకారం.. లోక్ సభకు వచ్చే వేసవిలో అంటే ఏప్రిల్/మే నెలల్లో ఎన్నికలు జర గాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికలకు మొగ్గు చూపితే డిసెంబర్ లో ఎన్నికలు జరగాల్సిన ఐదు రాష్ట్రాలు.. తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్, మిజోరాం ప్రభుత్వాలను వచ్చే ఏడాది వేసవి వరకు పొడిగించాల్సి ఉంటుంది. అలాగే షెడ్యూల్ ప్రకారం.. వచ్చే ఏడాది నవంబర్ లో ఎన్నికలు జరగాల్సి ఉన్న హరియాణా, మహారాష్ట్రల ప్రభుత్వాలను వచ్చే ఏప్రిల్/మేకే కుదించాల్సి ఉంటుంది. అంటే ఆ ప్రభుత్వాలకు దాదాపు ఆరు నెలల కాలపరిమితి తగ్గిపోతుంది. ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలే ఉన్నాయి కాబట్టి.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం లేదు. ఇక ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, ఒడిశాలకు వచ్చే ఏడాది వేసవిలోనే ఎన్నికలు జరగాల్సి ఉంది కాబట్టి కేంద్రానికి ఎలాంటి ఇబ్బందులు లేవు. కాబట్టి ఒకేసారి అటు పార్లమెంటుకు, ఇటు 11 రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరపాలని కేంద్రం భావిస్తున్నట్టు సమాచారం. ఒకవేళ ఇలా కాకుంటే ముందస్తు ఎన్నికలకు మొగ్గు చూపితే.. వచ్చే ఏడాది వేసవి వరకు కాలపరిమితి ఉన్న ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలను నాలుగైదు నెలలకు ముందుగానే అంటే ఈ ఏడాది డిసెంబర్ లోనే ఐదు రాష్ట్రాలు.. తెలంగాణ, మిజోరాం, రాజస్థాన్, ఛత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్ లతోపాటే ఎన్నికలు నిర్వహిస్తారని అంటున్నారు. ఇలా మొత్తం తొమ్మిది రాష్ట్రాలకు, పార్లమెంటుకు కూడా ముందస్తు ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉంటే ఎన్నికలు నిర్వహించవచ్చని చెబుతున్నారు. దీనికి సంబంధించి ఈ నెల 18 నుండి 22 వరకు జరగబోయే పార్లమెంటుప్రత్యేక సమావేశాల్లో క్లారిటీ వస్తుందని టాక్ నడుస్తోంది. జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలపై అధ్యయనానికి మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలో ఇప్పటికే ఓ కమిటీని ఏర్పాటు కూడా ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.




ఆదిలాబాద్ : లోయర్ పెన్ గంగా ప్రాజెక్టులో భాగంగా కోర్టా – చనకా బ్యారేజీ నిర్మాణం పనులు చేపట్టి ఆరేళ్లయినా అరకం భూమి కూడా తడవలేదు. మహారాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో పెన్‌గంగా నదిపై నిర్మిస్తున్న కోర్టా – చనకా బ్యారేజీ పనులకు నిధుల కొరత ఆటంకంగా మారుతోంది. ఆరేళ్ల క్రితం రూ.386కోట్ల అంచనా వ్యయంతో లోయర్ పెన్‌గంగా ప్రాజెక్టు పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఐదు సార్లు పనుల గడువు సమయాన్ని పొడగించారు. ప్రతి యేటా పెన్‌గంగా నదికి భారీ వరదలు రావడంతో పనులను అర్ధాంతరం గానే నిలిచి పోతున్నాయి. బ్యారేజీ నిర్మాణం, హత్తిఘాట్ పంప్‌హౌస్ పనులు దాదాపుగా పూర్తి దశకు చేరుకున్న కాలువల నిర్మాణం పనుల్లో జాప్యం జరుగుతోంది. మే చివరి నాటికి పంప్‌హౌస్ డ్రై రన్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్న ఆయకట్టుకు సాగునీరు అందడం అనుమానంగానే కనిపిస్తోంది. ఇటీవల సీఎంవో స్మితా సబర్వాల్ పర్యటించి పనుల్లో వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించిన భూసేకరణ తీవ్ర సమస్యగా మారుతోంది. ప్రధానంగా నిధుల విడుదలలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. సీఎం కేసీఆర్ మూడేళ్ల క్రితం కో ర్టా–చనకా బ్యారేజీని సందర్శించి పనులను మరింత వేగ వంతం పెంచాలని సంబంధిత అధికారులతో పాటు కాం ట్రాక్ట్ కంపెనీలను హెచ్చరించారు. అయినా పనులు ఊపందుకోవడమే లేదు. దీంతో ఈ యేడు కూడా ఆయకట్టుకు సాగునీరు అందించడం అనుమానంగానే కనిపిస్తోంది. నిలిచి పోయిన కాలువల నిర్మాణంప్రధానంగా కాలువల నిర్మాణం పనులు పూర్తయితేనే ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉంది. కానీ భూసేకరణ ప్రధాన సమస్యగా మారుతోంది. ఇప్పటికే సర్వే పనులను చేపట్టిన ప్రభుత్వం నిధులను మంజూరు చేయక పోవడంతో అర్ధాంతరంగానే నిలిచి పోయింది. మరో రెండు మాసాల్లో వర్షాకాలం ముంచుకొస్తుండడంతో పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉంది. దీంతో కాలువల నిర్మాణం పనులు ముందుకు సాగడం కష్టంగానే కనిపిస్తోంది. అసలే నల్ల రేగడి నేలలు కావడంతో చిన్న పాటి వర్షాలకే బురదమయమై పనులకు ఇబ్బందులు ఎదురుకానున్నాయి. ప్రధాన, ఉపకాల్వల పనులు పూర్తిగా నిలిచి పోయే ప్రమాదం ఉంది. ఒక వేళ బ్యారేజీ, హత్తిఘాట్ పంప్‌హౌస్ పనులు పూర్తయిన కాల్వల పనులు పూర్తికాక పోవడంతో ఎలాంటి ప్రయోజనం ఉండదంటున్నారు. ఇప్పటికే పంపుమోటార్లను బిగించిన చిన్న పాటి మరమ్మతులు కొనసాగుతున్నాయి. మేలో పంపులను డ్రై రన్ చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. కానీ కాల్వల నిర్మాణం పూర్తికాక పోవడంతో ఆయకట్టుకు సాగునీరు అందడం కష్టంగానే కనిపిస్తుంది. ఒక వేళ మోటార్ పంపుసెట్లు డ్రైరన్ పూర్తయిన కాల్వల నిర్మాణం పనులు పూర్తికాకుంటే ఎలాంటి ప్రయోజనం ఉండదంటున్నారు. అంచనా వ్యయం పెంచినా.. అంతే సంగతికోర్టా – చనకా బ్యారేజీ నిర్మాణం పనులకు రాష్ట్ర ప్రభుత్వం అంచనా వ్యయాన్ని పెంచిన పనుల్లో పురోగతి కనిపించడం లేదు. మొదట రూ.386కోట్ల అంచనా వ్యయంతో బ్యారేజీ నిర్మాణం పనులను చేపట్టింది. ఇటీవల రూ.765కోట్లకు అంచనా వ్యయాన్ని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవోను జారీ చేసింది. ఇందులో దుమ్ముగూడెం నుంచి తరలించిన మోటార్ పంపుల విలువ రూ.110 కోట్లు, సబ్‌స్టేషన్, విద్యుత్ టవర్ లైన్‌ల పనుల కోసం రూ.60కోట్లు, 12శాతం జీఎస్టీ, పెరిగిన ధరల విలువ, మహారాష్ట్ర వైపు నిర్మించాల్సిన పనులకు నిధుల కేటాయింపు, ప్రభుత్వ డిపాజిట్లు, పంపుమోటార్‌ల డిజైన్ మార్పు, గేట్ల సామర్థ్యం పెంపు లాంటి పనులకు అంచనా వ్యయాన్ని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సుమారుగా రూ.170కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇప్పటి వరకు చేపట్టిన పనులకు గాను రూ.50కోట్లు, విద్యుత్ టవర్ పనులకు రూ.20కోట్లు, మరో రూ.100 కోట్లు భూసేకరణకు చెల్లించాల్సి ఉందని అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. ఇన్నాళ్లు బిల్లుల కోసం ఎదురు చూడకండానే ఎలాగో పనులు చేపట్టిన కాంట్రాక్ట్ కంపెనీలు బిల్లులకు సంబంధించిన నిధుల విడుదలలో ప్రభుత్వం తీవ్ర జాప్యంచేయడంతో ఇక చేసేది లేక చేతులెత్తేస్తున్నారు. పెండింగ్ బిల్లుల కోసం నెలల తరబడి హైదరాబాద్‌లోనే మకాం వేసి ప్రయత్నాలు చేసినా నయా పైసా కూడా విడుదల కావడం లేదంటున్నారు. మేలో డ్రైరన్ నిర్వహిస్తాం..– శ్రీనివాస్‌రెడ్డి లోయర్ పెన్‌గంగా చీఫ్ ఇంజనీర్ఇప్పటికే బ్యారేజీ నిర్మాణం పనులు దాదాపుగా పూర్తియినట్లే. చిన్నపాటి మరమ్మత్తులు చేపట్టి నీటిని నిల్వ చేసేందుకు సిద్ధం చేస్తాం. ప్రధానంగా భూసేకరణ పనులు చేపట్టాల్సి ఉంది. దీంతో కాలువల పనులు ముందుకు సాగడం లేదు. కొనసాగుతున్న పనులకు కొంత వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే ప్రభుత్వం అంచనా వ్యయాన్ని పెంచడంతో పనులను వేగవంతంగా పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నాం. మే చివరి నాటికి పంపుహౌస్ పనులను పూర్తి చేసి డ్రైరన్ నిర్వహిస్తాం. వచ్చే జూన్, జూలైలో పంపుల ద్వారా నీటిని ఎత్తి పోసే ప్రక్రియ ప్రారంభమవుతుంది.

## వడి వడిగా మండపం పనులు




హనుమకొండ : దశాబ్దకాలంగా నత్తనడకన సాగుతున్న హనుమకొండ వేయిస్తంభాలగుడి కల్యాణ మండపం పునరుద్ధరణ పనుల్లో వేగం పెరిగింది. రూ.7.50కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన మండపం పనులు నిధుల కొరత వల్ల ఇన్నాళ్లు మందకొడిగా సాగుతూ వచ్చాయి. స్థపతికి బిల్లులు చెల్లించకపోవడంతో దాదాపు రెండున్నరేళ్ల పాటు నిలిచిపోయాయి. కేంద్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించడంతో పనుల్లో వేగం పెరిగింది.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చొరవకేంద్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మండపం పనులపై దృష్టి సారించారు. స్థపతికి రావాల్సిన బిల్లులను చెల్లించేట్టు చూస్తానని భరోసా ఇవ్వడంతో నాలుగు నెలలుగా పనులు వేగంగా పుంజుకున్నాయి. ఇప్పటికే మూడుసార్లు మండపాన్ని సందర్శించారు. పనుల ప్రగతిని ప్రత్యక్షంగా పరిశీలించారు. వీలైనంత త్వరగా పూర్తి చేయాల్సిందిగా ఒత్తిడి తీసుకువస్తున్నారు. నగరానికి వచ్చిన కిషన్‌రెడ్డి మరోమారు వేయిస్తంభాల గుడిని సందర్శించి మండపం పనులను పరిశీలించారు. డిసెంబర్ లోగా ఎట్టిపరిస్థితుల్లో పూర్తి చేయాలని స్థపతిని కోరారు. మండపం పనుల సత్వర పూర్తితో పాటు వేయిస్తంభాలగుడి ప్రాంగణం సుందరీకరణకు, ఇతర అభివృద్ధి పనులకు రూ.15కోట్లు మంజూరు చేసినట్టు ప్రకటించారు. నిధులు అందుబాటులోకి రానుండడంతో పునరుద్ధరణ పనులు మరింత వేగం పుంజుకోనున్నాయి.

పైకప్పు పనులుమండపం పైకప్పు పనులు మే మొదటి వారంలో ప్రారంభం కానున్నట్టు స్థపతి బాలక్రిష్ణన్ శివకుమార్ తెలిపారు. మే 1వ తేదీన 50 టన్నుల సామర్థ్యం కలిగిన భారీ క్రేన్‌ను వినియోగంలోకి తెస్తున్నట్టు తెలిపారు. ఈ క్రేన్ సహాయంతో స్తంభాలు, అడ్డ బీములను పైకి ఎత్తి కప్పుపై భాగాన అమర్చుతారు. పునరుద్ధరణ పనుల్లో ఇదే కీలకఘట్టం. చివరి పని కూడా. అత్యంత సంక్లిష్టమైన ఈ పనిని పూర్తి చేస్తే మండపం పనులు దాదాపు పూర్తయినట్టే. ఇప్పటివరకు 75 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన 25 శాతం పనుల్లో పైకప్పు నిర్మాణంతో పాటు మరికొన్ని పనులు పూర్తి చేయాల్సి ఉంది. పైకప్పులో అమర్చే అడ్డ బీములు, నిలువు బీముల్లో కొన్ని లేవు. వీటి స్థానంలో కొత్తవాటిని తయారు చేస్తున్నారు. ఇందుకు అనువైన, అదే రంగు కలిగిన రాయిని ఉర్సుగుట్ట సమీపంలోని అమ్మవారిపైటలోని క్వారీ నుంచి సేకరిస్తున్నారు. ముడిరాయిని మండపం వద్దకు తీసుకువచ్చి ఆవరణలోనే శిల్పులు చెక్కుతున్నారు. ఈ పని రెండు మూడు నెలల్లో పూర్తవుతుంది.

ఇప్పటి వరకు..కల్యాణ మండపంలో అత్యంత ముఖ్యమైన బేస్‌మెంట్ పని ఇది వరకే పూర్తయింది. బేస్‌మెంట్ పునర్నిర్మాణంలో కాకతీయులు అనుసరించిన సాండ్‌బాక్స్ టెక్నాలజీనే వినియోగించారు. ఇసుక అధారంగా పునాది నిర్మాణం జరిగింది. దీనిపై ప్రదక్షిణపాద కక్ష్యాసనం కూడా పూర్తయింది. ఇటీవల దక్షిణం వైపు మిగిలిపోయిన ప్రదక్షిణపాదాన్ని పూర్తిచేశారు. పిల్లర్లు నిలబెట్టి వాటి ఆధారంగా నాలుగువైపులా రాతిగోడలను నిర్మించడం కూడా పూర్తయింది. తూర్పు, పడమర, ఉత్తర ద్వారాలను నిలబెట్టారు. ప్రస్తుతం ఒక దక్షిణ ద్వారం మాత్రమే మిగిలి ఉంది. పనులు చేసే క్రమంలో దారి కోసం ఇప్పటి వరకు ఈ ద్వారాన్ని నిలబెట్టలేదు. త్వరలో ఈ పని కూడా పూర్తవుతుంది. దక్షిణం వైపు ద్వారాన్ని ఏర్పాటుతో పాటు పైకప్పు పూర్తికి 160 బీములను వినియోగించాల్సి ఉంటుంది. ఇందులో ఇప్పటివరకు 55 బీములను నిలబెట్టారు. మరో 105 బీములు, పిల్లర్లను అమర్చాల్సి ఉంది. వీటిలో 75 పాత బీములు ప్రస్తుతం అమర్చడానికి అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు 30 కొత్తవాటిని కూడా సిద్ధం చేస్తున్నారు. పిల్లర్లలో 16 లోపల, 24 బయట అమర్చాల్సి ఉంది. విరిగిపోయిన 50 బీములను ప్రత్యేక పద్ధతిలో అతికించారు. వీటినికూడా త్వరలో మండపం పునర్నిర్మాణంలో అమర్చుతారు.

పర్యవేక్షణకేంద్ర పురావస్తుశాఖ సూపరింటెండెంట్ స్మితా ఎస్. కుమార్, ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండు రంగారావు, పురావస్తుశాఖ కన్సర్వేషన్ అసిస్టెంట్ మల్లేశం, కేంద్ర పురావస్తు శాఖ ఇంజనీర్ కృష్ణ చైతన్య పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్నారు. మండపానికి పూర్వరూపాన్ని తీసుకువచ్చిన తర్వాత డిసెంబర్ నెలాఖరు నాటికి సందర్శకులకు అందుబాటులోకి రావచ్చునని తెలుస్తోంది. ఈలోగా కేంద్రం ఇచ్చిన రూ.15కోట్లతో వేయిస్తంభాలగుడి సుందరీకరణ పనులను పూర్తి చేస్తారు.

## నాసిన్ చెరువు శుద్ధీకరణ

రంగారెడ్డి : : చెరువుల శుద్ధీకరణకు పూనుకుంది దమ్మాయిగూడ మున్సిపల్ పాలకవర్గం. మురుగునీటితో నిండిన చెరువులను స్వచ్ఛంగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తోంది. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో నాసిన్ చెరువు, కోపులకుంట, కుమ్మరికుంట జలాశయాలున్నాయి. దాదాపు 30ఏళ్ల క్రితం వరకు ఆ చెరువుల చుట్టూ ఆయకట్టును ఆ నీటితోనే సాగు చేశారు. పశువుల దప్పిక తీర్చేందుకు ఆ నీటినే వినియోగించేవారు. ఆ చెరువుల్లో పెంచిన చేపలను విక్రయించి మత్స్యకారులు జీవనోపాధి పొందారు. కాగా కాల క్రమేణ దమ్మాయిగూడ నగరానికి చేరువలో ఉండటంతో పెద్దఎత్తున జనాలు ఇక్కడికి వలస వచ్చారు. ఈ తరుణంలో చెరువు పరివాహక ప్రాంతంలో అదే స్థాయిలో కాలనీలు వెలిశాయి. ఈ క్రమంలో ఇళ్ల నుంచి వెలువడిన వ్యర్థజాలాలు చెరువులోకి చేరడంతో మురుగుకూపంగా మారింది. ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. దీనికి తోడు పక్కనే జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఉండటంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. దోమల స్వైరవిహారంతో జనాలు తరచూ అంటు వ్యాధులబారిన పడుతున్నారు. ఈ క్రమంలో చెరువును శుద్ధిచేసేందుకు మున్సిపల్ పాలక వర్గం




చర్యలు చేపట్టింది. స్థానికులు మంత్రి మల్లారెడ్డికి మొర పెటుకోగా ఆయన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పాలకవర్గ దీక్ష, మంత్రి కృషితో ప్రయత్నం ఫలించింది. మురుగునీరు చెరువులో చేరకుండా ప్రత్యేకంగా భారీ పైపులైను వేసేందుకు హెచ్ఎండీఏ ముందుకువచ్చింది. అందుకుగాను రూ.రూ.7.10కోట్లను మంజూరు చేసింది. ఫిబ్రవరి24న మంత్రి చేతుల మీదుగా పనులు ప్రారంభించారు. ముందుగా ఎగువ నున్న దమ్మాయిగూడ చెరువు నుంచి పలు కాలనీల గుండా నాసిన్ చెరువు వరకు వేయాలనుకున్న పైప్‌లైన్ ప్రజల వినతి మేరకు నాగారం మున్సిపాలిటీకి అనుకుని ఉన్న కుమ్మరికుంట వరకు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. చెరువుల్లో మురుగునీరు చేరకుండా చర్యలతో పాటు మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చి దిద్దేందుకు ప్రాణాళికా బద్దంగా ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో మంత్రి మల్లారెడ్డి స్వయంగా పైప్‌లైన్ పనులను పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. చెరువు పరిసరాలను సుందరీకరించటతో అహ్లాదవాతావరణం నెలకొంటుందని, స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.రూ.7.10 కోట్లతో పనులు:–వసుపతి ప్రణీత, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్‌గతంలో శుద్ధ జలాలతో కళకళలాడిన చెరువు నేడు మురికి కూపంగా మారింది. తద్వారా స్థానికులు అనారోగ్యానికి గరౌతున్నారు. ఈ నేపథ్యంలో చెరువును శుద్ధి చేసి, మంచినీటితో నింపేందుకు చర్యలు తీసుకుంటున్నాం. హెచ్ఎండీఏ మంజూరు చేసిన రూ.7.10కోట్లతో ప్రత్యేక భారీ పైప్‌లైన్ నిర్మాణాన్ని చేపట్టాం. పనులు చురుకుగా కొనసాగుతున్నాయి.జూన్ మొదటి వారం నాటికి పనులు పూర్తి : – వెంకటేష్, ఏఈఈ, హెచ్ఎండీఏ దమ్మాయిగూడలోని నాసిన్ చెరువులో మురుగునీరు మళ్లింపు పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. వర్షాకాలం ప్రారంభం నాటికి (జూన్ మొదటి వారం) పైప్‌లైను నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ సంవత్సరం చెరువులో కేవలం వర్షం నీరు చేరేలా చర్యలు తీసుకుంటున్నాం.

## అసైన్డ్ భూములపై రియల్టర్ల కన్ను

రంగారెడ్డి : మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో ఉన్న అసైన్డ్‌భూములపై రియల్టర్ల కన్ను పడింది. గుట్టుచప్పుడు కాకుండా భూములు కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఎకరానికి రూ.17లక్షలకు కొంటామని రైతులకు ఆశ చూపుతూ అడ్వాన్స్‌లు కూడా ఇచ్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అసలు క్రయవిక్రయాలకు అవకాశం లేని అసైన్డ్ భూములను ఎందుకు కొంటున్నారో ఎవరికీ తెలియడం లేదు. అసైన్డ్ భూములను కొని రిజిస్ట్రేషన్ ఎలా చేసుకుంటారని రైతులు అడిగితే.. అదంతా మేము చూసుకుంటామని రియల్టర్లు సమాధానమిస్తున్నట్లు వదంతులు వినిపిస్తున్నాయి. ఈ విషయం బయటకు రాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.మొండిగౌరెల్లిలో సర్వే నెంబర్19లో 575ఎకరాల 30 గుంటలు, సర్వే నెంబర్ 68లో 788ఎకరాల 20 గుంటలు, సర్వేనెంబర్ 127లో 122ఎకరాల 22గుంటల అసైన్డ్ భూములున్నాయి. వీటిని కొనుగోలు చేయాలని నగరానికి చెందిన రియల్టర్లు చూస్తున్నారు. రైతులు ఈ భూములను రియల్టర్లకు విక్రయించడం కోసం గ్రామానికి చెం దిన కొందరు వ్యక్తులు ముందుండి వ్యవహారం నడిపిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అసైన్డ్ భూములు క్రయవిక్రయాలకు తావులేదని ఎవరైనా రైతులు నిలదీస్తే.. వారికి అదనంగా మరో రూ.10వేలు ఇస్తున్నారు. కేవలం మీరు రెవెన్యూ కార్యాలయానికి వచ్చి సంతకాలు పెడితే చాలు.. అంతా తామే చూసుకుంటామని రియల్టర్లు నమ్మిస్తున్నారు. వ్యవసాయాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్న రైతులను నయానభయాన ఒప్పించి భూములను విక్రయించేలా పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తుంది. కొంతమంది రైతులకు టోకన్ డబ్బు కూడా ముట్టినట్లు గ్రామంలో చర్చలు జరుగుతున్నాయి. ఈ భూముల క్రయవిక్రయాలపై ఇటీవల జరిగిన గ్రామసభలో కూడా చర్చ జరిగింది. భూములు క్రయవిక్రయాలు జరిపే వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై సర్పంచ్ బి.కృష్ణ వద్ద ప్రస్తావించగా..గ్రామసభలో చర్చకు వచ్చిందన్నారు. ఈ భూములు క్రయవిక్రయాలు జరగరాదన్నారు. ఒకవేళ అలా చేస్తే ప్రభుత్వం పీవోటీ కింద తీసుకుంటుందన్నారు.

అసైన్డ్ భూములు అమ్మితే చర్యలు మొండిగౌరెల్లి గ్రామంలో అసైన్డ్ భూములు క్రయవిక్రయాలు జరిపితే తగు చర్యలు తీసుకుంటాం. ఈ భూములపై ప్రభుత్వానికి అన్ని హక్కులున్నాయి. అసైన్డ్‌భూములకు రిజిస్ట్రేషన్ చేసే అధికారం మాకు లేదు. ఈ భూములను రాష్ట్ర ప్రభుత్వం తమ అవసరాలకు ఎప్పుడైనా తీసుకునే అధికారముంటుంది. అందుకే క్రయ విక్రయాలు జరపరాదు. – మహమూద్ అలీ, యాచారం తహసీల్దారు

# క్వారీల్లో కార్మికులకు భద్రత ఏదీ?

మహబూబాబాద్ : బండల కింద కార్మికుల బతుకులు చితికిపోతున్నాయి.. పలు క్వారీల్లో భద్రత గాలిలో దీపంగా మారింది.. అధికారుల పర్యవేక్షణ కొరవడి కార్మికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. నిబంధనలు పట్టించుకోకపోవడంతో కార్మికులు భయాందోళన మధ్య పనులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. బుధవారం ఉదయమే తీగలవేణి ప్రాంతంలోని ఓ క్వారీలో కార్మికుడు అమీర్‌పాష (60) మృతి చెందడంతో విషాదం నెలకొనగా ప్రభుత్వం కార్మికుల భద్రతా ప్రమాణాలపై దృష్టి సారించింది.

మహబూబాబాద్ జిల్లాలో 19 కంకర క్వారీలు 170 గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. నిర్వహణలో కొందరు నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. క్వారీల్లో బ్లాస్టింగ్ చేసేందుకు అనుమతులతోపాటు నిపుణుల పర్యవేక్షణ తప్పనిసరి. భూగర్భ గనులశాఖ భద్రత విభాగం ఈ అనుమతి పత్రాన్ని జారీ చేస్తుంది. జిలిటెన్ స్టిక్స్ వంటి మందు గుండు సామగ్రి ఉపయోగం, నిల్వ చేసేందుకు ఎక్స్‌ప్లోజివ్ విభాగం నుంచి లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖల నుంచి అనుమతులు పొందాలి. బ్లాస్టింగ్ జరిపేవారు ప్రభుత్వం నుంచి లైసెన్స్ కలిగి ఉండాలి. దస్త్రాల్లో అన్ని అనుమతులు పొందినట్లు చూపిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం సరైన రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో నిరుపేద కుటుంబాలకు చెందిన కార్మికులు మృత్యువాత పడుతున్నారు. జిల్లాలోని పలు కంకర క్వారీలు, గ్రానైట్ క్వారీల్లో జరిగిన ప్రమాదాలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తున్నాయి.

జిల్లాలో జరిగిన కొన్ని సంఘటనలు

2023 జూన్ 6న నెల్లికుదురు మండలం మీఠ్యాతండాలోని ఓ క్వారీలో పసునూరి శ్రీను ట్రాక్టర్ నడుపుతూ బోల్తా పడటంతో మృతి చెందాడు.

2022 డిసెంబరు 31న కురవి మండలం సమీపంలో గ్రానైట్ లారీలో తరలిస్తున్న గ్రానైట్ రాయి మీద పడి చిన్నగూడురు మండలం మంగోలిగూడెం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మృతి చెందారు.

2020 జనవరి 10న నెల్లికుదురు మండలం ఎర్రబెల్లిగూడెం గ్రామ సమీపంలోని క్వారీలో ట్రాక్టరు నడుపుతున్న గుండెబోయిన రాజు అదే వాహనం. కింద పడి మృతి చెందారు.

పదేళ్ల కిందట అర్పణపల్లిలోని ఓ క్వారీలో బ్లాస్టింగ్ ఘటనలో బండరాళ్లు మీదపడి నాగెళ్లి వెంకన్న మృతి చెందారు. తీగలవేణి గ్రామానికి చెందిన. కార్మికుడు భీముడు నిద్రిస్తుండగా అతడిపై నుంచి టిప్పర్ వెళ్లడంతో మృతి చెందారు.

పాటించాల్సిన రక్షణ చర్యలు ఇవి

క్వారీల్లోని కార్మికులకు ప్రత్యేక దుస్తులతోపాటు హెల్మెట్, షూ, అద్దాలు, గ్లౌజ్‌లు అందించాలి

పేలుళ్లు జరిపేందుకు మైనింగ్ సేఫ్టీ విభాగం నుంచి అనుమతి తీసుకోవాలి. నిపుణుల సమక్షంలో బ్లాస్టింగ్ చేయాలి, ఫోర్‌మెన్, మేట్, ఫస్ట్ మేనేజర్, సెకండ్ మేనేజర్ పర్యవేక్షించాలి. పేలుళ్లకు ముందు మూడుసార్లు సైరన్ మోగించి 150 మీటర్ల దూరం ఎవరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల సమయంలో పేలుళ్లు చేపట్టాలి.

రాళ్లను లారీల్లోకి ఎక్కించే సమయంలో యంత్రాలు మాత్రమే వినియోగించాలి

వాహనాల్లో పరిమితికి మించి గ్రానైట్ రాళ్లను తరలించకూడదు. రాళ్లు పడిపోకుండా నాలుగువైపుల చెక్కదిమ్మలను పెట్టాలి.

రోజుకు 8 గంటలు మాత్రమే పని చేయించాలి

ప్రమాద బీమాతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి.

కార్మికులకు భద్రత లేదు

లక్ష్మణ్, గ్రానైట్ కార్మికుడు

25ఏళ్లు గ్రానైట్ క్వారీలో పని చేశాను. నిబంధనల ప్రకారం నిపుణుల సమక్షంలో మాత్రమే పేలుళ్లు జరపాలి. ఫోర్‌మెన్, మేట్, ఇద్దరు మేనేజర్లు పర్యవేక్షణ చేయాలి. క్షేత్రస్థాయిలో మాత్రం కార్మికులు మాత్రమే ఉంటున్నారు. పదుల సంవత్సరాలు పనిచేసిన కార్మికులకు రోజువారి కూలీ మాత్రమే చెల్లిస్తున్నారు. వేతనాలు ఇవ్వడం లేదు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

సత్యనారాయణ, డీఎస్పీ మహబూబాబాద్‌జిల్లాలోని క్వారీలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. వివిధ శాఖల నుంచి లైసెన్స్‌లు, రక్షణ చర్యలు తీసుకుంటున్నారా లేదా అనే విషయాలను పరిశీలిస్తాం. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లాలోని అన్ని క్వారీల్లో లైసెన్స్‌లు తనిఖీ చేయాలని ఇప్పటికే ఆదేశించాం.

# అవసరం గుర్తించక.. ఆకలి తీర్చక




సిరిసిల్ల : ఆకలితో అలమటించేవారికి ఆహార పదార్థాలు అందించేలా ఏర్పాటు చేసిన 'ఫీడ్ ది నీడ్' మూతపడింది. సిరిసిల్ల పురపాలిక, ఆపిల్ హోం స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా 2019 జులైలో పట్టణంలోని గాంధీచౌక్‌లో ప్రారంభించారు. తొలుత స్పందన బాగానే ఉన్నప్పటికీ క్రమంగా నిర్వహణ లోపంతో తెరవడం లేదు. పట్టణ ప్రజలు శుభకార్యాలు, ఇంట్లో జరిగే కార్యక్రమాలు, హోటళ్లు, రెస్టారెంట్లలో వృథాగా మిగిలినవి ఈ రిఫ్రిజిరేటర్‌లోకి తరలించాలని మెప్మా ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. దీనికోసం 350 లీటర్ల సామర్థ్యం ఉన్న రిఫ్రిజిరేటర్‌ను రూ.2 లక్షల వ్యయంతో కాలిబాటపై ఏర్పాటు చేశారు. ఆశించిన స్థాయిలో ఫలితాలు లేక సుమారు ఏడాది కాలంగా తాళం వేశారు. దీంతో చాలా మంది ఆహారం తీసుకొచ్చిన వారు తిరుగుముఖం పడుతున్నారు.పట్టణంలోని గాంధీచౌక్ పరిసరాల్లో పెద్దబజారు, మార్కెట్, మున్సిపల్ కార్యాలయం, లేబర్ అడ్డా ప్రాంతాలున్నాయి. ఆపిల్ హోం ఏర్పాటు చేసిన చోట రహదారి ఇరుకుగా ఉంటుంది. వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఇక్కడంతా వ్యాపార కూడలి. పట్టణంలోని గోపాల్‌నగర్, బీవైనగర్, తారక రామానగర్ తదితర ప్రాంతాల్లో కార్మికులు ఎక్కువగా ఉంటారు. ప్రభుత్వ వస్త్రోత్పత్తుల ఆర్డర్ల సమయంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి పని చేసేవారుంటారు. వీరికి దీనిపై అవగాహన లేదు.పట్టణంలో వ్యర్థాల సేకరణలో ఆహారానికి సంబంధించినవే ఎక్కువగా ఉంటాయి. ఖరీదైన వంటకాలు చేసే హోటళ్లు, రెస్టారెంట్లు నిత్యం 10-15 శాతం వృథా చేస్తుంటాయని పురపాలక శాఖ చెత్త సేకరణ వాహనదారులు చెబుతున్నారు. వేడుకల్లోనూ వృథా పరిమాణం ఎక్కువే ఉంటుందని చెబుతున్నారు.

పట్టణంలోని స్వచ్ఛంద సంస్థలు, కల్యాణ మండపాలు, ఇంట్లో కార్యక్రమాల తరవాత మిగిలిన ఆహార పదార్థాలను సేకరించి కార్మిక వాడల్లోనే పంచి పెడుతుంటారు. అయితే పురపాలకశాఖ, ఆపిల్ హోం అవసరాన్ని గుర్తించడంలో విఫలమయ్యాయనే విమర్శలున్నాయి.ప్రారంభించేలా చూస్తాంసరైన స్పందన లేక మూసివేసినట్లు మా దృష్టికి వచ్చింది. పట్టణంలో ఎక్కడ ఏర్పాటు చేస్తే దీని వినియోగం బాగుంటుందనే దానిపై సిబ్బందితో పరిశీలన చేయిస్తాం. అవసరాలకు ఉపయోగపడే విధంగా మళ్లీ సేవలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటాం.ఆయాజ్, కమిషనర్, సిరిసిల్ల పురపాలక సంఘం

# ఆశావహులకు జమిలి ఝలక్!

గోదావరిఖని:అధికార పార్టీ శాసనసభ ఎన్నికలకు అభ్యర్థుల ను ప్రకటించడం ఉమ్మడి జిల్లాలో రాజకీయ వేడిని పెంచగా ఇటు భారాస అభ్యర్థులతోపాటు అటు ప్రతిపక్ష పార్టీల్లోనూ ఆశావహుల చేతి చమురు వదులుతోంది.. అధికార పార్టీ ప్రకటించిన అభ్యర్థులతో పాటు ప్రతిపక్ష పార్టీల్లో టికెట్లు ఆశిస్తున్న నాయకులు ప్రజా క్షేత్రంలోకి వెళ్లి తమ ఉనికి చాటుకోవడానికి విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.. ఇదే సమయంలో జమిలి ఎన్నికలు ఉంటాయేమో నన్న ప్రచారం ఆ నాయకుల్లో ఆందోళనను పెంచుతోంది.. ఇంకా షెడ్యూలు ప్రకటించకముందే కార్యక్రమాలతో భారీగా ఖర్చు అవుతోందని.. ఇంకా ఆలస్యమైతే తమ పరిస్థితి ఏమిటని ఇటు అధికార పార్టీ అభ్యర్థులతోపాటు అటు ప్రతిపక్ష పార్టీల్లోని ఆశావహులు భయంభయంగా ఉన్నారు.. ప్రజా ఆశీర్వాద యాత్ర.. ప్రజా అంకిత యాత్ర.. గడప గడపకు.. ఇలా వివిధ పేర్లతో అభ్యర్థులు, ఆశావహులు క్షేత్రస్థాయిలో తిరుగుతున్నారు. ఈ క్రమంలో వెంట తిరిగే నాయకులు, కార్యకర్తలకు రోజూ ఎంతో కొంత ఖర్చు చేయాల్సి వస్తుంది. కొంతమంది నాయకులైతే ఇప్పటి నుంచే ఆత్మీయ సమ్మేళనాల పేరుతో విందులు ఏర్పాటు చేస్తున్నారు. ఖర్చుకు వెనకాడకుండా జన సమీకరణలు, బల ప్రదర్శనలు చేస్తున్నారు. భారాస అభ్యర్థిత్వాలు ఖరారు కాగా, ప్రధాన ప్రతిపక్షాలైన కాంగ్రెస్, భాజపా ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. చాలా నియోజకవ ర్గాల నుంచి ఆ పార్టీల తరఫున ముగ్గురికి మించి ఆశావహులు ఉన్నారు. ఒకే నియోజకవర్గం నుంచి అభ్యర్థిత్వం ఆశిస్తున్న ఆశావహుల్లో ఒకరు ఖర్చు చేస్తూ ముందుకు వెళ్తుంటే.. అదే స్థానం నుంచి టికెట్‌కు పోటీ పడుతున్న నాయకులు తప్పనిసరిగా ఏదో ఒక కార్యక్రమం నిర్వహించాల్సి వస్తోంది. ఎన్నికలు ఆలస్యమయ్యే కొద్దీ ఈ ఖర్చు పెరుగుతూ పోతుందని వారిలో ఆందోళన నెలకొంది.

సామాజికవర్గాల సమీకరణలో భారాస : భారాస ముందుగానే అభ్యర్థులను ఖరారు చేయడంతో కొన్ని నియోజకవర్గాల్లో సామాజిక వర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. బస్తీలు, వాడల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేపడుతున్నారు. ఎమ్మెల్యేలైతే సామూహిక భవనాలకు నిధులు కేటాయిస్తూ ఆయా వర్గాలను ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రార్థనా స్థలాల నిర్మాణాలకు సొంతంగానూ విరాళాలు అందజేస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఇప్పుడే భారీ ప్రదర్శనలు నిర్వహిస్తూ బలం చాటుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

కాంగ్రెస్ నేతల దూకుడు : ప్రతిపక్ష కాంగ్రెస్‌లో ఒక్కో నియోజకవర్గం నుంచి అభ్యర్థిత్వాలు ఆశిస్తున్న వారు ఎక్కువగానే ఉన్నారు. ఈ క్రమంలో అధిష్ఠానానికి తమ బలాన్ని చాటడానికి పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 13 నియోజకవర్గాలకు 69 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. ఓ నియోజకవర్గంలో ఇద్దరు కీలక నేతలు టికెట్ ఆశిస్తున్నారు. మరో నియోజకవర్గంలో తొమ్మిది మంది నాయకులు ఎవరికి వారే తమకంటే తమకే అభ్యర్థిత్వం ఖరారవుతుందన్న నమ్మకంతో ద్వితీయ శ్రేణి నాయకులను సమీకరిస్తూ బలం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఓ చోట మాజీ మంత్రి తనయుడు టికెట్ ఆశిస్తుండగా అక్కడ మాజీ ఎమ్మెల్యే కుమారుడు కూడా పోటీకి సిద్ధమవుతున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో అనివార్యంగా కార్యక్రమాల నిర్వహణ.. ఖర్చు తప్పడం లేదు.

క్షేత్రస్థాయిలో భాజపా నాయకులు : భాజపాలోనూ పోటీకి ఆసక్తి చూపుతున్న ఆశావహులు తమ కార్యక్రమాలు మొదలు పెట్టారు. ఉమ్మడి జిల్లాలో ఒకే ఒక నియోజకవర్గంలో పోటీ లేదు. మిగతా నియోజకవర్గాల్లో అభ్యర్థిత్వం ఆశిస్తున్న వారు ఎక్కువగానే ఉన్నారు. పుణ్యక్షేత్రమైన ఒక నియోజకవర్గంలో మాత్రం ఇటీవలనే పోటీ పెరిగింది. అక్కడి నుంచి అభ్యర్థిత్వం ఆశిస్తున్న నాయకురాలికి తాజాగా పార్టీలో చేరిన ఆశావహుడి నుంచి పోటీ ఉండటంతో ప్రజల్లోకి వెళ్లి తమ బలం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇంకో నియోజకవర్గంలో అయిదుగురు టికెట్ ఆశిస్తున్నారు. ఇక్కడ కూడా పోటీ ఎక్కువగానే ఉండటంతో అభ్యర్థిత్వంపై ఆశలు పెంచుకున్న నాయకులు బల ప్రదర్శన కార్యక్రమాల నిర్వహణలో నిమగ్నమయ్యారు. ఒక నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యేతోపాటు మాజీ మంత్రి కూడా టికెట్ ఆశిస్తుండటం ద్వితీయ శ్రేణి నాయకులకు అవకాశంగా మారింది. ఉమ్మడి జిల్లాలోని మరో నియోజకవర్గంలో రాష్ట్రస్థాయి నాయకులు టికెట్లు ఆశిస్తున్నారు. పోటీ పడుతున్న ఆశావహులు కార్యక్రమాల నిర్వహణకు డబ్బు వెచ్చించక తప్పడం లేదు.

ఆసక్తి ఉన్న ఇతరులూ.. : ప్రధాన పార్టీలతోపాటు ఇతర పార్టీలలోని ఆశావహులూ తమ ఉనికి చాటుకోవడానికి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కరీంనగర్‌లో ఇటీవల ఓ పార్టీకి చెందిన నాయకుడు ప్రచార రథాన్ని కూడా సిద్ధం చేసుకున్నారు. మరో నియోజకవర్గంలో ఓ జాతీయ పార్టీ నాయకురాలు ఇంటింటికి తిరుగుతూ జనంతో మమేకమవుతున్నారు. మరో నియోజకవర్గంలో టిక్కెట్ ఆశించినా రాకపోవడంతో మహిళా నాయకురాలు సొంతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

# అధిక వర్షాలు.. వడలిపోతున్న పత్తి మొక్కలు



కోనరావుపేట : మార్కెట్‌లో మంచి ధర పలకడంతో రైతులు ఈ ఏడాది కూడా పత్తి సాగుకు ఆసక్తి చూపారు. జిల్లాలో ముఖ్యంగా మెట్టప్రాంతాల్లో వర్షాధారంగా పత్తి సాగు చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా జూన్‌లో విత్తనాలు విత్తారు. అయితే వర్షాలు కురవకపోవడంతో అవి నాటలేదు. దీంతో రెండోసారి విత్తాల్సిన దుస్థితి నెలకొంది. ప్రస్తుతం పూత, కాత దశలో ఉన్న మొక్కలు వడలిపోతున్నాయి. వానాకాలం సీజన్ ఆరంభం నుంచి ప్రతికూల వాతావరణ పరిస్థితులు వెంటాడటంతో సాగుకు పెట్టిన పెట్టుబడి తిరిగి రాని పరిస్థితి నెలకొందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, బోయినపల్లి, వేములవాడ గ్రామీణం, అర్బన్ మండలాల్లో ఎక్కువ శాతం నల్లరేగడి నేలల్లోనూ, ఇల్లంతకుంట, ముస్తాబాద్, గంభీరావుపేట, సిరిసిల్ల, తంగళ్లపల్లి మండలాల్లో ఎర్ర నేలల్లో తక్కువ శాతం పత్తి సాగు చేశారు. జిల్లాలో ఈ ఏడాది 50 వేల ఎకరాలకు పైగా పత్తి పంట సాగైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే సీజన్ ఆరంభం నుంచి సమస్యలు వెంటాడుతున్నాయి. హైబ్రీడ్ రకం కావడంతో పంట కాలం మూడు నెలలే. ఇప్పటికే రెండు నెలలు గడిచిపోయింది. ప్రస్తుతం మొక్కలు రెండు అడుగుల ఎత్తులో కాత, పూత దశలో ఉంది. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు పత్తి మొక్కలు వడలిపోయాయి. ముఖ్యంగా నల్లరేగడి నేలల్లో దీని ప్రభావం అధికంగా కనిపిస్తుంది. దీంతో పెట్టుబడి వ్యయం పెరిగిపోవడంతో పాటు దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపనుందని కర్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పెట్టుబడి తిరిగి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని వాపోతున్నారు.

రూ. 80 వేలు పెట్టుబడి పెట్టానాకున్న రెండు ఎకరాలతో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. పూత, కాత దశలో ఉండగా రెండు పర్యాయాలు ఎరువులు వేశాం. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు రెండు ఎకరాల్లో పూర్తిగా, మరో రెండు ఎకరాల్లో కొంత మేర వడలిపోయింది. ఇప్పటి వరకు ఎకరానికి రూ.20 వేల చొప్పున మొత్తం రూ.80 వేలు పెట్టుబడి అయింది. మొక్కలు వడలిపోవటంతో దిగుబడిపై ప్రభావం చూపనుంది. ఈ ఏడాది పెట్టుబడి తిరిగి వచ్చే అవకాశం లేదు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

సాసాల రాజు, రైతు, మంగళ్లపల్లి

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

అధిక వర్షాలతో వడలిపోయిన పత్తి మొక్కలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. మొదట వ్యవసాయ క్షేత్రాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా పాదుకలు (కాలువలు) చేసి బయటకు పంపించాలి. లీటరు నీటికి 20 గ్రాముల యూరియా ద్రావణం గానీ, పొటాషియం నైట్రేట్ గానీ, 10 గ్రాముల 19-19-19 గానీ కలిపి పది రోజుల వ్యవధిలో రెండు పర్యాయాలు పిచికారీ చేయాలి. పూత, కాత దశలో ఉన్న పంటకు 20 నుంచి 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను మొక్కలకు 5 నుంచి 6 సెం.మీ. దూరంలో వేయడం వల్ల పూత, కాత రాలకుండా కొంతమేర అరికట్టవచ్చు.

భాస్కర్, ఇన్‌ఛార్జి జిల్లా వ్యవసాయ అధికారి

# ప్రయత్నం ఫలించింది.. పురస్కారం వరించింది

గోదావరిఖని: పారిశుద్ధ్యం, పచ్చదనంపై ప్రజల్లో అవగాహన పెంపొందించారు. తడి, పొడి చెత్తను బయట వేయకుండా బుట్టల్లో వేసి చెత్త సేకరణ వాహనం వచ్చినపుడు అందులో వేస్తున్నారు. ఇంటింటికీ మరుగుదొడ్డి నిర్మించుకుని వినియోగిస్తూ స్వచ్ఛ వాతావర ణం నెలకొల్పారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించారు. ప్లాస్టిక్ నివారణపై దృష్టిసారించారు. సేంద్రియ ఎరువు తయారు చేసి మొక్కలకు వినియోగించారు. పంచాయతీ పాలకవర్గం, గ్రామస్థులు చేసిన ప్రయత్నం ఫలించడంతో రెండు గ్రామాలను స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 రాష్ట్రస్థాయి పురస్కారం వరించింది. జగిత్యాల జిల్లా నుంచి మెట్‌పల్లి మండలం చింతలపేట, గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామాలు పురస్కారా నికి ఎంపికయ్యాయి. జిల్లా స్థాయిలో రెండు వేల లోపు జనాభా ఉన్న అయిదు గ్రామాలు, 2వేల నుంచి 5వేలలోపు ఉన్న అయిదు, 5వేలకు పైగా జనాభా ఉన్న అయిదు గ్రామాలను ఎంపిక చేశారు. ఇందులో ప్రగతి కనబర్చిన 2వేల లోపు జనాభా కేటగిరీలో చింతలపేట, 5వేల లోపు జనాభా కేటగిరీలో రాఘవపట్నం ఎంపికయ్యాయి. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో జరిగే కార్యక్రమంలో గురువారం పురస్కారాలను అందించనున్నారు.

సంపూర్ణ పారిశుద్ధ్యంలో రాఘవపట్నం..

గొల్లపల్లి మండలం రాఘవపట్నం 5వేలలోపు కేటగిరీలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికైంది. 4,500 జనాభా ఉన్న గ్రామంలో 870 కుటుంబాలు ఉన్నాయి. గ్రామంలో 746 ఇళ్లలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకుని సంపూర్ణ పారిశుద్ధ్యానికి కృషి చేశారు. ఇంటింటికీ రెండు చెత్త బుట్టలను పంపిణీ చేసి తడి, పొడి చెత్తను వేర్వేరుగా చెత్త సేకరణ వాహనాన్ని అందించారు. పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడంతో రహదారులు, వీధులు శుభ్రంగా మారాయి. 248 ఇంకుడు గుంతలను నిర్మించుకుని వృథా నీటిని ఇంకించారు. మురుగు నీరు వృథాగా వెళ్లకుండా కమ్యూనిటీ ఇంకుడు గుంతలు నిర్మించి వాటిలోకి వెళ్లేలా జాగ్రత్తలు తీసుకున్నారు. తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువు తయారీ చేపట్టడం వంటి చర్యలతో గ్రామానికి పురస్కారం వరించేలా చేశాయి.

గ్రామస్థులు సహకరిస్తున్నారు

- అర్చన, చింతలపేట సర్పంచి

గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రత నెలకొనేందుకు గ్రామస్థులు సహకరిస్తున్నారు. చెత్తబుట్టలు వినియోగించి తడి, పొడి చెత్తను ట్రాక్టర్‌కు అందిస్తున్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగిస్తూ సంపూర్ణ పారిశుద్ధ్యం నెలకొల్పుతున్నారు. హరితహారం కింద నాటిన మొక్కలు కాపాడుతున్నారు. అధికారులు, గ్రామస్థుల సహకారంతో పురస్కారానికి గ్రామం ఎంపికైంది. గ్రామాన్ని మరింత పరిశుభ్రంగా మార్చేందుకు కృషి చేస్తాం.అవగాహనతో సాధ్యమైంది

- రాగం శంకరయ్య, రాఘవపట్నం సర్పంచి

పరిశుభ్రతపై గ్రామ ప్రజల్లో అవగాహన రావడంతో పురస్కారం సాధ్యమైంది. నిత్యం గ్రామంలో పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్నారు. ప్రజలు సహకరిస్తుండడంతో సంపూర్ణ పారిశుద్ధ్యం నెలకొంటుంది. గ్రామంలోని ప్రతి వార్డు పరిశుభ్రంగా మారింది. అందరి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకెళ్తాం.

పచ్చదనాన్ని కాపాడటంలో చింతలపేట..

మెట్‌పల్లి మండలం చింతలపేటలో స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ్-2023 పురస్కారం కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగారు. ఉన్నతాధికారులు ఎప్పటికపుడు దిశానిర్దేశం చేయగా, స్థానిక అధికారులు, పంచాయతీ పాలకవర్గం, గ్రామస్థులు స్వచ్ఛతకు పాటుపడ్డారు.

# ఆరోగ్యానికి చిరు పంటలు

జగిత్యాల : చిరుధాన్యాల ప్రాధాన్యతను గుర్తించి ఐక్యరాజ్య సమితి 2023ను చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. వానాకాలంతో పాటు యాసంగిలోనూ సాగుకు అనువైన ఈ పంటలను జగిత్యాల పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానంలో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నారు. పెరుగుతున్న ఆదరణ

రాగి జావ, జొన్న అంబలి, మక్క గట్క, ఉలవ చారు, కొర్రల కిచిడీ, సామల ఉప్మా ఇలాంటి పేర్లతో కూడిన ఆహార పదార్థాలు ఇటీవల ప్రాచుర్యంలోకి వస్తున్నా నిజానికి ఇవన్నీ మన పూర్వీకులు శతాబ్దాలపాటు తిన్నవే. చిరుధాన్యాలుగా పిలిచే ఈ పంటలు, ఉప ఉత్పత్తులు ఇటీవల మళ్లీ మన మెనూలోకి వచ్చిచేరుతున్నాయి. పేదలే వీటిని తింటారనే భావన తొలగి పెద్దవారి కంచాల్లోకి చిరుధాన్యాలు చేరుతున్నాయి.ఉమ్మడి జిల్లాలో ఇటీవల వరి, పత్తి పంటలసాగు పెరగగా కొందరు రైతులు చిరుధాన్యాలు, సేంద్రియసాగును కొద్దివిస్తీర్ణంలో చేపడుతున్నారు. ప్రస్తుతం వీటిని మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి ఇక్కడికి తెచ్చి అధిక ధరకు అమ్ముతుండగా సాగు పెరిగితే సరసమైన ధరలోనే అందరికీ అందుబాటులోకి వస్తాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో జొన్న రొట్టె, అంబలి, గట్క, గుడాలు తదితర ఆహార పదార్థాలను ఔత్సాహికులు విక్రయిస్తుండగా వినియోగదారుల్లోనూ మంచి స్పందన కనిపిస్తోంది. ఇటీవల శుభకార్యాల్లో చిరుధాన్యాల ఆహార పదార్థాలను వండి వడ్డించటం స్టేటస్ సింబల్‌గానూ మారింది. హోటళ్లలోనూ కిచిడీ, సూప్, రొట్టెలు, బిర్యానీ, పాయసం, దోసెలు, వడలు, బజ్జీలు, కీర్, ఉప్మా, కట్‌లెట్ తదితర చిరుధాన్యాల ఆహార పదార్థాలను ఆర్డర్‌పై సర్వ్ చేస్తుండగా మాల్స్‌లోనూ ఈ ఉత్పత్తులు విరివిగా లభిస్తున్నాయి. వీటితో బిస్కట్లు, మురుకులు తదితరాలను తయారు చేస్తున్నారు. చిరుధాన్యాల ఉప ఉత్పత్తుల తయారీని చాలామంది కుటీర పరిశ్రమగా మలచుకుంటు న్నారు.

రైతులకు భరోసా కల్పించాలి

రైతులకు విక్రయ అవకాశాలు కల్పిస్తే సాగువిస్తీర్ణం పెరుగుతుంది. చిరుధాన్యాల్లోనూ ఇటీవల మంచి విత్తనాలు, సాంకేతికత అందుబాటులోకి వస్తున్నాయి. మనప్రాంత నేలలు, వాతావరణం వీటిసాగుకు అనువుగా ఉన్నాయి. డాక్టర్ గాదె శ్రీనివాస్, సహ పరిశోధన సంచాలకులు, పొలాస పరిశోధనస్థానం

చిరుధాన్యాలతో లాభాలు మూత్రపిండాలు, కాలేయం, రోగనిరోధక వ్యవస్థ సక్రమంగా పనిచేస్తాయి.పేగు సంబంధిత అల్సర్లు, క్యాన్సర్లు ఏర్పడే అవకాశాలను తగ్గిస్తాయి.మలబద్ధకం, ఉబ్బసం, ఊబకాయం, తిమ్మిరివంటివి రాకుండా సహకరిస్తాయి.సామలలో ఎక్కువగా ఇనుము, ఖనిజ లవణం ఉండటంతో మహిళల్లో రక్తహీనతను నివారిస్తుంది.

# కాలానుగుణ వ్యాధుల పంజా

మంథని : మంథని సామాజిక వైద్యశాలలో రోజురోజుకు రోగుల సంఖ్య పెరుగుతోంది. నిత్యం 150 వరకు ఓపీ ఉంటుండగా 270 మందికిపైగా బాధితులు రావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. జ్వరాలు, రక్తకణాలు తగ్గిన వారే ఆసుపత్రికి ఎక్కువగా వస్తున్నారు. దోమల వల్ల జ్వరాలు రాకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. వాతారవణంలో మార్పులు, వర్షాలతో పల్లెలు మంచం పడుతున్నాయి. ఒకసారి వర్షం పడటం, కొద్దిసేపటికే ఎండ కాయడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీనికి తోడు వర్షాలతో నీరు నిలిచిన నీటితో దోమల బెడద పెరగడం వ్యాధులకు కారణంగా మారుతోంది. కమాన్‌పూర్, రామగిరి ముత్తారం మండలాల్లో చాలా గ్రామాల ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. దోమల బెడద పెరగడం, పారిశుద్ధ్యం సక్రమంగా చేయకపోవడం, వాతావరణంలో మార్పులు వ్యాధులకు కారణంగా మారుతున్నాయి. విషజ్వరాలతో పాటు డెంగీ, రక్త కణాలు తగ్గడం సమస్యగా మారింది. దాంతో ప్రైవేట్ ప్రభుత్వ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ముత్తారం మండలం మచ్చుపేటకు చెందిన ఓ మహిళా, రామగిరి మండలం బేగంపేటకు చెందిన ఓ మహిళా ఇటీవల జ్వరంతో మృతి చెందారని స్థానికులు చెబుతున్నారు. కొద్ది రోజులుగా గ్రామాల్లో జ్వరాలు విజృంభించడంతో చాలా మంది ప్రైవేట్ ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. జ్వర పీడితులు గోదావరిఖని, పెద్దపల్లి, కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రులల్లో చికిత్స పొందుతు న్నారు.

కనిపించని దోమల నియంత్రణ

దోమల నియంత్రణకు చర్యలు కనిపించడం లేదు. చాలా గ్రామాల్లో ఫాగింగ్ చేయడం లేదు. డెంగీ కేసులు నమోదయిన ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. నీరు నిలిచి దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. మురుగుకాలువల్లో మురుగు పేరుకుపోతోంది. బ్లీచింగ్ పౌడర్ చల్లడం, క్లోరినేషన్ చేయడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. పంచాయతీ పాలకులు, అధికారులు వీటిపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాలతో పెరిగిన జ్వరాలు వాతావరణంలోని మార్పులతో పాటు పారిశుద్ధ్య లోపం, వర్షాలతో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో కాలానుగుణ వ్యాధులు ముసురుతున్నాయి. ఇప్పటికే కమాన్‌పూర్‌లో 32,



రామగిరిలో 9, ముత్తారంలో 7 డెంగీ కేసులు నమోదు కాగా ఇందులో కొంతమందికి వచ్చి తగ్గిపోయినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. ఇవేకాకుండా విష జ్వరాలు, రక్తకణాలు తగ్గడం, జలుబు, దగ్గు వంటి వాటితో బాధపడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వసతులు లేకపోవడం చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా రూ.లక్షలు వెచ్చించి చికిత్స పొందుతున్నారు. నాగారం, కమాన్‌పూర్, మచ్చుపేట, పారుపల్లి, బేగంపేట గ్రామాల్లో డెంగీ, విష జ్వరాలు బయట పడిన తర్వాత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. జ్వరాలు రాకముందు చర్యలు తీసుకోవడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారనే విమర్శలున్నాయి. పేద ప్రజలు సాధారణ జ్వరం అనుకొని స్థానికంగా ఉండే ఆర్ఎంపీల వద్ద చికిత్స పొందుతున్నారు. వారు కొద్ది రోజులు చికిత్స అందించి జ్వర తీవ్రత పెరిగిన తర్వాత ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఫలితంగా వైద్య ఖర్చులు పేదలకు ఆర్థిక భారం అవుతుంది.జాగ్రత్తలు తీసుకోవాలిదోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్లాస్టిక్ డబ్బాలు, కొబ్బరిబొండాల్లో డెంగీ దోమలు వృద్ధి చెందుతాయి. అలాంటివి లేకుండా చూసుకోవాలి. కొద్దిపాటి జ్వరం వచ్చినా వైద్యులను సంప్రదించాలి. ఆరోగ్య కేంద్రం పరిధిలో జ్వర పీడితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. జ్వరాలు ఉన్న గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం.అశోక్‌కుమార్, మండల వైద్యాధికారి, కమాన్‌పూర్

# పరిశోధన విస్తరణతో ఆరుతడికి ఊతం

జగిత్యాల : ప్రభుత్వం వరిసాగుకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు పండించాలని ఓ వైపు పేర్కొంటున్నా ఉమ్మడి జిల్లాలో మాత్రం ఏటికేడు వరి సాగువిస్తీర్ణం గణనీయంగా పెరుగుతూనే ఉంది. వరిస్థానంలో అనువైన ఆరుతడి పంటలను సాగుచేయాలంటే కర్షకులకు దన్నుకలిగేలా ఉమ్మడి జిల్లాలో పలు సాంకేతిక వ్యవస్థలను అందుబాటులోకి తేవాల్సి ఉంది.

ఇటీవల ఇతర పంటల సాగుకు కూలీల కొరత, మద్దతు ధరకు సేకరించకపోవటం, మార్కెటింగ్ సమస్య, కోతులు, నెమళ్లు, అడవిపందులు తదితర వన్యప్రాణుల బెడద, ఆరుతడి పైర్ల విత్తనాల రాయితీలను ఎత్తివేయటం, ఆరుతడి పైర్లకు ఉపకరించే బిందుసేద్య రాయితీని ఎత్తివేయటంతో పాటుగా సాగునీటి లభ్యత పెరగటం తదితర కారణాలతో రైతులందరూ వరివైపే మళ్లుతున్నారు. ఈ సమస్యల విరుగుడుపై ప్రధానంగా దృష్టిసారిస్తేనే రైతులు ఈ యాసంగిలో వరి నుంచి ఆరుతడికి మళ్లుతారు.

జగిత్యాల పొలాసలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం ఉండగా రాష్ట్రంలోనే వరి, నువ్వులపై అత్యధిక పరిశోధనలు ఇక్కడే సాగుతున్నాయి. పొలాసలో వేరుసెనగ, పత్తి, కంది, చెరకు తదితర అన్నిరకాల ఆరుతడి పంటలపై పరిశోధనలు చేపడితే మన ప్రాంత నేలలకు అనువైన అధిక దిగుబడి వంగడాల రూపకల్పన సాధ్యపడుతుంది. ఇటీవల ఆవాలసాగు గణనీయంగా పెరుగుతున్నందున పొలాసలో ఐసీఏఆర్ ద్వారా ఆవాల పరిశోధనను ప్రారంభించాలి.

ఐసీఏఆర్ కృషివిజ్ఞాన కేంద్రం జమ్మికుంటలో ఉండగా ఇక్కడ



పూర్తిస్థాయి పత్తి పరిశోధనకేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. సెనగ, కుసుమ, పొద్దుతిరుగుడు, ఆముదం, పెసర, మినుము తదితరాల్లో మేలైన వంగడాలను రూపొందించటం, ఆరుతడి పంటల్లో దిగుబడులు పెరిగి చీడపీడలు, కలుపు నివారణ రసాయనాలను శాస్త్రవేత్తలు అందుబాటులోకి తెచ్చినట్లయితే రైతులు క్రమంగా వీటిసాగును పెంచుతారు. పెద్దపల్లి జిల్లా కూనారంలో వరి పరిశోధనస్థానం ఉండగా ఇక్కడ కూడా పలు ఆరుతడి పంటలపై పరిశోధనలు చేపట్టాలి. కరీంనగర్ పరిశోధనస్థానంలో కేవలం మొక్కజొన్నపైనే పరిశోధనలు సాగుతుండగా మన రైతులు పండించే, స్థానిక నేలలకు అనువైన పంటలపై పరిశోధనలను చేపట్టి చేపట్టి తెలంగాణ సీడ్స్ ద్వారా రైతులకు రాయితీపై అన్నిరకాల విత్తనాలను ఇచ్చినట్లయితే రైతులకు ప్రోత్సాహకంగా ఉంటుంది.

జగిత్యాల చల్‌గల్ వాలంతరీ ప్రదర్శన క్షేత్రంలో ఉద్యాన పరిశోధస్థానాన్ని ఏర్పాటు చేసినట్లయితే మామిడి, పసుపు, ఉల్లి, అల్లం, కూరగాయలు, పసుపు, మిరప, ఇతర సీతాఫల్, జామ, బత్తాయి, బొప్పాయి, అల్లం, కర్బూజా, సపోటా, అరటి తదితర పండ్లు, పూలసాగును చేపట్టే రైతులకు మేలైన వంగడాలు అందుబాటులోకి వస్తాయి. జగిత్యాల మామిడి మార్కెట్లో శాశ్వత పండ్ల మార్కెట్‌ను ఏర్పాటుచేస్తే రైతులకు ఏడాది పొడవునా విక్రయ అవకాశాలుంటాయి.

ఆయిల్‌పామ్ మొక్కలను పెద్దఎత్తున నాటుతుండగా స్థానికంగా గానుగ పరిశ్రమలను నెలకొల్పాలి. జిల్లాలో యాసంగిలో జొన్న, సజ్జ, నువ్వులు, ఆవాలు తదితర పంటల్లో రైతులు విత్తనోత్పత్తి చేపడుతున్నందున విత్తనోత్పత్తి పైర్లసాగును పెంచేలా ప్రభుత్వం ఉత్తరాది రాష్ట్రాల కంపెనీలు రైతులతో ధర నిర్ణయం, ముందస్తు ఒప్పందం చేసేలా చూడాలి. ఇటీవల చెరకు సాగు పెరుగుతుండగా కర్మాగారాలను పనిచేయించటం ప్రధానాంశంగా ఉండాలి. వెల్గటూరు, మల్లాపూర్ మండలాల్లో తలపెట్టిన ఫుడ్‌పార్కులను ఏర్పాటుచేస్తే రైతులకు విక్రయ అవకాశాలు దరిచేరి ఆరుతడి పంటలకు మళ్లుతారు. నిజామాబాద్‌లోని పడిగెల్ వద్ద తలపెట్టిన స్పైసెస్ పార్కును పూర్తిచేస్తే ఉద్యాన పంటల రైతులకు ధీమాగా ఉంటుంది.

పాలీహౌజులు, ఆరుతడి పంటలు, కూరగాయల విత్తనాలు, యంత్రపరికరాల రాయితీని పునరుద్ధరించాలి. విపణిలో ధర తగ్గిన ఉత్పత్తులను మార్కెట్జోక్య పథకం ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలి. అన్ని పంటలను ఉప ఉత్పత్తులుగా మార్చే చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఏర్పాటు చేసేలా యువత, రైతులకు రాయితీలను ఇచ్చినట్లయితే వరినుంచి క్రమంగా ఇతర ఆరుతడి పంటలవైపు రైతులు మళ్లే అవకాశముంటుంది.

అనువైన నేలల్లో మేలు రైతులు నేలలు, నీటిలభ్యత, కూలీల అందుబాటు, వన్యప్రాణుల బెడద, మార్కెటింగ్ తదితరాలను చూసుకుని పంటమార్పిడి పాటించాలి. వరి స్థానంలో మరోపంటగా ఆరుతడిని పండిస్తే పంటల సరళి, నేలస్థితిగతులు మెరుగుపడతాయి. డాక్టర్ జి.శ్రీనివాస్, ఏడీఆర్

# తప్పుల తడకగా ఓటర్ల జాబితా

శంకరపట్నం : శంకరపట్నం మండలంలోని పలు గ్రామాల్లో ఓటర్ల జాబితాలు తప్పుల తడకగా మారాయి. కాచాపూర్‌లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా వారి పేర్లు జాబితా నుంచి తొలగింపు కాలేదు. తాడికల్‌లో చనిపోయిన మహిళల పేర్లు జాబితాలో పొందుపరిచారు. కేశవపట్నం గ్రామానికి చెందిన జనగాం బుచ్చయ్య ఓటరు ఫొటో బదలుగా కొన్నేళ్ల క్రితం చనిపోయిన అదే గ్రామానికి చెందిన పట్టాభి వ్యక్తి ఫొటో ఉంది. ఓటర్ల జాబితాలో వరుస క్రమంలో కుటుంబ సభ్యుల ఓటర్లు నమోదు చేయాల్సి ఉండగా అక్కడక్కడ తప్పిపోయాయి. పోలింగ్ కేంద్రాల పర్యవేక్షకులు, బీఎల్వోలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి దొర్లిన తప్పులు సరి చేయాలని గ్రామాల ఓటర్లు కోరుతున్నారు.

తప్పులు దొర్లితే సమాచారం అందించాలి గ్రామాల్లోని ఓటర్ల జాబితాలలో తప్పులు దొర్లితే సమాచారం అందించాలి. బీఎల్వోలకు జాబితాలో తప్పుల వివరాలు తెలిపి సంబంధిత ధ్రువ పత్రాలు సమర్పించుకోవాలి. ఓటర్ల జాబితాలలో తప్పొప్పులతోపాటు కొత్త ఓటర్ల నమోదు కోసం దరఖాస్తులు చేసుకోవాలి.

అనుపమ, తహసీల్దార్7బతికి ఉండగానే చంపేశారుకేశవపట్నంలోని రెండో వార్డులో ఓటరుగా కొనసాగుతున్నా. ఇటీవల ఓటర్ల జాబితాలు ప్రచురితం చేసి పంచాయతీలో ప్రదర్శన చేపట్టారు. అందులో తన పేరు నమోదు చేసి వేరే మృతి చెందిన వ్యక్తి ఫొటో ముద్రించారు. అధికారులు పరిశీలించి ఓటర్ల జాబితాలో తప్పులు జరగకుండా చూడాలి. జనగాం బుచ్చయ్య, కేశవపట్నం

# వాగు ఒడ్డున అక్రమ నిర్మాణాలు



కోరుట్ల : ఏటా వర్షాకాలంలో భారీ వరదలు సంభవించి కాలనీలు నీట మునుగుతున్నా అక్రమ నిర్మాణాలు ఆగడం లేదు.. కోరుట్ల పట్టణానికి ఆనుకుని ఫుల్‌వాగు ఉంది. ఫుల్‌వాగు ప్రధాన రహదారిపైనున్న వంతెన నుంచి జగ్జీవన్‌రామ్ విగ్రహం, గంగంపేట, సంగెం పాతరోడ్ వరకు సుమారు కిలోమీటరు పైగా ఉంటుంది. ఫుల్‌వాగులో చాలా ఏళ్లుగా వరద రాకపోవడంతో వాగంతా ఎండిపోవడంతో ఆక్రమణదారులు ఆక్రమించుకున్నారు. అందులో మున్సిపల్ అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. అక్రమ కట్టడాలను అరికట్టాల్సిన రెవెన్యూ, నీటిపారుదల, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆక్రమణలు జోరుగా కొనసాగాయి. ఇళ్లకు మున్సిపల్ అధికారులు ఇంటి నంబర్లను కేటాయించారు. దీని అధారంగా విద్యుత్తుశాఖ స్తంభాలను నెలకొల్పి ప్రైత్యేక విద్యుత్తు లైన్‌లను అమర్చి విద్యుత్తు సౌకర్యం కల్పించింది. దీంతోపాటు మున్సిపల్ అధికారులు సిమెంట్‌రోడ్‌లను ఏర్పాటు చేసి మిషన్ భగీరథ పైప్‌లైన్లు వేసి తాగునీటి సరఫరా, ఇతర సౌకర్యాలను సమకూర్చారు.

నాలుగేళ్లుగా భారీ వరదలు

నాలుగేళ్లుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో ఫుల్‌వాగులో వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. వాగుకు సహజసిద్ధంగా ఉన్న ఒడ్డును ఆనుకుని వరద పారుతుంది. దీంతో గంగంపేట, ఎస్సీ కాలనీ శివారులోని వాగు స్థలం ఆక్రమించుకుని నిర్మించుకున్న ఇళ్లలోకి నీరు చేరుతుంది. వరదలు సంభవించినప్పుడల్లా ఇళ్లను ఖాళీ చేసి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. జులై 26, 27, 28న కురిసిన భారీ వర్షాలకు పైప్రాంతంలోని చెరువులు కోతకు గురై ఫుల్‌వాగులో ప్రమాదస్థాయిలో వరద ప్రవహించింది. దీంతో వాగులో నిర్మించుకున్న సుమారు 10 ఇళ్లు పూర్తిగా నీటిలో కొట్టుకుపోయాయి. చాలా ఇళ్లలోకి భారీగా నీరు చేరడంతో దెబ్బతిన్నాయి. 150కి పైగా ఇళ్లలో నీరు చేరి సరకులు, దుస్తులు, ఇతర పరికరాలు చెడిపోయాయి. ప్రస్తుత వర్షాకాలంలో వాగులో వచ్చిన వరద ఎక్కడి వరకైతే ప్రవహించిందో అంతమేర ఫుల్‌వాగు గతంలో విస్తరించి ఉండేదని పెద్దలు చెబుతున్నారు.

మునుగుతున్నా ఆగని కట్టడాలు

ఫుల్‌వాగులో ఓవైపు అక్రమంగా నిర్మించుకున్న ఇళ్లు, కట్టడాలు నీట మునిగి కొట్టుకుపోతుంటే.. మరోవైపు యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నా అధికారులు తమకేమిపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వైకుంఠధామం వెనకాల వాగును ఆక్రమించుకుని అక్రమంగా ప్రహరీ అందులో చిన్న ఇళ్లు నిర్మించుకున్నారు. ఇటీవల వచ్చిన వరదలకు కొంతమేర కొట్టుకుపోయింది. జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి వాగులోకి వెళ్లే ప్రదేశంలో పలుచోట్ల నిర్మాణాలు చేపడుతున్నారు. పలువురు ఇనుప కంచెలను ఏర్పాటు చేసుకుని ఆక్రమించుంటున్నారు. ఫుల్‌వాగు వంతెన పక్కన ఓవైపు స్థిరాస్తి వ్యాపారులు బహుళ అంతస్తుల భవనం నిర్మించారు. రోడ్లు నిర్మించి ప్లాట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆ స్థలం కాస్తా ఇటీవల వాగులో వచ్చిన వరద పోటుకు గురైంది. వరద రాకుండా ఉండేందుకు వాగు ఒడ్డుకు ప్రహరీ నిర్మాణం చేపట్టారు. వాగుకు ఆనుకుని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లు ఉంటాయి. ఇందులో ఎలాంటి శాశ్వత నిర్మాణాలు చేపట్టవద్దని నిబంధనలు ఉన్నా ఎవరూ పాటించడం లేదు. వరదలు సంభవించినప్పుడు మాత్రమే నిబంధనల గురించి చర్చించుకుంటున్నారే తప్పా వాటిని ఆచరణలో పెట్టే అధికారయంత్రంగా నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ చోద్యం చూస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# చొరవ చూపితే.. వైద్యం మరింత చేరువ



ఖమ్మం : నిరుపేదల వైద్యానికి ఖమ్మం సర్వజన ఆసుపత్రి భరోసా ఇస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, ఏపీలోని వివిధ ప్రాంతాలు, ఛత్తీస్‌గఢ్‌లోని పలు ఏజెన్సీ ప్రాంతాల నుంచి వైద్యసేవల కోసం ఇక్కడికి వస్తుంటారు. రూ.కోట్ల విలువజేసే వైద్య పరికరాలు, అధునాతన వైద్యసేవలతో ఈ ఆసుపత్రి ప్రత్యేక గుర్తింపు పొందింది. కొండంత ఆశతో దవాఖానాకు వస్తున్న రోగులకు మరింత భరోసా ఇవ్వాలంటే సూపర్‌స్పెషాలిటీ విభాగాల్లో సేవలను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత కనిపిస్తోంది.

అమాత్యా.. ఇదిగో సమస్యల చిట్టా..సర్వజన ఆసుపత్రిలో అన్నిరకాల వైద్యసేవలకు కలిపి రోజుకు సగటున 2వేల మందికిపైగా ఓపీ సేవలు వినియోగించుకుంటున్నారు. 500 పడకలు కలిగిన ఈ దవాఖానా నిత్యం రోగులతో కిటకిటలాడుతోంది. ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా అత్యవసర వైద్యసేవలందిస్తోంది.

ఒక్క కార్డియాలజీ విభాగంలోనే నెలకు 1,500 మంది వరకు ఓపీ సేవలు పొందుతున్నారు. నెలకు సగటున 100 మందికి వైద్యులు యాంజియోగ్రామ్ చేస్తున్నారు. 50 మందికి స్టంట్లు అమర్చుతున్నారు. న్యూరో, యూరాలజీ విభాగాల్లోనూ రూపాయి ఖర్చు లేకుండా అత్యాధునిక వైద్యసేవలు అందిస్తున్నారు. అంతవరకు బాగానే ఉన్నా కొన్ని విభాగాల్లో సమస్యలు వెంటాడుతున్నాయి. వీటి పరిష్కారానికి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చొరవ చూపాలని రోగులు కోరుతున్నారు.

కార్డియాలజీ విభాగంలో రెగ్యులర్ వైద్యులు లేరు. ఒక వైద్యుడు డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. మరొక వైద్యనిపుణుడు అవసరం. కార్డియాలజీ ఐసీయూ విభాగంలో వైద్యుల కొరత ఉంది.

తరచూ స్టంట్ల కొరత వేధిస్తోంది. కాంట్రాస్టు, బెలూన్లు, ఇతర పరికరాలు సకాలంలో అందుబాటులో ఉండటం లేదు.

హృద్రోగులకు వారానికి రెండురోజుల ఓపీ మాత్రమే కొనసాగుతోంది. రోజూ ఓపీ ఉండేలా చూడాలని దూర ప్రాంతాల రోగులు కోరుతున్నారు. ఖరీదైన ఔషధాలు అన్నివేళలా అందుబాటులో ఉండటం లేదు. తద్వారా రోగులు ప్రైవేటుగా కొనాల్సి వస్తుంది.

క్యాథల్యాబ్‌కు సంబంధించి రెండేళ్లుగా ఆరోగ్యశ్రీ బకాయిలు పేరుకుపోయాయి.

యూరాలజీ, న్యూరాలజీ విభాగాల్లో మానవ వనరులు, పరికరాల కొరత వేధిస్తోంది.

నాలుగేళ్లుగా వైద్యసేవలందుతున్నా శస్త్రచికిత్సలు జరగటం లేదు. రోగులు ఆపరేషన్ల కోసం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.

మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో పడకల సంఖ్య పెంచాలి. ప్రతినెలా 700–900 వరకు ప్రసవాలు అవుతున్నాయి. వార్డులు సరిపడక పిల్లలు, తల్లులు అసౌకర్యానికి గురవుతున్నారు.

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో జన్మించిన శిశువులకు ఇక్కడి స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ)లో వైద్యసేవలందుతున్నాయి. ఇంక్యుబేటర్లు, వెంటిలేటర్ల సంఖ్య పెంచాలి.

సర్వజన ఆసుపత్రికి అనుబంధంగా వైద్య కళాశాల కొలువుదీరడంతో ప్రత్యేకంగా ఓపీ, క్యాజువాలిటీ కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

హెచ్ఐవీ బాధితులకు డయాలిసిస్ సేవలందించాలన్న విజ్ఞప్తులు చాలాకాలం నుంచి ఉన్నాయి.

ప్రస్తుత అవసరాలకు తగ్గట్టు సూపర్‌స్పెషాలిటీ, మాతాశిశు ఆరోగ్య కేంద్రం సేవలను విస్తరించాలి.

# నిజమైన ఆదివాసీలను విస్మరించడం తగదు

భద్రాచలం : దేశంలో నిజమైన ఆదివాసీలను ప్రభుత్వాలు విస్మరించడం తగదని, ఎస్టీలకు అన్ని రంగాలలో తగిన ప్రాధాన్యత కల్పించాలని ఆదివాసీ సమన్వయ మంచ్ భారత్ డిమాండ్ చేసింది. ఈ సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సు ముగిసింది. సెప్టెంబరు 13ను అంతర్జాతీయ ఆదివాసీ హక్కుల దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి 2007లో ప్రకటించింది. ఈనేపథ్యంలో బుధవారం భద్రాచలం ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. జెండాలతో ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను అద్దం పట్టేలా ర్యాలీ చేశారు. ఆదివాసీ పోరాట అమరవీరులు, నాయకుల విగ్రహాలకు పూలదండలను అలంకరించారు. దాదాపు 20 రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు తరలివచ్చి తమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను ప్రస్తావించారు. కలిసికట్టుగా ఉద్యమిస్తే పరిష్కారం లభిస్తుందని సదస్సు దృష్టికి తెచ్చారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో కొత్త కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలనే నిర్ణయాన్ని తప్పుపట్టారు. వేరే చోట నుంచి వలస వచ్చిన లంబాడాలు అసలైన ఆదివాసీల రిజర్వేషన్లను తన్నుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దశాబ్దాల కిందట వలస వచ్చిన గొత్తికోయలను మాత్రం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని ఆరోపించారు. వీరికి కుల ధ్రువీకరణ, పోడు పట్టాలు ఇవ్వకపోవడంతో అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. మహిళలపై దాడులను అరికట్టి భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలకు ఉద్యోగ ఆర్థిక సామాజిక రాజకీయ రంగంలో ప్రాముఖ్యత ఇవ్వాలని పేర్కొన్నారు. భద్రాద్రి మన్యంలో బహుళజాతి సంస్థలు ఆదివాసీలకు ఉపాధి కల్పించడంలో తూట్లు పెడుతున్నాయని విమర్శించారు.

# వైద్య విద్య తరగతులకు వేళాయె!

జనగామ : ఏడేళ్ల క్రితం జిల్లాగా ఆవిర్భవించిన జనగామ.. అన్ని రంగాల్లో ప్రగతి పథంలో సాగుతోంది. ఇప్పటికే అధునాతన హంగులతో కలెక్టరేట్ భవనాన్ని నిర్మించగా.. జిల్లా ముఖచిత్రంలో వైద్య కళాశాల మరో కలికితురాయిగా చేరనుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ వర్చువల్ విధానంలో వైద్యకళాశాల తరగతులను ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. ఇందుకోసం అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు.

జనగామకు వరం..

జనగామ ప్రాంతానికి వైద్య కళాశాల వరంగా మారనుంది. ఇప్పటికే వైద్య కళాశాల పరిధిలోకి జిల్లా జనరల్ ఆసుపత్రి, ఎంసీహెచ్ ఆసుపత్రి చేరాయి. ఈ రెండు ఆసుపత్రులు డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో చేరి ప్రజలకు వైద్య సేవలందిస్తున్నాయి. డీఎంఈ నుంచి వచ్చిన ప్రొఫెసర్ స్థాయి వైద్యులు రెండు ఆసుపత్రుల్లో వైద్య సేవలందిస్తున్నారు. దీంతో పాటు కళాశాల కోసం కూడా అన్ని విభాగాల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ స్థాయి ప్రొఫెసర్లు చేరారు. బోధనేతర సిబ్బంది కూడా విధుల్లో చేరారు. వైద్య కళాశాల కోసం జనగామలోని సిద్ధిపేట రోడ్డు వైపు ప్రభుత్వం 20 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. మొదటి బ్యాచ్ విద్యార్థులు, మౌలిక వసతుల కోసం తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. జనగామ శివారులోని చంపక్‌హిల్స్ వద్ద ఉన్న ఎంసీహెచ్ ఆసుపత్రిలో వైద్య కళాశాల పరిపాలన విభాగానికి గదులను నిర్మించారు. ఆసుపత్రి పక్కన విద్యార్థుల తరగతి గదులు, ల్యాబ్ తదితర వసతుల కోసం తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారు. ఈ పనులు కూడా పూర్తయ్యాయి. వైద్య విద్యార్థినుల కోసం జనగామ ధర్మకంచలోని ప్రభుత్వ వసతిగృహాన్ని ఏర్పాటు చేశారు. పురుషుల కోసం ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల భవనాన్ని కేటాయించారు.

వివరాలివి..

కళాశాలలో వైద్య విద్యార్థులు : 100
బోధన సిబ్బంది : 70
పరిపాలనా విభాగంలో.. : 10
అనుబంధ ఆసుపత్రులు : 2

కళాశాల ప్రారంభానికి సర్వం సిద్ధం

వైద్య కళాశాలలో ఇప్పటికే 10 మంది ప్రొఫెసర్లు, 18 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 42 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధుల్లో చేరారు. పరిపాలనా విభాగంలో సేవలందించేందుకు ముగ్గురు సూపరింటెండెంట్లు, ఇద్దరు ఏవోలు, ఇద్దరు హెడ్ నర్సులు, ఒక ఎంఎస్‌డబ్ల్యూ, ఇద్దరు రికార్డు అసిస్టెంట్లు విధుల్లో చేరారు. ఎంసీహెచ్ పక్కనే తరగతి గదులు, అటానమీ, హిస్టాలజీ, బయో కెమిస్ట్రీ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. నీట్, రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా కళాశాలలో 100 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. వీరికి శుక్రవారం నుంచి తరగతులు నిర్వహించనున్నారు. రాష్ట్ర డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ రమేష్‌రెడ్డి వైద్య కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

డాక్టర్ డి.గోపాల్‌రావు, ప్రిన్సిపల్, వైద్య కళాశాల

జనగామలో వైద్య కళాశాల తరగతుల ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. బోధన, బోధనేతర సిబ్బంది పూర్తిస్థాయిలో కళాశాలలో చేరారు. తరగతి గదులు, వసతిగృహాల కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు, వసతులతో తరగతులు బోధించేందుకు చర్యలు తీసుకున్నాం.

# నగరం నరకం చూస్తోంది..!

జనగామ :నగరం రోజురోజుకు విస్తరిస్తోంది. రోజుకో షాపింగ్ మాల్, ఆసుపత్రి పుట్టుకొస్తోంది. రద్దీ ప్రాంతాల్లో ప్రధాన రహదారులకు ఇరువైపులా ఇవి వెలుస్తున్నా యి. మరోవైపు ద్విచక్ర వాహనాలు, కార్ల కొనుగోలు విపరీతంగా పెరిగింది. వాహనం నిలపడానికి స్థలం దొరకడం లేదు. రోడ్డుపై ఆపితే ట్రాఫిక్ పోలీసులు జరిమానాలతో బెంబేలెత్తిస్తున్నారు. దీంతో ఎక్కడ నిలపాలో తెలియక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లుపరిశీలనలో తేలింది.

ఎవరికీ పట్టదు..

వ్యాపార వాణిజ్య సముదాయాలు నిబంధనలు పాటించడం లేదు. వాణిజ్య భవనాల సముదాయాల్లో పార్కింగ్ స్థలాలు తప్పనిసరిగా ఉండాలనే నిబంధనలున్నా ఎక్కడా అమలు కావడంలేదు. కొన్ని చోట్ల సెల్లార్‌లు అలంకారప్రాయంగా ఉన్నాయి. ఎక్కువ శాతం రహదారులను ఆనుకొని నిర్మిస్తుండగా పార్కింగ్ కోసం స్థలం కేటాయించడం లేదు. కొన్ని చోట్ల నివాసానికి అనుమతులు తీసుకొని నిర్మాణం పూర్తయ్యాక వాణిజ్య సముదాయాలకు ఉపయోగిస్తుండటంతో పార్కింగ్ సమస్యలు తలెత్తుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

వాణిజ్య సముదాయాల ముందు వాహనం నిలిపితే పోలీసులు చరవాణిలో ఫొటో తీసి జరిమానా విధిస్తున్నారు. పార్కింగ్ సదుపాయం ఉంటే తమకు జరిమానాలు తప్పేవని వాహనదారులు వాపోతున్నారు.

నగరంలోని హనుమకొండ చౌరస్తా, టైలర్ స్ట్రీట్, కాకాజీ కాలనీ, హనుమకొండ బస్టాండు, కుమార్‌పల్లి రోడ్డు, ములుగురోడ్డు, కాజీపేట, నయీంనగర్, కేయూ క్రాస్, ఆర్ఈసీ, సుబేదారి, అదాలత్, హంటర్‌రోడ్డు ప్రాంతాల్లో వాహనాలు వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఇరుగ్గా ఉన్న ఇక్కడి రోడ్లు పక్కనే ప్రైవేటు ఆసుపత్రులు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు అధిక సంఖ్యలో ఉన్నాయి. ఇరుకు రోడ్లపైనే కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. హనుమకొండ చౌరస్తా, కాకాజీకాలనీ ప్రాంతంలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది.

ఇలా చేద్దాం వాణిజ్య భవనాల సెల్లార్లలో పార్కింగ్ సౌకర్యం ఉండేలా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలి. నగరంలో పార్కింగ్ స్థలాలను నగరపాలక సంస్థ, పోలీస్ శాఖ సంయుక్తంగా గుర్తించాలి.

రహదారులే పార్కింగ్ స్థలాలు

వరంగల్ ప్రాంతంలోని పోచమ్మమైదాన్, కాశీబుగ్గ, వరంగల్ రైల్వేస్టేషన్ సెంటర్, వరంగల్ హెడ్ పోస్టాఫీస్ కూడలి, పాత చౌరస్తా నుంచి ఆర్ఎన్‌టీ రోడ్, బట్టలబజారు ఆర్వోబీ సెంటర్, పాత బీటుబజారు సెంటర్‌లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఉంటోంది.

వరంగల్ బట్టలబజారు, పాత బీటుబజారు, ఆర్ఎన్‌టీ రోడ్, పిన్నావారి వీధి, డాల్ఫిన్ గల్లీ, జేపీఎన్‌రోడ్, వరంగల్ చౌరస్తా, ఎంజీఎం కూడలి, గోపాలస్వామి గుడి, పోచమ్మమైదాన్ సెంటర్లలో రహదారులపైనే వావాహనాలు నిలుపుతున్నారు. వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా వస్త్ర దుకాణాలు, హోటళ్లు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలున్నాయి. పరిసర ప్రాంతాల్లో అనువైన పార్కింగ్ స్థలాలు లేవు.

న్యూస్‌టుడే, రామన్నపేట, మట్టెవాడ, గిర్మాజీపేట

రద్దీ.. ఆ పక్కనే మూలమలుపు

వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఎస్‌బీఐకి వివిధ పనుల నిమిత్తం రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, పింఛన్‌దారులు వేలల్లో వస్తుంటారు. ఇంత రద్దీగా ఉండే బ్యాంకు వద్ద వాహనాలు నిలిపేందుకు స్థలం లేకపోవడంతో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపైనే నిలుపుతున్నారు. బ్యాంకు పక్కనే బస్టాండ్.. రహదారి మూలమలుపు ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.సాయంత్రమైందంటే జనసందడి

రంగశాయిపేట: వరంగల్–ఖమ్మం ప్రధాన రహదారిలోని రంగశాయిపేట గవిచర్ల క్రాస్‌రోడ్ కూడలి నిత్యం రద్దీగా ఉంటుంది. ఇదే ప్రాంతంలో రెండు మద్యం దుకాణాలు, ఓ బార్ ఉంది. చేపల మార్కెట్, నెక్కొండ, పర్వతగిరి ప్రాంతాలకు వెళ్లే బస్‌స్టాప్ ఇక్కడే ఉండటంతో ఆటోలు, జీపులు ప్రైవేటు వాహనాలు నిలుపుతున్నారు. స్థానిక వాణిజ్య సముదాయాల వారు రోడ్డుకు ఇరుపక్కల ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. సాయంత్రం ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

# పుస్తక నేస్తం పిలుస్తోంది

కరీంనగర్ : పుస్తకాలు కొత్త ప్రపంచానికి దారులు వేస్తాయి. సాంకేతికత పెరిగిన తరుణంలో ఈతరం వారికి పుస్తకం మహిమ తెలుసుకొనే ఓపిక లేకుండా పోతోంది. మరికొందరు మాత్రం వ్యక్తిత్వం, జీవిత చరిత్రలు, సాహిత్యం చదివేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అనేక పుస్తకాలను అందుబాటులోకి తెచ్చేలా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా కేంద్రంగా ముచ్చటగా మూడోసారి పుస్తక మహోత్సవాన్ని గురువారం నుంచి నిర్వహించనున్నారు. 2017లో, 2022లో వచ్చిన స్పందనను ఆశిస్తూ తాజాగా హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ, తెలంగాణ బుక్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో ఈ పుస్తక మహోత్సవాన్ని ఈ నెల 8 వరకు నిర్వహించనున్నారు.

పెరిగిన పుస్తక స్టాళ్లు

కరీంనగర్‌లోని సర్కస్ గ్రౌండ్ వేదికగా ప్రారంభమయ్యే బుక్‌ఫెయిర్‌కు 56 స్టాళ్లు.. దాదాపు 50 వేల పుస్తకాలు, 500 పబ్లిషర్ పుస్తకాలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఇందులో 50 శాతం సాహిత్యం, 40 శాతం అన్ని రకాలు, 10 శాతం పిల్లలకు సంబంధించిన పుస్తకాలు ఉంటాయని పేర్కొంటున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తరప్రదేశ్, చెన్నై, ముంబయి, ఢిల్లీకి చెందిన పబ్లిషర్స్ పాల్గొంటున్నారని చెప్పారు. ఎల్‌కేజీ పిల్లవాడి నుంచి అన్ని వర్గాల వారు తమకు ఇష్టమైన పుస్తకాలు ఎంచుకొనేలా ఈ బుక్‌ఫెయిర్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లా పాలనాధికారి ఆర్.వి.కర్ణన్, అదనపు పాలనాధికారి జీవీ శ్యాంప్రసాద్‌లాల్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ సారి జిల్లా సాహితీ పబ్లికేషన్స్‌తో పాటు జిల్లాలోని పుస్తక విక్రయదారులు సైతం ఇందులో భాగస్వామ్యం అవుతున్నారు.

నేటి కార్యక్రమాలు

గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 'భేటీ బచావో.. భేటీ పడావో' అంశంపై సంతకాల సేకరణ, మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు 'ప్రకృతి మనది- రక్షణ మనదే' అంశంపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీ, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఒగ్గు కథ, మిమిక్రీ, ఏకపాత్రాభినయం, 6 నుంచి 6.20 వరకు బుక్ టాక్‌లో డాక్టర్ గండ్ర లక్ష్మణ్‌రావుచే పోతన-గజేంద్రమోక్షం పుస్తకంపై ప్రసంగం, 6.30 నుంచి 8.30 వరకు 'గ్రంథాలు-సామాజిక చైతన్యం' అంశంపై సాహిత్య సమాలోచనలుంటాయి.

పోటీలు, సదస్సులు, ప్రదర్శనలు

పుస్తక మహోత్సవ ప్రాంగణానికి పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ సంస్కృత పండితుడు శ్రీభాష్యం విజయసారథి పేరు, సభా వేదికకు ప్రముఖ సాహితీవేత్త పాకాల యశోదరెడ్డి, ముఖద్వారానికి ప్రముఖ రచయిత రేగులపాటి కిషన్‌రావుల పేర్లు ఖరారు చేశారు. రోజూ విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు, బుక్ టాక్ సాహితీ కార్యక్రమం, పురస్కారం ప్రదానం, సాహిత్య సమాలోచనలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి.

పిల్లల మనోబలం పెరిగేలా..పుస్తక పఠనం పిల్లల్లో మనోబలం పెరిగేలా చేస్తుంది. ఈతరం పిల్లలను చిన్న చిన్న విషయాలకే బెంబేలెత్తి పోతున్నారు. ఈ పుస్తక మహోత్సవ ప్రపంచంలో పాల్గొనేలా పిల్లలను తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాలు ప్రోత్సహించి వారు నచ్చిన పుస్తకాలు కొనేలా ప్రేరణ ఇవ్వాలి.కొయ్యడ చంద్రశేఖర్, కార్యదర్శి, తెలంగాణ బుక్ ట్రస్ట్

# మోటార్ల పునరుద్ధరణ చర్యలు వేగిరం

ధర్మారం : ధర్మారం మండలం నందిమేడారం పంపుహౌస్ వద్ద ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం పైపులైను బటర్ ఫ్లై గేట్‌వాల్వు పగిలిపోగా పునరుద్ధరణ చర్యల్లో అధికారులు వేగం పెంచారు. గేట్‌వాల్వు పగిలిన వెంటనే అప్రమత్తమైన అధికారులు ప్రవాహాన్ని మళ్లించి నష్ట శాతాన్ని తగ్గించగలిగారు. లేకుంటే మోటార్లన్నీ మునిగిపోవడంతో పాటు ప్యానెల్ బోర్డులు తడిస్తే భారీగా నష్టం వాటిల్లేది. ఈఎన్‌సీ నల్ల వెంకటేశ్వర్లు ఆదేశాలతో మంగళవారం రాత్రి నుంచే పంపుహౌస్ పునరుద్ధరణ చర్యలు మొదలయ్యాయి. బుధవారం పంపుహౌస్‌లో ప్యానల్ బోర్డుల వద్ద చేరిన బురదను తొలగించారు. ప్యానల్ బోర్డులకు, మోటార్లకు ఎలాంటి నష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మోటార్ల వద్ద చేరిన వరద నీటిని తొలగించేందుకు మూడు భారీ పంపుసెట్లను ఏర్పాటు చేశారు. ఈఈ విష్ణుప్రసాద్, డీఈఈ బుచ్చిబాబు, ఏఈ రుత్విక్ తదితరులు పనులను పర్యవేక్షిస్తున్నారు.

పంపుహౌస్‌ను ముంచిన రక్షణ గోడ

ఎల్లంపల్లి పథకంలో భాగంగా నందిమేడారం రిజర్వాయరు నుంచి నారాయణపూర్ జలాశయానికి ఎత్తిపోసే పంపుహౌస్‌ను చెరువకు ఎగువన నిర్మించారు. అప్పట్లో నందిమేడారం రిజర్వాయరు పూర్తి స్థాయి నీటి మట్టం 226 మీటర్లుగా ఉండేది. పంపుహౌస్‌లో 232.25 మీటర్ల వద్ద మోటార్లు బిగించారు. ఆ ఆర్వాత కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా రిజర్వాయరు సామర్థ్యం పెంచారు. 233 మీటర్ల ఎత్తులో చెరువు మత్తడి నిర్మించారు. దీంతో పూర్తి స్థాయిలో నీటిని నింపితే పంపుహౌస్‌లో చేరకుండా పంపుహౌస్‌కు ఉత్తరం, పడమర దిశల్లో రక్షణ గోడ నిర్మించారు. అయితే పంపుహౌస్‌కు దక్షిణం వైపు నుంచి పైపులైన్లుండగా గేట్ వాల్వు పగలడంతో వరద పంపుహౌస్ వైపునకు ప్రవహించింది. జలాశయం నుంచి పంపుహౌస్‌లోకి నీరు చేరకుండా అడ్డుగా నిర్మించిన రక్షణ గోడ, గేట్‌వాల్వు నుంచి వస్తున్న వరదను రిజర్వాయరులోకి చేరకుండా అడ్డుకుంది. అక్కడక్కడా వరద బయటకు వెళ్లేలా వదిలిన ఏర్పాట్లు, పంపుహౌస్ చుట్టూ చిన్న డ్రైనేజీలు ఉన్నా అవేం సరిపోలేదు. దీంతో పంపుహౌస్‌లోకి వరద పోటెత్తింది. అయితే గేట్‌వాల్వుల నుంచి ప్రవాహం వెళ్లేలా శాశ్వత ప్రతిపాదికన కాలువ ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలకు ఆస్కారం ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రెండు రోజుల్లో..

రెండు రోజుల్లో ఎత్తిపోతలు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నీరంతా ఖాళీ అయ్యాకే ఎత్తిపోతల విషయమై స్పష్టత రానుంది. మోటారు పంపుల్లోని కందెనలు, బేరింగ్‌లను మార్చాల్సి వస్తుందేమోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అలాంటి సమస్యలేం లేకుంటే రెండు రోజుల్లో రెండు మోటార్ల ద్వారా ఎత్తిపోతలు పునరుద్ధరించే అవకాశం ఉంది. మరమ్మతు చేయాల్సి వస్తే వారం రోజుల వరకు పట్టే ఆస్కారం ఉంది.

# మూసివేయలేక వనరుల నిలిపివేత



రామగుండం: రామగుండం బి-థర్మల్ విద్యుత్తు పరిశ్రమ మూసివేత దిశగా సాగుతున్న పరిణామాలు.. కొనసాగింపుపై నేతల హామీలతో గందరగోళ పరిస్థితి నెలకొంది. 62.5 మెగావాట్ల బి-థర్మల్ కేంద్రాన్ని 1972 జూన్ 16న ప్రారంభించారు. అనంతరం ఈ పరిశ్రమ విద్యుత్తు ఉత్పత్తిలో దేశంలోనే పలు రికార్డులు సాధించింది. బొగ్గు, నీరు, భూమి, రైలు, రోడ్డు మార్గాలు అందుబాటులో ఉండటం కలిసివచ్చింది. 'పిట్ హెడ్ స్టేషన్'గా ఉన్నా, పక్కనే ఎన్టీపీసీ ప్లాంట్లు విస్తరిస్తున్నా నాటి ఎ.పి.ఎస్.ఇ.బి., ఇప్పటి జెన్‌కో యాజమాన్యాలు బి-థర్మల్ విస్తరణపై పూర్తి నిర్లక్ష్యం వహించాయి. ప్రస్తుతం ఈ ప్లాంటును మూసివేయాలనే ఆలోచనతో నిధులు, బొగ్గు, ఇంధనం నిలిపివేశారు.

ఆదేశాలు ఒకలా.. అడుగులు మరోలా..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బి-థర్మల్‌ను విస్తరిస్తారని స్థానికులు, కార్మికులు, ఉద్యోగులు ఆశపడ్డారు. వారి కోరిక నెరవేరకపోగా ప్లాంటును కూడా మూసివేసే దిశగా అడుగులు పడుతున్నాయి. దేశంలో పురాతన చిన్న విద్యుత్తు ప్లాంట్లను మూసివేయాలన్న సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ(సీఈఏ) ఆదేశాలతో నాలుగేళ్ల కిందట రాష్ట్రంలోని కేటీపీఎస్ యూనిట్లను మూసివేశారు. బి-థర్మల్‌ను కూడా మూసివేయాలని భావించారు. అయితే అప్పటికే పునర్నిర్మాణం (ఆర్‌అండ్‌ఎం), ఈఎస్‌పీ పనులు పూర్తి చేసి కాలుష్యాన్ని తగ్గించడం, విస్తరణ చేపట్టకపోవడంతో మూసివేయకుండా 5 ఏళ్లు పొడిగించాలని ఎమ్మెల్యే కోరుకంటి చందర్, ఎంపీ బోర్లకుంట వెంకటేష్‌నేత దిల్లీకి వెళ్లి సీఈఏ ఛైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో అయిదేళ్లు నడిపేందుకు వారు అనుమతి ఇచ్చారు. అయితే జెన్‌కో యాజమాన్యం మాత్రం వార్షిక మరమ్మతులకు నిధులు, అనుమతి ఇవ్వడం లేదు. చివరిసారిగా 2014లో వార్షిక మరమ్మతులు జరగగా, ఆ తర్వాత కార్మికులు, ఇంజినీర్లు ప్లాంటును రక్షించుకుంటున్నారు. తాజాగా సీఈఏ మరో ఆదేశాలు జారీ చేసింది. రానున్న రోజుల్లో దేశంలో విద్యుత్తు కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున చిన్న ప్లాంట్లను మూసివేయవద్దని, మరమ్మతులు చేపట్టి కొనసాగించాలని, అవసరమైతే వాటి స్థానంలో కొత్త ప్లాంట్లను నెలకొల్పాలని సూచించింది. రామగుండంలో మాత్రం ఇందుకు భిన్నంగా జరుగుతోంది.

కార్మికులు, అధికారుల్లో ఆందోళన

ఈ ఏడాది జనవరి 26 నుంచి బి-థర్మల్‌కు బొగ్గు, ఇంధనం సరఫరా నిలిపివేశారు. ఉన్న నిల్వలతో ఉత్పత్తి చేపట్టాలని చెప్పడంతో అధికారులు, కార్మికుల్లో ఆందోళన మొదలైంది. ఈ విషయమై ఐకాస ఆధ్వర్యంలో నాయకులు జెన్‌కో ఉన్నతాధికారులను కలిసి విజ్ఞప్తి చేసినా ఫలితం లేదు. గత నెల 23న ఎమ్మెల్యే చందర్ బి థర్మల్‌ను సందర్శించి ప్లాంటు మూతపడకుండా చూస్తానని హామీ ఇచ్చారు. బొగ్గు, ఇంధనం సరఫరా పునరుద్ధరించి, వార్షిక మరమ్మతులకు రూ.15 కోట్లు మంజూరు ఇప్పించాలని కార్మికులు, అధికారులు ఆయనకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే 25న రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డిని కలిశారు. ఆయన సానుకూలంగా స్పందించి జెన్‌కో ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కాగా వరకు కూడా బొగ్గు, ఇంధనం సరఫరా పునరుద్ధరణపై ఎలాంటి ఆదేశాలు రాలేదని బ థర్మల్ ఇన్‌ఛార్జి ఎస్‌ఈ శంకరయ్య తెలిపారు.

# వచ్చింది పిసరంత... ఖర్చు కొండంత

వీర్నపల్లి : గ్రామ పంచాయతీలను ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతూనే ఉన్నాయి. అరకొర నిధులతో పల్లెల్లో పలు రకాల పనులు చేపట్టేందుకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, జీతాల చెల్లింపు పాలకవర్గాలకు భారంగా మారింది. వచ్చే నిధులు తక్కువగా ఉండటం, ఖర్చులు ఎక్కువ కావడంతో ఖజానా ఖాళీ అవుతుంది. ఫలితంగా పల్లెల్లో పనులు చేపట్టలేని పరిస్థితుల్లో పాలకవర్గాలున్నాయి. మరోవైపు చేసిన పనులకు కూడా బిల్లులు రాక సర్పంచులు ఇబ్బందులు పడుతున్నారు.

పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాల పునర్విభజనలో భాగంగా రాజన్న సిరిసిల్ల 13 మండలాలతో ఆవిర్భవించింది. 500 జనాభా ఉన్న పల్లెలను సైతం పంచాయతీలుగా మార్చించింది. దీంతో జిల్లాలో 255 పంచాయతీలు ఉండగా, అనుబంధ గ్రామాలను కలుపుకుని లెక్కిస్తే పల్లెల సంఖ్య 267 ఉంది. 1000 లోపు జనాభా ఉన్న పల్లెల్లో నిర్వహణ భారం ప్రజాప్రతినిధులు, అధికారులకు తలనొప్పి తెచ్చిపెడుతోంది. వెయ్యిలోపు జనాభా ఉన్న పల్లెలు 100 ఉండగా, ఐదు వేల జనాభా ఉన్న గ్రామాలు 148 ఉన్నాయి. ఐదు వేల పైబడి జనాభా ఉన్న పంచాయతీలు జిల్లాలో ఏడు ఉన్నాయి. గ్రామ పంచాయతీల నిర్వహణకు రాష్ట్ర ఆర్థిక సంఘం, 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు సమకూరుతున్నాయి. అయితే నిధుల చెల్లింపులో జాప్యం, ఫ్రీజింగ్ కారణంగా పంచాయతీల్లో ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎలాంటి ఆదాయ వనరులు లేని వాటిలో పరిస్థితి మరింత దారుణంగా మారింది.

ఆదాయ వనరులు లేక...

జిల్లాలోని 255 గ్రామ పంచాయతీలకు పన్నులే ప్రధాన ఆధారం. వీటితోపాటు లైసెన్సులు, బంజరుదొడ్డి, అంగడిబజార్లు, నీటి శుద్ధి కేంద్రాలు, పశువుల సంతలు, వృత్తి పన్ను, ఇళ్ల నిర్మాణాలు, ఆస్తి మార్పిడితో కొంత ఆదాయం సమకూరే అవకాశాలు ఉన్నాయి. వీటిని దక్కించుకునేందుకు గుత్తేదారులు ఆసక్తి కనబర్చడం లేదు. ఒక వేళ దక్కించుకున్న నష్టపోయామన్న కారణాలతో నిర్దేశిత రుసుం చెల్లించడం లేదు. అలాగే చిన్న గ్రామాల్లో ఆయా ఆదాయ వనరులు అంతగా లేవు. పూర్తి స్థాయిలో టీఎస్‌బీపాస్ అమలైతే కొంత ఆదాయం వచ్చే అవకాశం ఉంది. స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతున్నా అక్రమ వ్యాపారాల కారణంగా అనుకున్న మేర పంచాయతీలకు ఆదాయం రావడం లేదు. అనధికారికంగా ప్రజాప్రతినిధులకు చెల్లిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

అదనపు భారంతో...

జిల్లాలోని పంచాయతీలకు ప్రతి నెలా రూ. 4.23 కోట్ల నిధులు వస్తుంటాయి. పన్నులు, ఇతరత్రా ఆదాయ వనరుల నుంచి జిల్లాకు రూ. 5.28 కోట్లు సమకూరుతుంది. చిన్న పంచాయతీల్లో చాలీచాలని నిధులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రహదారులు, పైపులైన్, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ వంటివి మొదటి నుంచి ఉన్నప్పటికీ పల్లె ప్రగతిలో భాగంగా కొనుగోలు చేసిన ట్రాక్టర్ల నెలసరి వాయిదా, ఇంధన ఖర్చుతో అదనపు భారం పడుతోంది. దీంతో పారిశుద్ధ్య సిబ్బందికి వేతనాలు చెల్లించడం ఇబ్బందిగా మారుతోంది. ఈ ఏడాది 15వ ఆర్థిక సంఘ నిధులు రెండు విడతల్లో రూ. 19.76 కోట్లు



జమ కాగా, జులై నుంచి రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు విడుదల కాలేదని ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. దీంతో సిబ్బంది వేతనాల చెల్లింపు, పల్లెల నిర్వహణను పూర్తి స్థాయిలో చేపట్టలేని దుస్థితి నెలకొంది. కేవలం విద్యుత్తు బిల్లులు చెల్లిస్తే ఖజానా పూర్తిగా ఖాళీ అయ్యే అవకాశం ఉంటుంది. జిల్లాలోని అన్ని మండలాల్లో దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. ఐదేళ్లుగా పల్లెల్లో పాడైపోయిన మురుగు కాలువల మరమ్మతులు చేపట్టేందుకు నిధులు లేమి అవరోధంగా మారింది. ఊర్లలోని క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, చిన్న చిన్న పండగల నిర్వహణకు తిప్పలు తప్పడం లేదు. ప్రజాప్రతినిధులు సొంతంగా ఖర్చు చేస్తేనే తప్పా పనులు జరిగే పరిస్థితి కనిపించడం లేదు.

ప్రత్యేక నిధులిస్తేనే...

ప్రతి నెలా రూ. 4.23 కోట్లు ఆర్థిక సంఘాల నిధులు నెల నెలా వస్తేనే పల్లెల్లో పనులు చేపట్టే అవకాశాలు ఉన్నాయి. రూ. 5 లక్షల లోపు నిధులు వచ్చే పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా గ్రాంట్లు మంజూరు చేసేది. జిల్లాలో సుమారు 55 పంచాయతీలను గుర్తించి రూ. 5 లక్షలు నిండేలా మిగతా డబ్బును ఖాతాలకు జమ చేసేది. రెండేళ్లుగా ఈ ప్రత్యేక నిధుల కేటాయింపు నిలిచిపోవడం తీవ్ర ఇబ్బందిగా మారింది. దీంతో వచ్చే నిధులతో పోలిస్తే పల్లెల నిర్వహణకు ఖర్చులు అధికంగా ఉంటున్నాయి. ఏకగ్రీవ పంచాయతీలకు ఇచ్చే రూ. 10 లక్షల నజరానా చెల్లిస్తే కొంతమేరకు ఉపయోగపడనున్నాయి. ప్రభుత్వం స్పందించి సకాలంలో నిధులు విడుదల చేయాలని సర్పంచులు కోరుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులు వాస్తవమే- రవీందర్, జిల్లా పంచాయితీ అధికారి సమయానికి ఆర్థిక సంఘ నిధులు రాకపోవడంతో పంచాయతీల్లో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడిన విషయం వాస్తవమే. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 19 కోట్లు పంచాయతీ ఖాతాల్లో జమయ్యాయి. రాష్ట్ర ఆర్థిక సంఘం (ఎస్‌ఎఫ్‌సీ) నిధులు నెల రోజుల నుంచి రావడం లేదు. కేంద్ర నిధుల మాదిరిగానే ఎస్‌ఎఫ్‌సీ నిధులు మంజూరు చేయాలి. ప్రత్యేకంగా ఇచ్చే గ్రాంటు ఈ ఏడాదికీ రాలేదు.

# మట్టిని తవ్వుతూ.. ఆక్రమిస్తూ!

సిరిసిల్ల : ప్రభుత్వం సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి కోట్లాది రూపాయల పరిహారం చెల్లించి సేకరించిన భూముల పరిరక్షణను అధికారులు మరిచారు. పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడికక్కడ కబ్జాలకు పాల్పడుతున్నారు. గోదావరికి భారీగా వరద పోటెత్తినపుడు శ్రీరాంసాగర్ ద్వారా మిగులు జలాలు నదిలోకి వదలకుండా వరద కాల్వ ద్వారా జిల్లాలోని రాజరాజేశ్వర జలాశయానికి మళ్లిస్తారు. దిగువమానేరు జలాశయంలోనికి నేరుగా మళ్లించేందుకు బోయినపల్లి మండలం వరదవెల్లి నుంచి వెంకటాపూర్‌కు మరో ఉప కాల్వ ఉంది. అయితే కాళేశ్వరం ప్రాజెక్టుతో నీటి లభ్యతను బట్టి వరద కాల్వను రెండు రకాలుగా ఉపయోగిస్తున్నారు. ఈ కాల్వకు ఎడమ వైపు అదనపు టీఎంసీ కాల్వను తవ్వుతున్నారు. ఉప కాల్వ నిరుపయోగంగా మారింది. సంవత్సరాల తరబడి రెవెన్యూ, జలవనరులశాఖల ఉదాసీన వైఖరితో కాల్వ మట్టిని ఇష్టారీతిన తవ్వేస్తున్నారు. ఆక్రమణలతో భవిష్యత్తులో కాల్వ నామరూపాల్లేకుండా పోయే ప్రమాదం ఉంది.

శ్రీరాంసాగర్ నుంచి ఇటు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రాజరాజేశ్వర జలాశయంలోకి నీటిని విడుదల చేస్తున్నారు. ఇక్కడి నుంచి నీటి అవసరాన్ని బట్టి దిగువమానేరు, పదో ప్యాకేజీ ద్వారా అన్నపూర్ణ జలాశయానికి వదులుతున్నారు. 2012లో ఉప కాల్వ నిర్మాణానికి జగ్గారావుపల్లి, వరదవెల్లి, వెంకట్రావుపల్లి గ్రామాల నుంచి 250 ఎకరాల భూమిని సేకరించారు. దీనికి అప్పట్లో రైతులకు మొత్తంగా రూ. 6.25 కోట్ల పరిహారం చెల్లించారు. కాల్వకు రెండు వైపులా 60 నుంచి 100 మీటర్ల వరకు స్థలం ఉంటుంది. దీనికి ఇరువైపులా వ్యవసాయ భూములున్నాయి. రియల్ వ్యాపారులు వెంచర్లు చదును చేసేందుకు కాల్వ మట్టిని తవ్వి తరలిస్తున్నారు. ఇదే అదనుగా సమీపంలోని వారు ఆక్రమణలు చేస్తున్నారు. కొన్ని చోట్లయితే కాల్వ మీదుగా వెళ్లేదారి కూడా లేకుండా పోయింది. ప్రధాన వరద కాల్వ కుడివైపు కూడా ఇదే తరహా ఆక్రమణలు కొనసాగుతున్నాయి. నీటి లభ్యతతో భూముల విలువ ఏటా పెరుగుతుండటం ఆక్రమణలకు అడ్డు లేకుండా పోయింది.

వినియోగిస్తే మినీ జలాశయం

ఉప కాల్వ నిర్మాణం పూర్తయిన తర్వాత 2010లో ట్రయల్ రన్‌లో ఒకసారి మాత్రమే ఉప కాల్వ ద్వారా దిగువమానేరుకు నీటిని విడుదల చేశారు. తర్వాత నీటిని తరలించిన దాఖలాల్లేవు. భవిష్యత్తులోనూ నీటిని తరలిస్తారనేది ప్రశ్నార్థకమే. ఈ కాల్వ పరిధిలో రైతుల వ్యవసాయ బావులకంటే లోతుగా ఉండటంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. వరద కాల్వ ద్వారా నీటిని విడుదల చేసే గేట్లు ఎత్తి ఉప కాల్వలోకి విడుదల చేస్తున్నారు. ఇందులోకి నీటిని విడుదల చేయడం ద్వారా పంటలకు ఉపయోగపడుతుంది. 22 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యం ఉన్న ఈ కాల్వలో రెండు టీఎంసీల నీటిని నిల్వ చేయవచ్చు. దీంతో ఇదో మినీ జలాశయంగా మారుతుంది. వరద కాల్వలో అక్కడక్కడ బ్యారేజీల మాదిరిగా నీటి నిల్వ కట్టడాలను ఏర్పాటు చేసినట్లయితే వరద నీరు రానపుడు కనీసం వర్షపు నీరయినా నిలిచి భూగర్భ జల మట్టం పెరుగుతుంది. రైతులు మోటార్ల ద్వారా పంటలను పండించుకోగలుగుతారు. చేపల పెంపకంతో సమీప గ్రామాల్లోని మత్స్యకారులకూ ఏడాది పొడవునా ఉపాధి లభిస్తుంది.హద్దులు గుర్తిస్తాం- శ్రీనివాసగుప్తా, ఈఈ, వరద కాల్వభూ సేకరణ సమయంలో ఏ ప్రాంతంలో ఎంత సేకరించామనేది కాగితాల్లో స్పష్టంగా ఉంది. రైతులు తమకు ఉన్న పరిధిలోనే పంటలు పండించుకోవాలి. ఆక్రమణలు చేపడితే వారికే నష్టం. సిబ్బందితో కలిసి పర్యవేక్షించి మట్టి తవ్వకాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

# ప్రజా చైతన్యం.. పరిశుభ్ర పథం

పెద్దపల్లి : అధికారుల ప్రణాళిక.. ప్రజాప్రతినిధుల సమష్టి కృషి.. ప్రజా చైతన్యం వెరసి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ సర్వేలో జిల్లా హవా కొనసాగుతోంది. పాయింట్ల సాధనలో అగ్ర పథంలో దూసుకెళ్తోంది. జాతీయ స్థాయి పోటీలో తన స్థానాన్ని పదిలం చేసుకుంది. కేంద్ర గ్రామీణ మంత్రిత్వ శాఖ ఆధీనంలోని స్వచ్ఛభారత్ మిషన్ ప్రకటించిన త్రైమాసిక సర్వే ఫోర్ స్టార్ పాయింట్ల పట్టికలో పెద్దపల్లి జిల్లా దేశంలో మూడో స్థానంలో నిలిచింది. ఫైవ్ స్టార్ పాయింట్లు సాధించేందుకు ఎగబాకుతోంది. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యాన్ని నిరంతరాయంగా అమలు చేయడంతో ఈ ఘనత సాధ్యమైంది. జాతీయ పురస్కారం సాధించేందుకు సిద్ధమవుతోంది.

పాయింట్ల లెక్కింపునకు ప్రాతిపదిక

జిల్లాలో ఇంటింటికీ వ్యక్తిగత మరుగుదొడ్డి, సామాజిక శౌచాలయాలు నిర్మించడంతో ఓడీఎఫ్ ప్లస్ సాధించింది. గ్రామ పంచాయతీల్లో బహిరంగ మల విసర్జన నిర్మూలనతో పాటు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారు. ద్రవ, ఘన వ్యర్థాల నిర్వహణ, సేంద్రియ ఎరువుల తయారీ, ఇంకుడు గుంతలు, మురుగు వ్యవస్థ పరిశుభ్రతపై ప్రతి నెలా జిల్లా స్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో అధికార బృందాలు తనిఖీ చేసి అంతర్జాలంలో నిక్షిప్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య రంగాల్లో ప్రతిభ నివేదిక ఆధారంగా దేశవ్యాప్తంగా జిల్లాలకు పాయింట్లు కేటాయిస్తున్నారు.

అడుగు దూరంలో ఫైవ్ స్టార్

జిల్లాలో 266 పంచాయతీలకు గాను 265 చోట్ల స్వచ్ఛత నివేదికలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. రామగుండం నగరపాలక సంస్థలో విలీనమైన వెంకట్రావుపల్లి పంచాయతీ మాత్రమే మిగిలి ఉంది. ఇక్కడ ఇంటింటికీ వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్లు, డంపింగ్‌యార్డు, ఇంకుడుగుంతల నిర్మాణం తుది దశకు చేరింది. గోడలపై సందేశాత్మక చిత్రాలు గీస్తున్నారు. స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ పంచాయతీ అంతర్జాంలో ప్రగతి నివేదికలు నమోదు చేస్తే జిల్లా ఫైవ్ స్టార్‌కు చేరుకోనుంది.

నిర్లిప్తత వీడితేనే సంపూర్ణం

పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ఆందోళన నెలకొంది. కొన్ని చోట్ల సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ నామమాత్రంగా మారిందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇంకుడు గుంతల బిల్లులు నిలిచిపోవడంతో ఆసక్తి ఉన్న లబ్ధిదారులు కొత్తగా నిర్మించుకునేందుకు ముందుకు రావడం లేదు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి సంపూర్ణ స్వచ్ఛతలో ప్రగతి సాధించాలంటే నిర్లిప్తత వీడాల్సిన అవసరం ఉంది.

స్వచ్ఛతపై ప్రత్యేక శ్రద్ధ

ఊరికొక సెగ్రిగేషన్ షెడ్డు, డంపింగ్ యార్డు నిర్మించి ఇంటికొక చెత్త బుట్టను పంపిణీ చేశారు.ట్రాక్టర్ల ద్వారా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, సెగ్రిగేషన్ షెడ్లకు తరలిస్తున్నారు.పల్లెల్లో ఘన, ద్రవ వ్యర్థాలను వేరు చేయడంతో సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నారు.వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్ల నిర్వహణపై ప్రజా చైతన్యం కల్పిస్తున్నారు.

ప్రజాఆరోగ్య పరిరక్షణపై ప్రధాన కూడళ్లలో వేసిన సందేశాత్మక చిత్రాలు ఆలోచింపచేస్తున్నాయి.

గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన పెంచుతున్నారు.

జిల్లాలో ఫోర్ స్టార్ పాయింట్ల ప్రగతి ఇదీ..

మొత్తం పంచాయతీలు: 266వ్యక్తిగత మరుగుదొడ్లు: 1,37,069

ఫోర్ స్టార్ సాధించిన పంచాయతీలు: 265మొత్తం డెల్టా స్కోర్: 300

సాధించిన స్కోర్: 285.44

# ఆధారాలతో అడ్డంగా దొరికినా.. నిస్సిగ్గుగా బాబుకు సపోర్టు చేస్తారు: సీఎం జగన్




తూర్పుగోదావరి: చంద్రబాబు కాపులను అడుగడుగునా మోసం చేశారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. రిజర్వేషన్లు సాధ్యం కాదని తెలిసినా బాబు మోసం చేశారని మండిపడ్డారు. చంద్రబాబు గతంలో 10 శాతం కూడా హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో కాపుల సంక్షేమానికి రూ. 39,247కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన దానికంటే ఎక్కువగా చేశామన్నారు. గత ప్రభుత్వం ఈ కార్యక్రమాలు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు.

**చట్టం ఎవరికైనా ఒక్కటే :** ఈ మేరకు సీఎం జగన్ తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో లబ్ధిదారులకు 'వైఎస్సార్ కాపు నేస్తం' నాలుగో విడత ఆర్థిక సాయాన్ని అందిచే కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఇటీవలే అవినీతి కేసులో ఆధారాలతో సహా చంద్రబాబు అరెస్టయ్యారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. ఇన్ని అక్రమాలు, దోపిడీలు చేసిన బాబును రక్షించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిస్సిగ్గుగా కొందరు చంద్రబాబుకు సపోర్టు చేస్తున్నారని మండిపడ్డారు. చట్టం ఎవరికైనా ఒక్కటేనని అన్నారు.

**ఓటుకు నోటు కేసులో అడ్డంగా బుక్కైన బాబు :** 45 ఏళ్లుగా దోపిడీని చంద్రబాబు రాజకీయంగా మార్చుకున్నారని సీఎం జగన్ విమర్శించారు. తెలంగాణ ఎన్నికల్లో నల్లధనం ఇస్తూ బాబు అడ్డంగా దొరికిపోయారని తెలిపారు. కేసులో ఆడియో టేపుల్లో బ్లాక్‌మనీ పంచుతూ పట్టుబడ్డారని ప్రస్తావించారు. ఆ ఆడియో బాబుదే అని ఫోరెన్సిక్ కూడా నిర్ధారించిందని.. కానీ బాబు మాత్రం అది తనది కాదని బుకాయించారని గుర్తుచేశారు. తానేం తప్పు చేయలేదని చంద్రబాబు చెప్పుకొచ్చారని అన్నారు. 'ఫేక్ అగ్రిమెంట్‌తో లేని కంపెనీని ఉన్నట్లుగా సృష్టించి బాబు స్కాం చేశారు. ఒత్తిడి తీసుకొచ్చి సంతకాలు పెట్టి నిధులు దోచేశారు. స్కిల్ స్కాం సూత్రధారి, పాత్రధారి చంద్రబాబే అని సీఐడీ నిర్ధారించింది. డబ్బును డొల్ల కెంపీలకు ఎలా మళ్లించారన్నది ఈడీనే బయటపెట్టింది. చంద్రబాబు పీఏ చాటింగ్‌లను ఐటీశాఖ బయటపెట్టింది. ఫేక్ అగ్రిమెంట్ దొంగలను ఇప్పటికే అరెస్ట్ చేసింది. సాక్ష్యాలు, ఆధారాలు చూసిన తర్వాత కోర్టు బాబును రిమాండ్‌కు పంపింది. ఇంత అడ్డగోలుగా దొరికిపోయినా కూడా ప్రశ్నిస్తా, ప్రశ్నిస్తా అని బాబు అంటున్నారు.

**ఎల్లో మీడియా నిజాలను చూపించదు, వినిపించదు :** ఈడీ అరెస్ట్ చేసినా, ఐటీ నోటీసులిచ్చినా ఇంకా బుకాయిస్తున్నారు. కోర్టు రిమాండ్‌కు పంపితే ప్రశ్నిస్తా, ప్రశ్నిస్తా అన్న పవన్ ప్రశ్నించడు. ఎల్లో మీడియా నిజాలను చూపించదు, వినిపించదు. చంద్రబాబు అవినీతిపై మాట్లాడదు. వాటాలు పంచుతాడు కాబట్టే వీరెవ్వరూ ప్రశ్నించారు. లంచాలు తీసుకుంటే తప్పేంటని చెత్తపలుకులు రాసేది ఒకడు, ములాఖత్‌లో మిలాఖత్ చేసుకొని పొత్తు పెట్టుకునేది ఇంకొకడు.

**371 కోట్ల రూపాయల జనం సొమ్ము ఎటుపోయింది? :** చంద్రబాబు నడిపిన కథలో ఆయన్ను కాకుండా ఇంకా ఎవరిని అరెస్ట్ చేయాలి?. 371 కోట్ల రూపాయల జనం సొమ్ము ఎక్కడికిపోయింది. ఎవరి జేబుల్లోకి ఈ సొమ్మంతా పోయింది. ప్రజలంతా ఆలోచన చేయాలి. మీ బిడ్డ హయాంలో మీకు మంచి జరిగిందా లేదా చూడండి' అని సీఎం జగన్ నిడదవోలు సభలో వ్యాఖ్యానించారు.




దిల్లీ: ఖలిస్థానీ సానుభూతిపరుల ఆగడాలతో భారత్ – కెనడా మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇటీవల జరిగిన జీ20 సదస్సు తర్వాత ఇవి మరింత తీవ్రమయ్యాయి. ఫలితంగా ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలకు బ్రేక్ పడింది. ఇరు దేశాల మధ్య రాజకీయ విభేదాలు పరిష్కారమైన తర్వాతే ఈ చర్చలను పునఃప్రారంభిస్తామని భారత్ స్పష్టంగా చెప్పింది. "కెనడాలో చోటుచేసుకున్న కొన్ని రాజకీయ పరిణామాలపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దిల్లీ వాటిని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అందువల్ల ఆ రాజకీయ సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు వాణిజ్య చర్చలను నిలిపివేస్తున్నాం. అయితే ఇది తాత్కాలికం మాత్రమే. సమస్య పరిష్కారమైన తర్వాత చర్చలను మళ్లీ ప్రారంభిస్తాం" అని భారత సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. అటు కేంద్ర వాణిజ్య శాఖమంత్రి పీయూష్ గోయల్ కూడా ఓ మీడియాతో మాట్లాడుతూ.. ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. వాస్తవానికి జీ20 సదస్సుకు కొద్ది రోజుల ముందే భారత్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కెనడా ప్రకటించింది. వచ్చే నెలలో ఆ చర్చలను తిరిగి ప్రారంభించాల్సి ఉండగా.. ఇప్పుడు మరోసారి వాటికి బ్రేక్ పడింది. అటు కెనడా కూడా ఈ చర్చలపై స్పందించింది. భారత్‌తో అక్టోబరులో జరగాల్సిన వాణిజ్య మిషన్‌ను వాయిదా వేయాలని ఆ దేశ వాణిజ్య మంత్రి మేరీ ఎన్జీ నిర్ణయించారు. ఈ విషయాన్ని వాణిజ్య శాఖ అధికార ప్రతినిధి ప్రకటించారు. అయితే ఇందుకు గల కారణాలను మాత్రం కెనడా వెల్లడించలేదు. ఈ పరిణామాలతో ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చలు నిలిచిపోయాయి. కెనడాలో ఖలిస్థానీ సానుభూతిపరుల ఆందోళనలపై భారత్ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ.. జస్టిన్ ట్రూడో ప్రభుత్వం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల జీ20 సదస్సుకు వచ్చిన ట్రూడోతో భారత ప్రధాని నరేంద్రమోదీ ఈ విషయాన్ని నేరుగా ప్రస్తావించారు. భారత్ వ్యతిరేక శక్తులు కెనడాలో ఆశ్రయం పొందుతున్నారని, అది కెనడాకు కూడా ముప్పుగా మారుతుందని హెచ్చరించారు. భారత్–కెనడా దౌత్య సంబంధాల పురోగతిలో పరస్పర గౌరవం, విశ్వాసం చాలా ముఖ్యమని తేల్చిచెప్పారు. దీంతో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన విభేదాలు నెలకొన్నాయి. భారత్, కెనడా మధ్య ఇప్పటివరకు ఆరు సార్లు వాణిజ్య చర్చలు జరిగాయి. ఇరు దేశాల మధ్య అత్యధిక వస్తువులపై కస్టమ్స్ సుంకాన్ని తొలగించడం లేదా తగ్గించడం, పెట్టుబడులను ఆకర్షించేలా వాణిజ్య నిబంధనలను సరళీకరించడం ఈ చర్చల ముఖ్య ఉద్దేశం. ఈ ఒప్పందంతో టెక్స్‌టైల్, లెదర్ వంటి ఉత్పత్తులపై సుంకాలను తొలగించుకోవడంతో పాటు వీసా నిబంధనలను కూడా సులభతరం చేసుకోవచ్చని భారత్ భావిస్తోంది. అటు భారత్ నుంచి డెయిరీ, వ్యవసాయ ఉత్పత్తులను తక్కువ ధరకు దిగుమతి చేసుకోవచ్చని కెనడా ఈ చర్చలు ప్రారంభించింది.




రైల్వే ప్రయాణికులకు శుభవార్త. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ స్లీపర్ రైలు వచ్చే ఏడాదిలో అందుబాటులోకి రానుంది. 2024 మార్చిలోనే దీన్ని తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. దీంతో పాటు వందే మెట్రో రైలును సైతం వచ్చే ఏడాదే తీసుకురానున్నట్లు పేర్కొన్నాయి. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా స్లీపర్ క్లాస్ వందే భారత్ రైళ్లను తీసుకొస్తామని రైల్వే శాఖ ఇది వరకే తెలిపింది. అయితే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే తొలి వందే భారత్ స్లీపర్ కోచ్ రైలును అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ బీజీ మాల్యా తెలిపారు. 2024 మార్చి నాటికి ఇది అందుబాటులోకి రానుందని చెప్పారు. తక్కువ దూరాల కోసం ఉద్దేశించిన వందే మెట్రో రైలును సైతం 2024 జనవరిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు మాల్యా తెలిపారు. ఇది 12 కోచ్‌లతో రానుందని చెప్పారు. ఇవి నాన్ ఏసీ కోచ్‌లు. తక్కువ టికెట్ ధరకు ప్రయాణ సౌకర్యాన్ని అందించే ఉద్దేశంతో వీటిని తీసుకురానున్నారు. ప్రస్తుతం ఉన్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అన్నీ సీటింగ్ కోచ్‌లే ఉన్నాయి. అయితే రాత్రి పూట ప్రయాణాలకు ఇవి అనువుగా ఉండడం లేదు. దీంతో వీటి స్థానంలో వందే స్లీపర్ తీసుకురావాలని రైల్వే శాఖ నిర్ణయించింది. భవిష్యత్‌లో రాజధాని రైళ్లను ఇవి భర్తీ చేయనున్నాయి.

# ఏ ఆధారాలు లేకుండా చంద్రబాబును ఎలా అరెస్టు చేస్తారు?: జడ శ్రావణ్



విజయవాడ: సీఎం జగన్ అరాచక ప్రభుత్వాన్ని ప్రశ్నించాలంటే రాజ్యాంగం అవసరమని జైభీమ్ పార్టీ వ్యవస్థాపకుడు జడ శ్రావణ్ కుమార్ అన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోకపోతే మనకు బతుకు లేదన్నారు. నాలుగేళ్ల నుంచి కొన్ని వేల మంది రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. విజయవాడలో ఏపీ ప్రొఫెషనల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా ధర్నాకు పిలుపునిస్తే ముందే అరెస్టు చేస్తున్నారని విమర్శించారు. వైకాపా ప్రభుత్వం ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తోందని విమర్శించారు. "ఏ ఆధారాలు లేకుండా మాజీ సీఎంను ఎలా అరెస్టు చేస్తారు? డబ్బులు వచ్చి ఉంటాయేమోనని అరెస్టు చేయడం దేశ చరిత్రలోనే తొలిసారి. ఒక రూపాయి కూడా చంద్రబాబు వద్ద గానీ, ఆయన అనుచరుల వద్దగానీ దొరక్కుండా ఎలా అరెస్టు చేస్తారు? 150 మంది ఎమ్మెల్యేలు ఉన్నారన్న అహంకారంతో ప్రవర్తిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మేధావులు స్పందించకపోతే ఎలా? అన్యాయం జరిగినప్పుడు స్పందించకూడదా? చంద్రబాబు లాంటి వారికే భద్రత లేనప్పుడు సామాన్యుల పరిస్థితి ఏంటి? లక్ష మంది జగన్‌లు వచ్చినా రాజ్యాంగంలో ఒక్క ఆర్టికల్‌లో ఒక్క పదాన్ని కూడా మార్చలేరు. మంగళ లేదా బుధవారాల్లో ఒక రోజు కార్యారణ ప్రకటిస్తున్నా. జగన్ చిత్రపటానికి లక్షమంది లక్ష రాజ్యాంగం పుస్తకాలను బహూకరించాలి. దానిని ఫొటో తీసి సోషల్ మీడియాలో పెట్టాలి." అని జడ శ్రావణ్ పిలుపునిచ్చారు.




తెలుగుదేశం అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ శ్రేణులు, తెలుగు మహిళలు నాలుగోరోజు దీక్షలు కొనసాగిస్తున్నారు. చంద్రబాబు సురక్షితంగా కడిగిన ముత్యంలా బయటకు రావాలని కోరుతూ పలుచోట్ల నాయకులు, కార్యకర్తలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

# నంద్యాలలో భారీ చోరీ.. రూ.1.3 కోట్ల సెల్‌ఫోన్ల మాయం



డోన్ : కర్నూల్ జిల్లా డోన్ జాతీయ రహదారిలోని ఓబులాపురం మిట్ట సమీపంలో దాదాపు రూ.1.3కోట్ల విలువైన సెల్‌ఫోన్ కంటైనర్‌ను ఇద్దరు డ్రైవర్లు చోరీ చేశారు. ఈ నెల 11న జరిగిన ఈ చోరీ తాజాగా వెలుగులోకి వచ్చింది. సెల్‌ఫోన్ల లోడుతో హరియాణా నుంచి బెంగళూరు వెళ్తున్న కంటైనర్‌ను రోడ్డు పక్కనే ఆపిన డ్రైవర్లు.. అందులోని సెల్‌ఫోన్లను మరొక వాహనంలోకి మార్చేసి.. కంటైనర్‌ను అక్కడే విడిచిపెట్టి పరారయ్యారు. నాగాలాండ్‌కు చెందిన కంటైనర్ యజమాని డోన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసుకున్న డోన్ పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. వారిని అదుపులోకి తీసుకునేందుకు హరియాణాకు ప్రత్యేక బృందాన్ని పంపారు.

# జైల్లో చంద్రబాబుని కలవనున్న సూపర్ స్టార్ రజినీకాంత్



తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్, ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇద్దరూ మంచి మిత్రులన్న సంగతి అందరికి తెలిసిందే. ఎన్నో సార్లు రజినీకాంత్ తన మిత్రుడు చంద్రబాబు గురించి మంచి మాటలు చెప్పారు, అలాగే ఆమధ్య ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో పాల్గొండటానికి వచ్చినప్పుడు కూడా చంద్రబాబుని ఎంతో ప్రశంసించారు రజినీకాంత్. కొన్ని రోజుల క్రితం చంద్రబాబుని అక్రమంగా అరెస్టు చేసి రాజమండ్రి జైల్లో పెట్టినప్పుడు కూడా అతను క్లీన్ గా బయటకి వస్తాడు అని చెప్పారు, చంద్రబాబు కుమారుడు నారా లోకేష్‌తో మాట్లాడి అతనికి ధైర్యం చెప్పారు. అయితే ఇప్పుడు తమిళ మీడియాలో ఒక వార్త వైరల్ అవుతోంది. రజినీకాంత్ త్వరలో రాజమండ్రి జైల్లో వున్న చంద్రబాబును కలుస్తారు అని. ఈ వార్త ఇప్పుడు బాగా వైరల్ అయింది. తనకి మంచి మిత్రుడు అయిన చంద్రబాబు జైల్లో ఉంటే, ధైర్యం చెప్పడానికి రజినీకాంత్ అతన్ని రాజమండ్రి జైల్లో కలవనున్నారు అని అంటున్నారు. అయితే ఈ వార్త ఇంకా ధ్రువీకరించలేదు కానీ, తమిళ మీడియా లో మాత్రం వైరల్ గా మారింది. చంద్రబాబు, రజినీకాంత్ ఇద్దరూ ఎప్పుడూ ఒకరితో ఒకరు టచ్ లో వుంటారు కూడా. ఆమధ్య విజయవాడ వచ్చి చంద్రబాబుని ప్రశంసించినప్పుడు, వైస్సార్‌సీపీ నాయకులు చాలామంది రజినీకాంత్ మీద నోరు పారేసుకున్నారు. కానీ రజినీకాంత్ అసలు వాళ్ళు అన్నమాటలని పట్టించుకోలేదు. 'జైలర్' Jailer ప్రీ రిలీజ్ వేడుకలో రజినీకాంత్ ఇలాంటి వాళ్ళని ఉద్దేశించి అన్న మాటలు వైరల్ అయిన సంగతి కూడా అందరికీ తెలిసిందే.

"ఈ లోకంలో మొరగని కుక్క ఉండదు, విమర్శించని నోరు ఉండదు, ఇవి రెండూ జరగని వూరు ఉండదు. మన పని మనము చేసుకుంటూ, ముందుకు పోవాలి. అర్థమైందా రాజా," అని అన్న డైలాగ్ ఎంతో వైరల్ అయింది. అందుకే రజిని తను అనుకున్న పని చెయ్యటంలో ముందుంటాడు, అప్పుడు ఎవరు ఎన్ని విమర్శించినా పట్టించుకోరు, అందుకే అతను సూపర్ స్టార్ అయ్యారు.




హైదరాబాద్: తెదేపా అధినేత చంద్రబాబుకు మద్దతుగా హైదరాబాద్‌లో ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని ఐటీ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. శనివారం ఐటీ ఉద్యోగుల ఆందోళన అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పైకి చేరింది. నానక్‌రామ్ గూడ టోల్‌గేట్ నుంచి విడతల వారీగా ఓఆర్ఆర్‌పై కారు ర్యాలీకి వారంతా సిద్ధమయ్యారు. ఇవాళ, రేపు సుమారు 10 వేల మందితో కార్ల ర్యాలీకి నిర్ణయం తీసుకున్నారు. అయితే, ఐటీ ఉద్యోగుల ర్యాలీకి పోలీసుల నుంచి అనుమతి లభించలేదు. ఈ క్రమంలో నానక్‌రామ్ గూడ వద్ద ఓఆర్ఆర్‌పై పోలీసుల భారీగా మోహరించారు. ఓఆర్ఆర్‌పైకి వచ్చే మార్గాల్లోనూ బందోబస్తు ఏర్పాటు చేశారు. టోల్‌గేట్ వద్ద కార్లను తనిఖీ చేసి పంపిస్తున్నారు. మరోవైపు, ఓఆర్ఆర్‌పై 200 నుంచి 300 కార్లతో ఐటీ ఉద్యోగులు ర్యాలీని కొనసాగిస్తున్నారు. వ్యక్తిగత కార్లలో కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన వీరు.. చంద్రబాబు మద్దతుగా ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ క్రమంలో హైదరాబాద్–ముంబయి మార్గంలోని మూడో నంబర్ ఎగ్జిట్ వద్ద ర్యాలీకి అంతరాయం ఏర్పడింది. కొన్ని కార్లను ఎగ్జిట్ 3 నుంచి పోలీసులు బయటకు పంపిస్తున్నారు. దీంతో శాంతియుతంగా చేస్తున్న ర్యాలీని ఎందుకు అడ్డుకుంటున్నారని పోలీసులతో ఐటీ ఉద్యోగులు వాగ్వాదానికి దిగారు.

చంద్రబాబుకు అండగా నిలవాలనే కార్ల ర్యాలీకి పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ తీరును ఐటీ ఉద్యోగులు ఎండగట్టారు. తమ జీవితాలకు దారి చూపిన వ్యక్తిని అరెస్టు చేయడం సరికాదన్నారు. జనంలో ఉండాల్సిన దార్శనిక నేతను జైలు ఉంచి వేధించడం సరికాదని మండిపడ్డారు.

# న్యాయవాది సుధాకర్‌రెడ్డిపై విరుచుకుపడ్డ ఆనం రామనారాయణ రెడ్డి



నెల్లూరు: న్యాయ వ్యవస్థ, పోలీస్ వ్యవస్థలు సక్రమంగా పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమని వేంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. అడ్వకెట్ జనరల్ చట్టాలు, న్యాయ శాస్త్రాలకు విలువిచ్చే మనిషి కాదన్నారు. జగన్మోహన్ రెడ్డి ద్వారా పునర్జన్మ పొందాను అని సుధాకర్ రెడ్డి చెప్పడం హాస్యాస్పదమన్నారు. సుధాకర్ రెడ్డి ప్రభుత్వ న్యాయవాదిగా తన వ్యక్తిత్వాన్ని దిగజార్చుకుంటున్నారని విమర్శించారు. అదనపు అడ్వకెట్ జనరల్ అయినా.. తన సేవలు జగన్మోహన్ రెడ్డికే అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం దగ్గర వసతులు, జీతబత్యాలు పొందుతూ జగన్మోహన్ రెడ్డి సేవకుడిని అని చెప్పడం హేయమన్నారు. చంద్రబాబు అరెస్ట్, రిమాండ్ తరువాత ఎనిమిది మందికి వ్యక్తిగత సెక్యూరిటీ పెంచుకున్నారని తెలిపారు. సుధాకర్ అదనపు అడ్వకెట్ జనరల్ జనరల్ కంటే.. వైసిపీ కార్యకర్త అని చెప్పుకోవచ్చని వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి వ్యక్తుల వలన న్యాయం చట్టం మీద నమ్మకం సన్నగిళ్ళుతుందని ఆయన అన్నారు. ఇది రాబోయే రోజుల్లో చాలా ప్రమాదకరమన్నారు. ఇలాంటి ప్రకటన చేసిన ఏ.ఏ.జె సుధాకర్‌పై అత్యున్నత న్యాయమూర్తులు, బార్ కౌన్సిల్ రెస్పాండ్ కావాలని కోరారు. ఇలాంటి వారున్న ఈ సమయంలో మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత భద్రతపై అనుమానం రాక మానదన్నారు. ఒక వ్యక్తికి సేవ చేసుకుంటాను అనే వ్యక్తి ప్రజలకు ఎలా సేవ చేయగలరని ప్రశ్నించారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో చంద్రబాబుకు భద్రత లేదన్నారు. జైళ్ల శాఖ అధికారి ప్రభుత్వంలో మంత్రికి దగ్గర వ్యక్తి కావడం చంద్రబాబు భద్రతపై మరింత అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ప్రతిపక్ష నేత అరెస్ట్, రిమాండ్‌పై ముఖ్యమంత్రి ఇప్పటికి నోరు మెదపకపోవడం దారుణమని మండిపడ్డారు. చంద్రబాబు విడుదలపై విప్లవం జరుగుతున్నా.. ఈ ప్రభుత్వంలో చలనం లేదని ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి విమర్శలు గుప్పించారు.

## ఫోటో స్టోరి: బుల్లితెర నటి మతిచెడే హొయలు

ఏక్ హజారోన్ మే మేరీ బెహనా హై - జమై రాజా వంటి రోజువారీ టీవీ సీరియళ్లతో గొప్ప పేరు తెచ్చుకున్న బ్యూటీ నియా శర్మ. భారతీయ టెలివిజన్ పరిశ్రమలో 13 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఈ నటి 2010లో పరిశ్రమలోకి అడుగుపెట్టింది. 2011లో బ్రేక్ రావడానికి ముందు సహాయక పాత్రల్లో నటించింది. సంవత్సరాలుగా కొన్ని ముఖ్య పాత్రల్లో అద్భుత ప్రదర్శనలతో అలరించింది. టీవీ రంగంలో అత్యంత పాపులర్ ఫేస్ గా గుర్తింపు పొందింది. ఇటీవలి సెలబ్రేషన్ కోసం పరిశ్రమలో నియా విజయవంతమైన ప్రయాణానికి గుర్తుగా తన స్నేహితులు ప్రేమను కురిపించడమే గాక భారీ పుష్పగుచ్ఛాలు, రుచికరమైన కేకులను పంపారు. దీనికి ఎంతో ఎమోషనల్ అయిన నియాశర్మ తన కెరీర్ జర్నీపై ఒక సుదీర్ఘ లేఖను కూడా రాసింది. టెలివిజన్ ప్రపంచంలో 13 క్రేజీ అద్భుతమైన సంవత్సరాలు పూర్తి చేసాను. ప్రతి చిన్న పెద్ద సందర్భంలోనూ ఈ కేక్‌లు పువ్వులు ప్రవహించడం ప్రారంభించే



వరకు నిజంగా ఇవేవీ గుర్తుకు రాలేదు లేదా ఎన్ని సంవత్సరాలు అనేది కూడా లెక్కించలేదు.. అంటూ ఎమోషనల్ అయింది.

ఇలాంటి ఒక మైలురాయిని సాధించినందుకు ఫ్యాన్స్ నియా శర్మను అభినం దించారు. నియా శర్మ 2010లో స్టార్ ప్లస్‌లో కాళి – ఏక్ అగ్నిపరీక్షతో టెలివిజన్ రంగంలోకి అడుగుపెట్టింది. తర్వాత ఆమె బెహెనేన్ షోలో నటించింది. స్టార్ ప్లస్ – ఏక్ హజారోన్ మే మేరీ బెహనా హైలో క్రిస్టల్ డిసౌజా, కరణ్ థాకర్ – కుశాల్ టాండన్‌ల సరసన మాన్వి చౌదరి పాత్ర కోసం సైన్ చేయగా, దాంతో మొదటి బ్రేక్ అందుకుంది. క్రమంగా రవి దూబే సరసన Zee TV జమై రాజాలో శక్తివంతమైన పాత్రను దక్కించుకుంది. రోజువారీ సీరియళ్లతో పాటు, ఝలక్ దిఖలాజా – ఖత్రోన్ కే ఖిలాడి వంటి రియాలిటీ షోలలో కూడా పాల్గొంది.

**సోషల్ మీడియా సంచలనం:** నియాశర్మ ఏజ్ లెస్ బ్యూటీగా చెలరేగిపోతోంది. ఈ భామ నిరంతరం వరుస ఫోటోషూట్లతో అగ్గి రాజేస్తోంది. బికినీ బీచ్ సెలబ్రేషన్స్, చిట్టి పొట్టి నిక్కర్లలో నియా హాటెస్ట్ ఎలివేషన్ ప్రతిసారీ యువతరంలో హాట్ టాపిక్ గా మారుతోంది. నియా తాజా ఇన్ స్టా పోస్ట్ అంతర్జాలాన్ని షేక్ చేస్తోంది. నియా రోజ్ కలర్ ఫ్రాకులో ఎంతో అందంగా కనిపించిన ఈ ఫోటోగ్రాఫ్ ఇప్పుడు ట్రెండింగ్ లో ఉంది. ఇక ఇదే ఫోటోషూట్ లో తనముందు ఉన్న కీబోర్డ్ ని ప్లే చేసేందుకు సిద్ధమవుతున్న ఫోటోగ్రాఫ్ కూడా సంథింగ్ స్పెషల్ గా ఆకట్టుకుంటోంది. టీవీ సుందరి మతిచెడే హొయలు కిరాక్! అంటూ ఫోటోషూట్ పై ఫ్యాన్స్ ఘాటుగా స్పందిస్తున్నారు.

## మత్తు కళ్లతో రింగ్‌లోకి లాగుతున్న శర్మా గాళ్

ఫిట్‌నెస్ లేదా ఫ్యాషన్ పరంగా శర్మా సిస్టర్స్ జోష్ గురించి తెలిసిందే. షైనింగ్ విత్ శర్మా సిస్టర్స్ షోతోను శర్మా సిస్టర్స్ పాపులరయ్యారు. ఇక నేహాశర్మతో పోటీపడుతూ తన సోదరి ఐషా శర్మ నిరంతరం ఫ్యాషన్ గోల్స్ పరంగా స్ఫూర్తిని నింపుతోంది. తాజాగా ఐషా షేర్ చేసిన మరో హాట్ సెల్ఫీ అంతర్జాలంలో వైరల్ గా మారింది. బ్రౌన్ ఫ్రాకులో మత్తు కళ్లతో ఐషా టూ హాట్ గా కనిపిస్తోంది. ఐషా అందం హాట్ నెస్ నిరంతరం యువతరంలో హాట్ టాపిక్. ఈ భామ చిరునవ్వు ఎంతో ఆకర్షణ. ఐషా శర్మ ఆరోగ్యకరమైన జీవనశైలి నేటియూత్ కి స్ఫూర్తి. ఫిట్‌నెస్, స్కిన్‌కేర్ విషయంలో నేహా ఎల్లపుడూ ఎంతో శ్రద్ధతో ఆకట్టుకుంటుంది. అభిమానులు ఆమె లుక్స్‌పై స్మోకింగ్



హాట్ అంటూ కామెంట్లు చేయడం చాలా సాధారణం. సోషల్ మీడియాల్లో ఐషా శర్మ నిరంతరం తన అనుచరులకు స్ఫూర్తి నింపే వెల్‌నెస్ చిట్కాలను వివరిస్తుంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. 2018లో 'సత్యమేవ జయతే' చిత్రంలో జాన్ అబ్రహం, మనోజ్ బాజ్‌పేయ్‌లతో కలిసి ఐషా శర్మ తన నటనా కెరీర్ ని ప్రారంభించింది. ఆ తర్వాత చాలా మ్యూజిక్ వీడియోలలో కూడా నటించింది. వీటికి అద్భుతమైన ప్రజాదరణ దక్కింది. ఐషా సోదరి క్రూక్, తుమ్ బిన్, యమ్లా పగ్లా దీవానా 2, యంగిస్తాన్, క్యా సూపర్ కూల్ హై హమ్ మరియు తానాజీ వంటి చిత్రాలలో నేహా కనిపించింది. ఆమె చివరిగా జోగిర సారా రా చిత్రంలో నవాజుద్దీన్ సిద్ధిఖీ, సంజయ్ మిశ్రా మరియు మహాఅక్షయ్ చక్రవర్తితో కలిసి కనిపించింది.




## వినాయకచవితి టూ దసరా.. సినిమాల జాతర!




చిత్ర పరిశ్రమలో ప్రతి ఏడాది వందలాది సినిమాలు ప్రేక్షకుల ముందుకి వస్తూ ఉంటాయి. వీటిలో మెజారిటీ సినిమాలు మెప్పించలేక చతికిలబడతాయి. అయితే కొన్ని చిన్న సినిమాలు కూడా మౌత్ టాక్ తో అద్భుతమైన రెస్పాన్స్ ని సొంతం చేసుకోవడంతో పాటు బ్లాక్ బస్టర్ కలెక్షన్స్ ని రాబడతాయి. ఈ ఏడాదిలో చూసుకుంటే చిన్న సినిమాలైన బలగం, బేబీ, సామజవరగమన సినిమాలు సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకొని కలెక్షన్స్ సునామీ సృష్టించాయి. భారీ బడ్జెట్ తో తెరకెక్కిన సినిమాలు ఆశించిన స్థాయిలో ప్రేక్షకులని మెప్పించలేకపోయాయి. ఏజెంట్, భోళా శంకర్, శాకుంతలం లాంటి సినిమాల రిసల్ట్ ఏంటనేది అందరికి తెలిసిందే. దీనిని బట్టి ప్రేక్షకాదరణ పొందడానికి సినిమా బడ్జెట్ తో సంబంధం లేదు. కథ నచ్చితే నెత్తిన పెట్టుకుంటారని ఈ ఫలితాలే నిరూపిస్తున్నాయి. అలాగే వినాయకచవితి సీజన్ మొదలుకొని దసరా వరకు ఒకే డేట్ లో మూడు కంటే ఎక్కువ సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. సెప్టెంబర్ 15న ఏకంగా నాలుగు సినిమాలు ప్రేక్షకుల ముందుకి వస్తున్నాయి. విశాల్ హీరోగా తెరకెక్కిన మార్క్ ఆంటోనీ పాన్ ఇండియా మూవీగా థియేటర్స్ లోకి వస్తోంది. రవితేజ నిర్మించిన ఛాంగురే బంగారు రాజా మూవీ కూడా ప్రేక్షకాదరణ కోసం అదృష్టం పరీక్షించుకుంటుంది. వీటితో పాటుగా రామన్న యూత్, సోదర సోదరీమణులారా అనే రెండు చిన్న సినిమాలు కూడా రిలీజ్ అవుతున్నాయి. సెప్టెంబర్ 28న రామ్ పోతినేని, బోయపాటి కాంబోలో తెరకెక్కుతోన్న స్కంద థియేటర్ లోకి వస్తోంది. అలాగే లారెన్స్ హీరోగా తెరకెక్కిన డబ్బింగ్ మూవీ చంద్రముఖి 2 కూడా రిలీజ్ కి సిద్ధమైంది. కంగనా రనౌత్ ఈ చిత్రంలో టైటిల్ రోల్ పోషిస్తుంది. శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో తెరకెక్కిన పెద కాపు 1 సెప్టెంబర్ 29న రిలీజ్ కాబోతోంది. ఈ చిత్రంపై అంచనాలు భారీగానే ఉన్నాయి. అక్టోబర్ 6న కిరణ్ సబ్బవరం రూల్స్ రంజాన్ మూవీ రిలీజ్ కాబోతోంది. అలాగే స్వాతి, నవీన్ చంద్ర కాంబోలో తెరకెక్కిన మంత్ ఆఫ్ మందు మూవీ కూడా అక్టోబర్ 6న ప్రేక్షకుల ముందుకి రాబోతోంది. వీటి తర్వాత దసరా కానుకగా అక్టోబర్ 19న బాలకృష్ణ భగవంత్ కేసరి మూవీ థియేటర్స్ లోకి రాబోతోంది. అదే రోజు ఇళయదళపతి విజయ్ లియో మూవీ పాన్ ఇండియా లెవల్ లో రిలీజ్ కానుంది.

శివరాజ్ కుమార్ హీరోగా తెరకెక్కుతోన్న ఘోస్ట్ మూవీ కూడా పాన్ ఇండియా లెవల్ లో రిలీజ్ అవ్వనుంది. మాస్ మహారాజ్ రవితేజ చేస్తోన్న బయోపిక్ మూవీ టైగర్ నాగేశ్వరరావు అక్టోబర్ 20న పాన్ ఇండియా లెవల్ లో రిలీజ్ కి సిద్ధమవుతోంది.

## మౌనం వీడిన సలార్ టీమ్.. ఇదిగో బ్యాడ్ న్యూస్!




ఫ్యాన్ ఇండియా స్టార్ ప్రభాస్ బ్యాడ్ లక్ ఏమిటో గాని మొదట్లో పాజిటివ్ అంచనాలు పెంచుకుంటున్న ప్రతి సినిమా కూడా చివరికి వచ్చేసరికి ఏదో ఒక కారణం చేత మళ్లీ నెగటివ్ వైబ్రేషన్స్ ను క్రియేట్ చేసుకుంటుంది. మొదటినుంచి కూడా సలార్ సినిమాపై మాస్ ఫ్యాన్స్ లో అయితే మామూలు అంచనాలు లేవు. కేజిఎఫ్ దర్శకుడు ప్రశాంత్ నీల్ ఈ సినిమాను అంచనాలకు మించి తెరపైకి తీసుకువస్తాడు అని తప్పకుండా అతను బాహుబలి స్థాయిలో ప్రభాస్ కు హిట్ అయితే ఇస్తాడు అని రెబల్ స్టార్ ఫ్యాన్స్ ఎంతో నమ్మకం పెట్టుకున్నారు. అయితే ఈ సినిమా విడుదల విషయంలోనే ఇంకా సస్పెన్స్ క్రియేట్ చేస్తోంది. సినిమాను సెప్టెంబర్ 28వ తేదీన గ్రాండ్ గా విడుదల చేస్తామని గత ఏడాది నుంచి చెప్పుకుంటూ వస్తున్న చిత్ర యూనిట్ సభ్యులు మొత్తానికి సినిమాను అయితే వాయిదా వేసేశారు. ఈపాటికి సినిమా ప్రమోషన్స్ తో హడావిడి చేస్తారు అనుకుంటే ఊహించని విధంగా ట్విస్ట్ అయితే ఇచ్చారు. గత వారం రోజులుగా ఈ సినిమా వాయిదా పడుతుంది అని సిజి వర్క్ ఆలస్యం అవుతుంది అని అలాగే ఓటీటీ బిజినెస్ డీల్ క్లోజ్ కాలేదు అని ఇలా చాలా రకాల కారణాలు వైరల్ అయ్యాయి. అయితే వార్తలు ఎన్ని వస్తున్నా కూడా నిన్నటి వరకు మౌనంగానే ఉన్న నిర్మాణ సంస్థ హొంబెల్ ప్రొడక్షన్స్ మొత్తానికి మౌనం వీడింది. ఈ విధంగా అయితే వివరణ ఇచ్చారు. 'సలార్ కోసం మీ అచంచలమైన మద్దతును మేము అభినందిస్తున్నాము. అయితే ఊహించలేని పరిస్థితుల కారణంగా సెప్టెంబర్ 28 విడుదల చేయాలనుకున్న సలార్ ని వాయిదా వేయాల్సి వస్తోంది. మంచి సినిమా అనుభవాన్ని అందించడానికి మేము కట్టుబడి ఉన్నాము. కాబట్టి, ఈ నిర్ణయం జాగ్రత్తగా తీసుకోబడిందని దయచేసి అర్థం చేసుకోండి. మా టీమ్ అత్యున్నత ప్రమాణాలను అందుకోవడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తోంది. కొత్త విడుదల తేదీ నిర్ణీత సమయంలో వెల్లడి చేయబడుతుంది. సలార్ తుది మెరుగులు దిద్దుతున్నప్పుడు మీ సపోర్ట్ అవసరం. ఈ అద్భుతమైన ప్రయాణంలో భాగమైనందుకు ధన్యవాదాలు.. అంటూ నిర్మాణ సంస్థ వివరణ ఇచ్చింది. అయితే మళ్లీ ఎప్పుడు ఈ సినిమా ఉంటుంది అనే విషయంలో మాత్రం సరైన క్లారిటీ ఇవ్వలేదు. ఇండస్ట్రీలో వినిపిస్తున్న టాక్ ప్రకారం అయితే సినిమా ఈ ఏడాది నవంబర్ లేదా డిసెంబర్లో రావచ్చు అని తెలుస్తోంది.

## శ్రద్ధాదాస్ హై గ్లామర్ డోస్.. కనువిందుగా..

టాలీవుడ్ లో సీనియర్ హీరోయిన్ గా సుదీర్ఘకాలంగా కొనసాగుతోన్న అందాల భామ శ్రద్ధా దాస్. సిద్దు ఫ్రం శ్రీకాకుళం సినిమా ద్వారా టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ బ్యూటీ మొదటి సినిమాలోనే బికినీ ట్రీట్ తో కుర్రకారుకి తన అందంతో గాలం వేసింది. ఈ గ్లామర్ బ్యూటీగా మంచి గుర్తింపు తెచ్చుకున్న శ్రద్ధా దాస్ కమర్షియల్ హీరోయిన్ గా మాత్రం ఆశించిన స్థాయిలో గుర్తింపు సొంతం చేసుకోలేదు. తెలుగులోనే కాకుండా తమిళ్, కన్నడ, మలయాళీ, హిందీ భాషలలో కూడా శ్రద్ధా దాస్ హీరోయిన్, ఇతర కీలక పాత్రలలో నటించింది. అయితే ఏ ఇండస్ట్రీలో కూడా ఆమెకి హీరోయిన్ గా చెప్పుకోదగ్గ ఇమేజ్ రాలేదు. కేవలం గ్లామర్ క్వీన్ గానే ఫేమ్ తెచ్చుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చి 13 ఏళ్ళు అవుతున్న



ఇప్పటికి వన్నె తగ్గని అందంతో శ్రద్ధాదాస్ ప్రేక్షకులని అలరించే ప్రయత్నం చేస్తోంది. ప్రస్తుతం తెలుగులో ఈ బ్యూటీ నిరీక్షణ, అర్ధం సినిమాలలో నటించింది. ఈ సినిమాలు రిలీజ్ కి సిద్ధం అవుతున్నాయి. మరో వైపు ఓటీటీలోకి అడుగుపెట్టేందుకు సిద్ధం అవుతోంది. రియాలిటీషోలలో కూడా సందడి చేస్తోంది. ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో కూడా శ్రద్ధా దాస్ స్పీడ్ పెంచింది. రెగ్యులర్ గా ఇన్ స్టాగ్రామ్ లో అందాల ప్రదర్శన కోసం హాట్ ఫోటోషూట్ లతో సందడి చేస్తోంది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ మధ్యకాలంలో బ్యూటీస్ కి ఇన్ స్టాగ్రామ్ తమని తాము షోకేస్ చేసుకోవడానికి ఒక వేదికగా మారింది. శ్రద్ధా దాస్ దీనిని కరెక్ట్ గా ఉపయోగించుకుంటుంది. ఎలాంటి హద్దులు లేకుండా తనలోని గ్లామర్ స్పాట్స్ ని అందంగా చూపిస్తూ ఫాలోవర్స్ ని ఎంటర్టైన్ చేస్తోంది. తాజాగా మరోసారి ఈ బ్యూటీ అదిరిపోయే స్టిల్స్ ని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేశారు. వైట్ కలర్ స్లీవ్ లెస్ స్కర్ట్ తో సోఫాపై స్టైలిష్ గా పడుకొని చూపులతో వలపుల బాణాలు విసురుతోంది. కవ్వించే విధంగాఫోజులు ఇస్తూ కుర్రాళ్ళకి కునుకు లేకుండా చేస్తోంది. ఈ ఫోటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

## నయన్ ఇటు మాత్రం రావట్లే..

సౌత్ ఇండియాలో స్టార్ హీరోయిన్ గా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ సొంతం చేసుకున్న అందాల భామ నయనతార. ఈ అమ్మడు ప్రస్తుతం కోలీవుడ్ లో లేడీ సూపర్ స్టార్ బ్రాండ్ తో దూసుకుపోతోంది. అత్యధిక రెమ్యునరేషన్ తీసుకుంటున్న సౌత్ హీరోయిన్ గా కూడా నయనతార ఉంది. ఆమెకి ఇంత స్టార్ ఇమేజ్ రావడానికి కారణం తెలుగు సినిమా అని చెప్పాలి. టాలీవుడ్ లో స్టార్ హీరోలందరితో నయనతార ఆడిపాడింది. అవి సక్సెస్ కావడంతో నయనతార కూడా నెంబర్ వన్ హీరోయిన్ గా మారింది. తరువాత కోలీవుడ్ లోకి అడుగుపెట్టి అక్కడ కూడా వరుస విజయాలు అందుకుంది. సోలోగా లేడీ ఒరియాంటెడ్ కథలతో సక్సెస్ లు అందుకుంది. అయితే కోలీవుడ్ లో ఆమెని ఫ్యాన్స్ చాలా ప్రత్యేకంగా చూస్తారు. రీసెంట్ గా జవాన్ మూవీ బ్లాక్ బస్టర్ కావడంతో నయనతార ఇమేజ్ కూడా అమాంతం పెరిగిపోయింది. ప్రస్తుతం జయం రవితో చేసిన ఇరైవన్ మూవీ రిలీజ్ కి రెడీగా ఉంది. అయితే



నయనతారని టాలీవుడ్ లో ఒక సినిమా కోసం బడా నిర్మాత సంప్రదించారంట. రెమ్యునరేషన్ కూడా గట్టిగానే ఆఫర్ చేసారంట. కానీ ఆమె మాత్రం చేయడానికి ఆసక్తి చూపించలేదనే టాక్ వినిపిస్తోంది. కనీసం కథ కూడా వినడానికి మొగ్గు చూపించలేదంట. ప్రస్తుతం ఇదే న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎందుకనో తెలుగు సినిమాలు చూడటానికి నయనతారకి ఎలాంటి ఆసక్తి లేదనే ప్రచారం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తెలుగు చిత్రాల ద్వారానే స్టార్ హీరోయిన్ గా ఎదిగి ఇప్పుడు టాలీవుడ్ ని చిన్న చూపు చూస్తోందని కొంత మంది నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఆమె చివరిగా తెలుగులో సైరా నరసింహారెడ్డి చిత్రంలో కనిపించారు. ఆ మూవీలో మంచి ప్రాధాన్యత ఉన్న పాత్రనే చేసింది. అయితే వరుస కమిట్మెంట్ లు ఉండటంతోనే ఆమె ప్రాజెక్ట్ చేయడం లేదనే మరో టాక్ కూడా వినిపిస్తోంది. కేవలం డేట్స్ అడ్జస్ట్ చేయలేకపోవడం వలన రెమ్యునరేషన్ ఎక్కువగా ఇచ్చిన కూడా ఆసక్తి చూపించలేదని కోలీవుడ్ సర్కిల్ లో వినిపిస్తోన్న మాట. ప్రస్తుతం నయనతార ఓ వైపు తల్లిగా ఇద్దరు పిల్లల బాధ్యత చూసుకుంటూ మరో వైపు సినిమాలు చేస్తూ ఉండాలి. ఇది కొద్దిగా కష్టంగా కూడుకున్నది. అందుకే ఎక్కువ సినిమాలు చేయడం లేదని టాక్.






కేసీఆర్‌ను గద్దెదించేందుకు ఇతర పార్టీల్లో ఉన్న తెలంగాణ ఉద్యమకారులంతా కాంగ్రెస్ లోకి రావాలని ఆ పార్టీ సీనియర్ నేత, నల్గొండ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. ఇటీవల భాజపాను బహిష్కరణకు గురైన జిట్టా బాలకృష్ణారెడ్డి.. వెంకట్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఉద్యమకారుడైన బాలకృష్ణారెడ్డి గౌరవం తగ్గకుండా పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. నాడు ఎన్నో త్యాగాలు చేసిన ఉద్యమకారులను కేసీఆర్ బయటికి పంపి, తెలంగాణ ద్రోహులను చేరదీశారని కోమటిరెడ్డి ఆరోపించారు.

# తెలంగాణలో మరో అపూర్వ ఘట్టం ఆవిష్కృతం..

## పాలమూరు ఎత్తిపోతలను ప్రారంభించిన సీఎం కేసీఆర్

కొల్లాపూర్ : రాష్ట్ర ఇంజినీరింగ్ చరిత్రలోనే మరో అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైంది. దశాబ్దాలుగా సాగునీటి కోసం కలలుగంటున్న పాలమూరు ఉమ్మడి జిల్లా ప్రజల చిరకాల వాంఛను ముఖ్యమంత్రి కేసీఆర్ సాకారం చేశారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం నార్లాపూర్ వద్ద పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. సీఎం కేసీఆర్ నార్లాపూర్ పంప్‌హౌస్ వద్ద 145 మెగావాట్ల సామర్థ్యమున్న మోటర్లను ఆన్ చేసి, జలాల ఎత్తిపోతలను ప్రారంభించారు. అనంతరం అంజనగిరి రిజర్వాయర్‌లోకి చేరిన కృష్ణమ్మ జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జలహారతి పట్టారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మల్లారెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డితో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ అంజనీ కుమార్, స్మితా సబర్వాల్‌తో పాటు ఇరిగేషన్ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు రంగారెడ్డి జిల్లాలోని 12.30 లక్షల ఎకరాలకు సాగు, తాగునీటిని అందించాలనే లక్ష్యంతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాని (పీఆర్ఎల్ఐఎస్)కి రూ.35 వేల కోట్ల అంచనా వ్యయంతో 2015లో తెలంగాణ సర్కారు శ్రీకారం చుట్టింది. మొదటి దశలో తాగునీరు, రెండో దశలో సాగునీటికి సంబంధించిన పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకొన్నది.

అందులో భాగంగా ఇప్పటికే మొదటి దశలో చేపట్టిన తాగునీటి సరఫరాకు సంబంధించిన పనులను నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి మొత్తంగా 21 ప్యాకేజీలుగా విభజించగా.. కేపీ లక్ష్మీదేవిపల్లి మినహా ప్రస్తుతం 18 ప్యాకేజీల పనులను మాత్రమే ప్రభుత్వం చేపట్టింది. ప్రస్తుతం ఆయా ప్యాకేజీల పనులన్నీ దాదాపు తుదిదశకు చేరుకొన్నాయి. ఇక ప్రాజెక్టు ద్వారా నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, కొడంగల్, నారాయణపేట, మక్తల్, దేవరకద్ర, జడ్చర్ల, కల్వకుర్తి, అచ్చంపేట, పరిగి, వికారాబాద్, తాండూర్, చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్, దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లోని 70 మండలాల్లో 1,226 గ్రామాలకు తాగు, సాగునీరు అందనున్నది. ప్రాజెక్టు నీళ్లతో 1,546 నీటికుంటలు, చెరువులను నింపనున్నారు.

# 8 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు పరిపాలనా అనుమతులు మంజూరు..

హైదరాబాద్ : ఒకేసారి 9 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను సీఎం కేసీఆర్ వర్చువల్ విధానంలో ప్రారంభించి దేశ వైద్య రంగంలోనే సరికొత్త రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటులో భాగంగా చివరి దశ 8 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ శనివారం ఉత్వర్వులు జారీ చేసింది. 8 కాలేజీల నిర్మాణానికి ప్రభుత్వం మొత్తం రూ. 1,447 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ నిధులతో ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా కాలేజీలు, ల్యాబ్స్, సెమినార్ హాల్స్, అనుబంధ ఆసుపత్రి భవనాలు, హాస్టల్ భవనాల నిర్మాణం, ఇతర వసతులను కల్పించనున్నారు. గద్వాల్, నర్సంపేట్ (వరంగల్), యాదాద్రిలో నిర్మించే కాలేజీలకు రూ. 183 కోట్ల చొప్పున, కుత్బుల్లాపూర్ (మేడ్చల్ మల్కాజ్‌గిరి)కు రూ.182 కోట్లు, నారాయణ్ పేట్, ములుగు, మెదక్‌లో నిర్మించే కాలేజీలకు రూ. 180 కోట్ల చొప్పున, మహేశ్వరం మెడికల్ కాలేజీకి రూ.176 కోట్లు కేటాయించింది. కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణాలకు సంబంధించి ఆరోగ్య శాఖ, ఆర్ అండ్ బీ అధికారులు అధ్యయనం చేసి కాలేజీల నిర్మాణానికి రూ. 1447 కోట్ల అంచనా ప్రతిపాదనలు సమర్పించారు. వీటికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2014 వరకు తెలంగాణలో 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండగా, జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ సంకల్పించారు. ఇందులో భాగంగా శుక్రవారం 9 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను సీఎం కేసీఆర్ ప్రారంభించారు. దీంతో రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య 26కు చేరింది. వచ్చే ఏడాదికి గాను మరో 8 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసింది. దీంతో ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య 34కు చేరుకుంది.

**8 మెడికల్ కాలేజీల పనులు వేగంగా పూర్తి : మంత్రి హరీశ్ రావు**

8 కాలేజీల నిర్మాణానికి రూ. 1,447 కోట్లు నిధులు కేటాయించినందుకు సీఎం కేసీఆర్‌కు వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఉమ్మడి పాలనలో జిల్లాకొక డిగ్రీ కాలేజీలు కూడా లేని పరిస్థితి. వైద్యం, వైద్య విద్య అందని ద్రాక్షగా మారిన రోజులు. ఇక అదంతా గతం. సీఎం కేసీఆర్ దార్శనిక పాలనలో జిల్లాకో మెడికల్ కాలేజీ మంజూరు చేసుకున్నాం. ఏటా 10వేల మంది వైద్యులను తయారు చేసే స్థాయికి చేరుకున్నాం. వచ్చే ఏడాదిలో ప్రారంభించే 8 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి, ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. తెలంగాణ ప్రజలకు వైద్యం, వైద్య విద్య కష్టాలను దూరం చేసిన ఘనత కేసీఆర్ గారికే దక్కుతుంది. బీఆర్ఎస్ సర్కార్ పాలనలో తెలంగాణ మెడికల్ హబ్ గా అవతరించింది అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న తుమ్మల

## ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో మారుతున్న రాజకీయ సమీకరణాలు





ఖమ్మం: గత కొంతకాలంగా బీఆర్ఎస్‌కు దూరంగా ఉంటున్న మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేడు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈరోజు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సమక్షంలో తుమ్మల కాంగ్రెస్‌లో చేరారు. తుమ్మలకు పార్టీ కండువా కప్పి ఖర్గే పార్టీలోకి సాదర స్వాగతం పలికారు. తుమ్మల చేరిక కార్యక్రమంలో కర్ణాటక సీఎం సిద్దరామయ్య....కేసీ వేణుగోపాల్ రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు. అయితే తుమ్మల కాంగ్రెస్ చేరడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారుతున్నాయి. తమ్మలతో పాటే ఆయన అనుచరులు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కీలక నేతలు కూడా కొద్దిరోజుల్లోనే కాంగ్రెస్ కండువా కప్పుకునే అవకాశాలు ఉన్నాయి. తుమ్మలకు ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం టికెట్ ఇచ్చే అవకాశాలున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. తుమ్మల నాగేశ్వరరావు గతంలో ప్రాతినిధ్యం వహించిన పాలేరు టికెట్ కోసం పొంగులేటి ఇప్పటికే దరఖాస్తు చేశారు. ఈ రెండు స్థానాల విషయంలో వీరిద్దరి మధ్య సర్దుబాటు చేసేందుకు పార్టీ ప్రయత్నిస్తోంది. ఆయన చేరికతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ బలం పెరిగే అవకాశం ఉంది. తుమ్మలకు ఖమ్మం జిల్లా అభివృద్ధిలో మంచి పేరుంది. రాజకీయ చదరంగంలో తుమ్మలకు ఉన్న అనుభవం కూడా కాంగ్రెస్‌కు కలిసి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాలను చక్రం తిప్పడంలో తుమ్మల సిద్ధహస్తులు. తుమ్మల నాగేశ్వరరావుకు బలమైన క్యాడర్ కూడా ఉంది. మూడున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో టీడీపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల్లో మంత్రి పదవులు నిర్వహించిన తుమ్మల.. అభివృద్ధి పనులపైనే ప్రధానంగా దృష్టి పెట్టి జిల్లాపై తనదైన ముద్ర వేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో తుమ్మల నాగేశ్వరరావు ప్రభావంతో కాంగ్రెస్‌కు మరిన్నీ సీట్లు పెరగవచ్చని కాంగ్రెస్ అధిష్ఠానం అంచనా వేస్తోంది. రాబోయే ఎన్నికల్లో తెలంగాణంలోని కమ్మ సామాజిక వర్గ ఓట్లను కూడా తుమ్మల ప్రభావితం చేసే అవకాశాలు ఉండడంతో బీఆర్ఎస్ పార్టీ ఆ సామాజిక వర్గంలోని ఓట్లను కోల్పోయే ప్రమాదముంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటికే పొంగులేటి రూపంలో బీఆర్ఎస్‌కు గట్టి దెబ్బ తగులుతుండగా.. ఇప్పుడు తుమ్మల కూడా కాంగ్రెస్‌లోకి వెళ్లడంతో బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బలహీన పడవచ్చని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఈసారి కూడా గతంలో లాగానే కాంగ్రెస్‌కు ఖమ్మం కంచుకోటగా నిలిచే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

# హైదరాబాద్ అభివృద్ధికి బహుముఖ వ్యూహంతో పని చేస్తున్నాం : మంత్రి కేటీఆర్



హైదరాబాద్ : టీ హబ్‌లో మహారాష్ట్ర క్రెడాయి ప్రతినిధుల బృందంతో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సమావేశమయ్యారు. హైదరాబాద్ ప్రగతిపై కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గత పదేండ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. తెలంగాణ ఏర్పడినప్పుడు ఉన్న విద్యుత్, తాగునీటి వంటి సంక్షోభాలను విజయవంతంగా అధిగమించామని తెలిపారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి బహుముఖ వ్యూహంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. హైదరాబాద్ నగరంలో పెట్టుబడులు ఆకర్షించేలా మౌలిక వసతుల కల్పన చేపట్టాం. ఇవాళ అనేక ఐటీ కంపెనీలు హైదరాబాద్‌లో కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నాయి. ఐటీ ఉద్యోగాల కల్పనలో బెంగళూరును అధిగమించాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఐటీ ఎగుమతులతో పాటు వరి ధాన్యం ఉత్పత్తిలోనూ తెలంగాణ అగ్రస్థానంలో ఉందని కేటీఆర్ తెలిపారు. ప్రభుత్వం మౌలిక వసతులతో పాటు పరిపాలనా సంస్కరణలపై ప్రధానంగా దృష్టి సారించింది. టీఎస్ ఐపాస్, భవన నిర్మాణాల అనుమతుల కోసం టీఎస్ బీపాస్‌ను ప్రవేశపెట్టాం. తెలంగాణ విధానాలను అనేక రాష్ట్రాల ప్రతినిధులు వచ్చి అధ్యయనం చేశారు. హైదరాబాద్ అభివృద్ధిని అనేక మంది ప్రముఖులు ప్రత్యేకంగా ప్రశంసిస్తున్నారు. ముంబై తర్వాత ఎత్తైన భవనాలు కలిగిన నగరంగా హైదరాబాద్ స్థానం సంపాదించుకుందని కేటీఆర్ తెలిపారు.

**బుల్లెట్ ట్రైన్ కన్నా వేగంగా తెలంగాణ అభివృద్ధి :** తెలంగాణ బుల్లెట్ ట్రైన్ కన్నా వేగంగా అభివృద్ధి చెందుతుందని మహారాష్ట్ర ప్రతినిధుల బృందం పేర్కొంది. గత పదేండ్లలో హైదరాబాద్ అద్భుతంగా అభివృద్ధి చెందిందని కొనియాడారు. పరిపాలకులకు సరైన విజన్ ఉంటే అభివృద్ధి చెందుతుందనడానికి తెలంగాణ ఉదాహరణ అని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కృషితో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతుందని మహారాష్ట్ర ప్రతినిధులు పునరుద్ఘాటించారు.

# తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ప్రతిరోజూ పండగే



సంగారెడ్డి: తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ప్రతిరోజూ పండగే అని మంత్రి హరీష్‌రావు అన్నారు. శనివారం పటాన్ చెరు జీఎంఆర్ కన్వన్షన్‌లో మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా బీసీ, ఎంబీసీలకు, మైనార్టీలకు చెక్కుల పంపిణీ జరిగింది. జీఓ 58, 59 పట్టాల పంపిణీతో పాటు కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డితో కలిసి అందజేసిన మంత్రి హరీష్ రావు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రాష్ట్రంలో కనీవినీ ఎరుగని రీతిలో మెడికల్ కాలేజీలు వచ్చాయన్నారు. ఏడాదికి 10వేల మంది వైద్యులను తయారు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఎదిగిందని తెలిపారు. పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేస్తూ కృష్ణాజలాలను ఎత్తిపోతల పథకం ద్వారా నీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాలలో కరువు, కష్టాలు తాండవిస్తుంటే మన తెలంగాణా మాత్రం కేసీఆర్ పాలనలో సుభిక్షంగా శోభిల్లుతుందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ సుధీర్ఘకాలం పాలన సాగించినా ప్రజలకు చేసిందేమి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదరికాన్ని తగ్గించలేకపోయిందని... కేవలం పేదరికాన్ని మాత్రమే పెంచిందని మంత్రి తెలిపారు. మైనార్టీల అభివృద్ధికి, సంక్షేమానికి ఏ ఇతర రాష్ట్రాలు కేటాయించని విధంగా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్న రాష్ట్రం తెలంగాణయే అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష పార్టీలు కేవలం ఓట్లను లూటీ చేసేందుకు కుట్ర పన్నుతున్నాయన్నారు. త్వరలోనే మెట్రో రైలు మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు విస్తరణ జరగబోతుందని చెప్పారు. పఠాన్‌చెరు నియోజకవర్గంలో దాదాపు 173 దేవాలయాలను నిర్మాణం చేసిన ఘనత బీఆర్ఎస్ దే అని అన్నారు. 60 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎందుకు నీళ్లు ఇవ్వలేదు, ఉద్యోగ నియామకాలు, నాణ్యమైన విద్యుత్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ హామీలు గుప్పించిన ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని. మోసపోతే.. గోస పడతామని మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు.

# తెలంగాణలో మతఘర్షణలు లేవు : అసదుద్దీన్ ఓవైసీ



హైదరాబాద్: గడిచిన 9 ఏళ్ల నుంచి తెలంగాణ రాష్ట్రంలో మతఘర్షణలు లేవని, ఈ రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా సాగుతోందని, దేశంలోనే హయ్యెస్ట్ జీడీపీ తెలంగాణలో ఉన్నట్లు ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తెలిపారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యూసీ సమావేశాలు నిర్వహిస్తున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ రాజకీయ పార్టీ అయినా, తమకు కావాల్సింది చేసుకోవచ్చు అని, కానీ సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అత్యద్భుతంగా అభివృద్ధి చేస్తున్నట్లు ఓవైసీ వెల్లడించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ముస్లిం విద్యార్థులకు ఆరు నుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు.

# 80 వేలకు పైగా పుస్తకాలు చదివిన కేసీఆర్‌కు ఈవిషయం తెలియదా..?

హైదరాబాద్: తెలంగాణ విమోచన దినోత్సవం రోజున సీడబ్ల్యూసీ సమావేశాన్ని ఎందుకు ఏర్పాటు చేశారని కాంగ్రెస్ నేతలను తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం నాడు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్రం ఆధ్వర్యంలో రేపు జరగనున్న..విమోచన దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హాజరుకానున్నారు. రాత్రికే బీజేపీ అగ్రనేత అమిత్‌షా హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. "తెలంగాణ చరిత్రను ప్రజలకు తెలియకుండా చేయాలన్నదే కాంగ్రెస్ లక్ష్యమా..?భాగ్యలక్ష్మి టెంపుల్ వద్ద కాంగ్రెస్ నాయకులందరూ రక్తం కారే విధంగా ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విమోచన దినోత్సవం జాతీయ సమైక్యత దినోత్సవం ఎలా అవుతుందో తెలంగాణ సీఎం కేసీఆర్ చెప్పాలి. జాతీయ సమైక్యత దినోత్సవం అని పేరు ఎలా పెడుతారు. 80 వేలకు పైగా పుస్తకాలు చదివిన కేసీఆర్ జాతీయ సమైక్యత దినోత్సవం పైన బహిరంగ చర్చకు రావాలని కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు.కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని బీజేపీ కార్యక్రమంగా పోలీసులు చిత్రీకరించడాన్ని తీవ్రంగా ఖండించారు.బీజేపీ కార్యక్రమం అంటూ సర్క్యులర్ విడుదల చేసిన పోలీస్ అధికారుల పైన కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తుంది" అని కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తరతరాల ఎదురు చూపులు ఫలించే వేళ... పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై కేటీఆర్

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును సీఎం కేసీఆర్ ఈరోజు(శనివారం) ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. ఈ సందర్భంగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా తమ ఆనందాన్ని పంచుకున్నారు. "తరతరాల ఎదురు చూపులు ఫలించే వేళ .. పల్లేర్లు మొలిచిన పాలమూరులో పాలనురగల జలహేల!. వలసల వలపోతల గడ్డపైన ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం ఆవిష్కృతం! కరువు కరాళ నృత్యం చేసిన భూముల్లో కృష్ణమ్మ జల తాండవం! శెలిమలే దిక్కైన కాడ ఉద్దండ జలాశయాలు..! బాయిమీద పంపుసెట్లు నడవని చోట బాహుబలి మోటర్లు ..! స్వరాష్ట్ర ప్రస్థానంలో సగర్వ సాగునీటి సన్నివేశం..! ఆరు జిల్లాలు సస్యశ్యామలం దక్షిణ తెలంగాణకు దర్జాగా జలాభిషేకం! నిన్న..పరాయి నేలపైన ప్రాజెక్టులకు రాళ్ళెత్తిన పాలమూరు లేబర్ ! నేడు..సొంత భూమిలో ప్రాజెక్టుల కింద రతనాలు పండిస్తున్న ఫార్మర్..! నాడు ..నది పక్కన నేల ఎడారిలా ..ఎండిన విషాదం ! సమైక్య పాలకుల పాపం.. కాంగ్రెసోళ్ల శాపం! బిర బిరా తరలి వెళ్తున్న కృష్ణమ్మను బీడు భూములకు రప్పించేందుకు స్వయం పాలనలో సాహస యజ్ఞం! ఆటంకాలు అవరోధాలు అధిగమించి ప్రతి పక్షాల కుట్రలు కేసులు ఛేదించి సవాల్ చేసి సాధించిన విజయం! నీటి వాటా తేల్చకుండా నిర్లక్ష్యం అనుమతుల్లో అంతులేని జాప్యం. ఐనా.. కేంద్ర సర్కారు కక్షను వివక్షను దీక్షతో గెలిచిన దృఢ సంకల్పం! తీరిన దశాబ్దాల నీటి వెత తెచ్చుకున్న తెలంగాణకు ఇదే సార్థకత..!" అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# నమ్మితే మళ్లీ మోసపోతం.. బిడ్డల భవిష్యత్తు నాశనం : మంత్రి గంగుల

దేశాన్ని, రాష్ట్రాన్ని 60 సంవత్సరాలకుపైగా పరిపాలించిన కాంగ్రెస్, బీజేపీ అన్ని రంగాల్లో దుయ్యబట్టారు. ప్రజల కనీస అవసరాలైన విద్య, వైద్యం, విద్యుత్, సాగు, తాగునీరు అందించలేదని.. నేటికి ఆయా పార్టీల పాలిత రాష్ట్రాల్లో తాగేందుకు మంచినీరు అందించలేదని నెలకొందన్నారు. ఆయా పార్టీల నేతలు మళ్లీ ఎన్నికలు వస్తుండడంతో మాయమాటలు చెప్పేందుకు వస్తారని, వారితో జాగ్రత్తగా ఉండాలన్నారు. మళ్లీ వారి మాటలు నమ్మితే మోసపోతామని, మన బిడ్డల భవిష్యత్ నాశనమవుతుందన్నారు. బాన్సువాడలో నిర్మించిన మహాత్మాజ్యోతిభాపూలే బీసీ గురుకులం భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటుకు ముందు 56శాతం వెనుకబడిన కులాలు సరైన ఆదరణ లేక, ఆర్థిక ప్రోత్సాహం లేక, కులవృత్తులు చితికిపోయి. కనీసం విద్య అంతకుండా గోసపడ్డారన్నారు. నాడు 19 గురుకులాల్లో కేవలం 7వేల మంది బీసీ బిడ్డలు మాత్రమే అరకొర వసతులతో చదువుకునే వారని.. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ గురుకులాలను 327కి పెంచి 1.85లక్షల మంది బిడ్డలను సంవత్సరానికి ఒక్కొక్కరికి రూ.1.25లక్షలు ఖర్చు చేసి ప్రపంచస్థాయి విద్యనందిస్తున్నారన్నారు. 5వ తరగతి నుంచి డిగ్రీ దాక ఉచితంగా విద్యను అందిస్తున్నారని, వీటిలో చదువుతున్న బిడ్డలు ఇంట్లో ఇంగిష్ మాట్లాడుతుంటే తల్లిదండ్రులు సంతోషపడుతున్నారన్నారు.

ఆ సంతోషం కోసమే చావుకు తెగించి కేసీఆర్ తెలంగాణను సాధించారన్నారు. నేడు జిల్లాకొక మెడికల్ కాలేజీ దేశంలో తెలంగాణలో తప్ప ఎక్కడా లేవన్నారు. అలాగే రైతుబంధు, బీమా, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు, 24 గంటల ఉచిత కరెంటు, ఆసరా ఫించన్లు, కల్యాణలక్ష్మి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్‌కు స్పీకర్ పోచారం అంటే ఎంతో అభిమానమని, ఏపని అడిగినా కేసీఆర్ కాదనరన్నారు. బాన్సువాడ రూపురేఖల్ని పూర్తిగా మార్చివేశారన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com